ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



11-2-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


యమునా తీరానికి...



బిర్లాభవనమ్మునుంచి రాజఘాట్‌కు మహాత్ముని భౌతిక శేషమును ఊరేగింపు చేయుచు తీసుకుపోవుచున్నప్పుడు కింగ్స్‌వేలో తీసిన ఛాయాచిత్రం.



మౌంట్‌బాటెన్ దంపతులు మొదలగు పెద్దలు స్మశాన వాటికకు ముందుగనే వెళ్ళుచున్న దృశ్యం



ఊరేగింపులో టాంకులు, శతఘ్ని దళాలుకూడా ముందు నడచి పాల్గొన్నవి.

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 40

సంచిక 22

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర మాఘ శుద్ధ పాడ్యమి బుధవారము



"ప్రార్థన సమావేశానికి..."



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ ఫిబ్రవరి నెల 11-వ తేది బుధవారము

నిమర్జనము

రేపు గురువారంతో గాంధీజీ శ్రాద్ధకర్మలు పూర్తి కాగలవు. అస్థికలను పవిత్ర ప్రవాహ జలములో కలుపుట హిందూ సాంప్రదాయానుసారమైన ఉత్తర క్రియలలో అంత్యకర్మ. ఈ అస్థికానిమర్జనము భారతదేశ పవిత్రనదులన్నిటి యందు జరుగుట జాతికి జనకుడైన ఆయనకు తగినట్లుగనే యున్నది. ఆంధ్ర దేశములో కృష్ణానది యందు కూడ నిమర్జనము చేయమని కొన్ని అస్థికలను పంపుట తమకు అసాధారణ గౌరవము జరిగినదని ఆంధ్రులు భావించిరి. గాంధీజీ సర్వ మత సమానత్వమును బోధించినప్పటికి, స్వమత ధర్మమును కాదనలేదు. ఆయన ఆధ్యాత్మికత, ఆయన అనాసక్తము లౌక్య ప్రపంచము నడుమ ఉండి, దేశవ్యవహారములను దిద్దుటకు అడ్డురానట్లుగనే ఆయన హిందూత్వము కూడ ఇతర మతముల నీతిని గుర్తించి గ్రహించుటకు ఆటంకము కాలేదు. ఆయా మతముల నైతిక సారమే ఆయనకు ప్రాధాన్యము గాని వాటి ప్రవక్తల పేర్లతో పని లేదు. మానవత్వములో ఏకత్వమును చూచినట్లే మతముల బోధనలందు కూడ ఏకత్వమును చూచెను. భారతదేశములో ప్రపంచములోని ప్రధాన మతస్థులందరూ ఉన్నారు. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, బౌద్ధులు, యూదులు, పార్శీలు మొదలైన వారందరు ఉన్నారు. ఇంకే దేశమునందు కూడ ఇంతమంది భిన్న మతస్థులు లేకపోవచ్చును. శతాబ్దముల తరబడి వారందరు ఎవ్విధమైన ద్వేష భావము లేక నివసించిరి. అదే భారతదేశ ఉత్కృష్ట లక్షణము. అందువల్లనే భారతదేశము సర్వమత సమన్వితమైన సందేశమును, సంస్కృతిని ప్రపంచమునకు ఇవ్వగల స్థితియందున్నది. గాంధీజీ ఆ మతముల, ఆ సంస్కృతుల దీప్తి అని చెప్పవచ్చును. పండిత నెహ్రూ చెప్పినట్లు వాస్తవమునకు ఆ దీప్తి అంతరించ లేదు. ఈ భూమిని వేయి సంవత్సరముల వరకు కాంతి వంతముగ చేయుచునే యుండగలదు.

ఉచితానుచితాలు

గాంధీజీ హత్యావకాశమును పురస్కరించుకొని కమ్యూనిస్టులు, సోషలిస్టులు మొదలైన పక్షములు, భారత ప్రభుత్వమును, ముఖ్యముగా సర్దార్ పటేలును అల్లరి పాలు చేసి, తమ ప్రాబల్యవ్యాప్తికి తాపత్రయ పడుట శోచనీయము. భారత ప్రభుత్వమును గాని, సర్దార్ పటేలును గాని విమర్శించుటకు అవకాశమున్న అది, వారు రాష్ట్రీయ స్వయం సేవక సంఘ ప్రయత్నముల ప్రమాదమును తగినంతగా గుర్తించలేక పోయిరనుట తప్ప మరొక మాటకు ఆస్కారము లేదు. సర్దార్ పటేల్ పైన అభాండములు వేయుటకు వ్యక్తిగతమైన కార్పణ్యము మూలము.

తమ దుశ్చర్య కార్యనివృత్తికి గాను భారత ప్రభుత్వము రాజీనామా నిచ్చి పునర్నిర్మాణము కావలెనని సోషలిస్టులు కోరుటతో, తాము సహకరించెదమను సూచన శోభపోయినది. "సర్వత్ర అంగీకరింపబడిన ప్రజా ప్రభుత్వ సిద్ధాంతముల ననుసరించి భారత ప్రభుత్వము రాజీనామా నిచ్చి పునర్నిర్మాణము కావలెను" అని జయప్రకాశ్ నారాయణ గారనిరి. ఆసిద్ధాంతము ఎక్కడనున్నదో వారికే తెలియవలెను. తమ అవసరమును బట్టి స్వయముగా సృష్టించిన సిద్ధాంత మనవలెను. కేంద్ర శాసనసభ కాంగ్రెస్ పక్షము భారత ప్రభుత్వమునందు సంపూర్ణ విశ్వాసమును ప్రకటించినది. గాంధీజీ హత్యా ఫలితముగా ఏర్పడిన స్థితిని స్వపక్ష ప్రయోజనముకు వినియోగింప దలచుట కేవలము అసహ్యకరమని పండిత నెహ్రూ చెప్పెను. తనకు సర్దార్ పటేలుకు విభేదములు లేవని, అట్టి ప్రచారమునకు బాధ్యులైన వారిని దుష్ప్రచారకులని వర్ణించెను. వారిద్దరికీ ఏ భేదములున్న అదివరకెటులున్నప్పటికీ, గాంధీజీ అనంతరము, కేంద్ర ప్రభుత్వ విచ్ఛిన్నమునకు దారితీసి యుండెడిది. అది దేశమునకు గాంధీజీ హత్యకన్న ప్రమాదస్థితిని తెచ్చి పెట్టునది. అభిప్రాయ భేదములు లేకపోవుట వల్లనే దేశము కల్లోల పరిస్థితి పాలుగాకుండా నిలబడినది. గాంధీజీపైన కమ్యూనిస్టులకు గల క్షేమాపేక్షలు ఎవరికి తెలియవు! 1942 సం॥ లో గాంధీజీ నిర్బంధములో నుండి నిరాహార దీక్ష పూనినపుడు, ఆయన మరణించిననూ ఎట్టి సానుభూతిని ప్రదర్శించక కేవలము, మౌనము వహించవలసినదను వారి పార్టీ తాఖీదు అందరికి తెలియును.

కాంగ్రెసుకు, గాంధీజీకి వ్యతిరేకముగ లీగును, జిన్నాగారిని బలపరచిరి. గాంధీజీ మీదగాని, ఆయన తత్వమునందుగాని వారికి విశ్వాసము లేదు. నేటి అపేక్ష కేవలము నాటకము.

అదృష్టవశాత్తు దేశము ప్రమాదమును తప్పుకొని నిలబడినది. అక్కడక్కడ రేగిన అల్లరులు అణగిపోయినవి. కేంద్ర ప్రభుత్వము కూడ కృతనిశ్చయముతో వ్యవహరించినది.

రాష్ట్రీయ స్వయం సేవకసంఘమును నిషేధించుటే గాక, ఆల్వారు సంస్థానాధిపతిని, ఆయన ప్రధాన మంత్రిని ఆ సంస్థానములో కొంత కాలమువరకు అడుగుపెట్టవలదని తాఖీదు నిచ్చుట సర్దార్ పటేల్ అకుంఠిత నిశ్చయమునకు నిదర్శనము. గాంధీజీ హత్య కేవలము ఒక ఉన్మాదుని దుశ్చర్యగాక, ఒక అసాధారణ కుట్ర పన్నబడినదని తేలుచున్నది. ఆల్వారు సంస్థాన ప్రభుత్వము గాంధీజీ హత్యకు తోడ్పడినదను విషయము యావద్భారత దేశమును నిర్ఘాంత పెట్టినది. గాంధీజీనే గాక, బర్మాలో ఆంగ్ సాన్ మంత్రివర్గమును హత్య చేసినట్లు భారతమంత్రివర్గ సభ్యులను మొత్తము హత్యచేయుటకు కుట్ర పన్నబడినదను వాదు ఇప్పుడు నమ్ముటకు ఆస్కార మేర్పడుచున్నది. హిందూ రాజ్యమును స్థాపించుటకు కొందరు సంస్థానాధీశులు కూడ తోడగుచున్నారని ఆమధ్య పండిత నెహ్రూ చెప్పెను. ఇప్పుడు ఆయన మాట అర్థము బోధపడుచున్నది. రోజూ వార్తలు తెలుపుచున్నట్లు ఇంకనూ అత్యాశ్చర్యకరమైన అంశములు బయటపడవచ్చును.

[మహాత్మునికి ప్రాణప్రదమైన, అత్యంత ఆత్మీయమైన నిర్మాణ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా కొనసాగించడానికీ, మత సామరస్య స్థాపన విషయంలో ఆయన అభీష్టసిద్ధికి నిర్విరామంగా కృషి చేయడానికీ, జాతీయ స్మారక నిధితో ప్రత్యేక చిహ్నాన్ని స్థాపించడానికీ కాంగ్రెసు కార్యవర్గం తీర్మానించింది. గాంధీజీ మహోపదేశాలను త్రికరణశుద్ధిగా అనుష్ఠించడమే ఆయనకు మనం నిర్మించగల విశిష్ట స్మారక చిహ్నం. ఈ సమయంలో ఆయన దివ్య ప్రబోధాలను భారత జాతి సంస్మరించడం అవసరం. వీటిలో కొన్నిటిని ఇక్కడ పొందు పరుస్తున్నాం]

* * *

"మృత్యువు జీవితంలో ఒక బ్రహ్మాండమైన పరివర్తనం మాత్రమేననే ప్రవచనాన్ని నేను సర్వదా అంగీకరిస్తున్నాను. అందువల్ల ఎప్పుడు ఆసన్నమైనప్పటికీ మృత్యువుకు మనం హృదయపూర్వకంగా స్వాగతం చెప్పాలి. భయం అనేదానికి హృదయంలో ఏమాత్రం స్థానం లేకుండా చేయడానికి మహత్తరమైన కృషి చేశాను. మృత్యుభీతిని సైతం తరిమివేయగలిగాను. మృత్యువు సమీపిస్తున్నదని నేను గ్రహించినప్పుడు, చిరకాలంగా కానరాని ఆప్తమిత్రుని సమాగమం లభ్యం కాబోతున్నందుకు ఎవరైనా ఎంత సంబరపడతారో, అంత సంబరపడిన సమయాలు వున్నవి...

మృత్యునివారణార్థం మీరు కొన్నిరోజుల పాటు హిమాలయపర్వతాలకు పోరాదా అని ఎవరైనా నాకు సలహా ఇస్తే, ఆ సలహాను నేను ఏమాత్రం పాటించను. మానవుడు ముందుగా ఎంత జాగ్రతపడి, ఎంత శ్రద్ధ తీసుకున్నప్పటికీ, మృత్యువు అనివార్యమని నాకు తెలుసు. భారతదేశ ప్రజాహిత జీవితంలో పాల్గొంటూ తమ ఆరోగ్యాన్ని అతిజాగ్రతగా కాపాడుకోవడం ఎలాగో తెలిసిన బహుకొద్దిమందిలో నేను ఒకడిననే విషయం మీరు మరచిపోకూడదు. నాచేత ఏయే పనులు చేయించుకోవలసిందీ భగవంతుడికి తెలుసు. ఆ పరమాత్ముడు నా చేత తన పనులు చేయించుకోవడం పూర్తి అయినతర్వాత ఒకక్షణంకూడా నన్ను వుండనివ్వడు."

* * *

"ఆరోగ్యవంతమైన దేహంలో, పరిశుద్ధమైన ఆత్మ వుండడం అవసరం. దేహారోగ్యం అంటే కండకుకండ ఎదురేసి బలిష్ఠమైన శరీరాన్ని పెంచడంకాదు. దుర్బలశరీరంలోకూడా ధైర్యసాహసాలతోకూడిన ఆత్మ వుండడంకూడా కద్దు. ఒకానొక పరిణామదశలో ఆత్మపరిపక్వత వృద్ధి చెందినకొద్దీ, దైహికపుష్టి క్షీణించడం సంభవిస్తుంది. సంపూర్ణారోగ్యంగల దేహంలో ఎక్కడా మాంసకండర మన్నమాట లేకపోవచ్చు. కండలు తిరిగిన శరీరం తరుచూ అనేక రుగ్మతలకు ఆలవాలమై వుంటుంది. శరీరంలో మాంసం లేకపోయినప్పటికీ. నిర్మలమైన రక్తంతో సంపూర్ణారోగ్యాన్ని కలిగివున్న శరీరాన్ని ఇట్టి రుగ్మత లేవీ ఆశించవు... ఇట్టి పరిపూర్ణారోగ్యసాధన నా లక్ష్యాలలో ఒకటి. ఈ లక్ష్యసిద్ధికి పూర్వమే దేహయాత్ర చాలించవలసివచ్చినప్పటికీ నేను నిస్పృహ చెందను... పునర్జన్మ సిద్ధాంతంలో విశ్వాసం వున్నదికాబట్టి, నా ఆ కృషి విఫలమైందని భావించను......

జీవాత్మ శాశ్వతమైనదని నా విశ్వాసం... ఇందుకు మహాగంభీరమైన సముద్రాన్ని మీరు ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. అపార సంఖ్యాబలంగల నీటికణాల సముదాయమే మహాసముద్రం. ఐతే ప్రతి నీటిబిందువుకూ ప్రత్యేక వ్యక్తిత్వ స్వరూపాలున్నవి. ఐనప్పటికీ మహాసముద్రంలో అది ఒకభాగం. ఇదే విధంగా జీవితసాగరంలో మనం నీటికణాల లాంటివాళ్ళం."

* * *

పునర్జన్మ ఎత్తాలని నాకు లేదు. పునర్జన్మ ఎత్తడమే సంభవిస్తే, ఒక అస్పృశ్యుడనై జన్మించాలని నా వాంఛ. అప్పుడుగాని అస్పృశ్యుల కష్టాలలో, దుఃఖాలలో, అవమానాలలో భాగస్వామిగా సంచరించడానికి వీలుకాదు. నేను నా సాటివారు కూడా కష్టపరంపర నుంచి, దౌర్భాగ్య పరిస్థితులనుంచి తరించేటట్టు కృషి చేయడానికి సాధ్యపడుతుంది. కాబట్టి

మహాత్ముని దివ్య ప్రబోధ సంస్మరణ

తిరిగి జన్మిస్తే, బ్రాహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులలో కాక, 'అతి శూద్రుడు' (అస్పృశ్యుడు) గా జన్మించాలని నేను కోరుకుంటున్నాను...

ఒక శూద్రవాడిని చూపించి, "వాడిని నీవు తాకవద్దు—వాడు అస్పృశ్యుడు", అని మా అమ్మ ఒకప్పుడు చెప్పింది "తాకితే ఏమి?" అని నేను ఆమెను ప్రశ్నించాను. అస్పృశ్యతా విధానంపై నా తిరుగుబాటుకు అదే ప్రారంభం"

* * *

ఆత్మ పారిశుద్ధ్యాన్ని సాధిస్తేనే గాని మనం ఏ సమస్యతోనూ సంపూర్ణంగా ఐక్యం కాలేము ఆత్మ పారిశుద్ధ్యం లేనిదే, అహింసావ్రతాచరణ అసంభవమవుతుంది హృదయ నైర్మల్యం లేని వ్యక్తి దైవానుభూతిని పొందలేడు ఆత్మ పారిశుద్ధ్యావశ్యకత మాత్రం జీవితంలోని వివిధ వృత్తులకూ వర్తిస్తుంది.

ఒక్క వ్యక్తి ఆత్మ పరిశుద్ధతను సాధిస్తే అది ఇరుగుపొరుగుకు, పర్యవసానంగా సర్వత్రా వ్యాపిస్తుంది.

ఐతే దీని సాధనమార్గం అతి కష్టభూయిష్ఠమైనది మనసా, వాచా, కర్మణా ఏవిధమైన ఆగ్రహోద్రేకాలు పనికిరావు కామ, క్రోధ, లోభ, మద మాత్సర్యాలను అధిగమించాలి."

* * *

"ఏ విషయాన్నైనా రహస్యంగా వుంచడం మహాపాతకమని నా నమ్మకం. మనం చేసే ప్రతి చర్యను, మాట్లాడే ప్రతి మాటను భగవంతుడు ప్రత్యక్షంగా చూస్తూనే వున్నాడని గుర్తించినట్లయితే, ఈ ప్రపంచంలో ఎవరితోనూ ఏ విషయాన్నీ రహస్యంగా వుంచవలసిన అగత్యం లేదనే సంగతి బోధపడుతుంది. భగవంతుడి ఎదుట మనకు అపరిశుద్ధ భావాలుంటాయా? వాటిని ఉచ్చరించడానికి నోరు వస్తుందా? ఈ మనపనులకు రహస్యాన్ని, మరుగును కోరడం కూడా మానసిక అపరిశుద్ధత అనే చెప్పవలసి వస్తుంది. మరికిని, అపరిశుద్ధతను దాచి వుంచడం మానవ ప్రకృతి. అపరిశుద్ధతను చూడడానికి గాని, మురికిపదార్థాలను తాకడానికి గాని మన మనస్సు ఒప్పదు. అందువల్లనే వాటిని మన కళ్ళపడకుండా చేస్తాము. మనం మాట్లాడే భాష విషయంలో కూడా అంతే. ప్రపంచం ఏ దుర్భావాలను వినకూడదని కోరుకుంటామో వాటి జోలికే మన మనస్సును పోనివ్వకూడదు.

మహాపాతకాలన్నీ రహస్యంగా జరిగేవే. మన చర్యలే కాక, భావాలను కూడా భగవంతుడు పరీక్షిస్తున్నాడని గ్రహించినప్పుడే మనకు ముక్తి......

చేసిన తప్పిదాన్ని ఒప్పుకోవడం చీపురుతో మురికిని తుడిచి శుభ్రం చేయడంలాంటిది.

చేసిన తప్పు ఒప్పుకోవడం, తిరిగి ఎన్నడూ చేయనని శపథం చేయడం అత్యుత్తమమైన పశ్చాత్తాపం. ఇందుకు ఒకటే ఉదాహరణ. రోగి తన వ్యాధిని కప్పిపుచ్చగలడా? ఆ విధంగా చేస్తే, తనకు తానే శత్రువవుతాడు!

* * *

"లక్ష్యం ప్రధానంగాని దాన్ని సాధించే మార్గం ఏదైనా కావచ్చునని కొందరువాదిస్తారు. మనం అనుసరించే సాధన మార్గాన్ని బట్టే మన లక్ష్య పర్యవసానం వుంటుంది. కాబట్టి, సాధన మార్గమే ప్రధానమైనదని నా వాదన. దౌర్జన్య పద్ధతుల ద్వారా సాధించే స్వరాజ్యం చివరకు దౌర్జన్యంగానే పరిణమిస్తుంది. ఫ్రాన్సు తన విమోచనను దౌర్జన్యమార్గం ద్వారానే సాధించింది. అందువల్లనే నేటికీ ఆ దేశం పడరాని పాట్లు పడుతున్నది... సాధన, లక్ష్యం ఇవి రెండూ అవిభాజ్యమైనవి. భగవంతుడు మనకు ఒక్క సాధన మార్గాన్ని మాత్రమే నిగ్రహించే శక్తిని ప్రసాదించాడు. పర్యవసానాన్ని మనం నిగ్రహించి పట్టుకు రాలేము మనం అనుసరించే సాధనమార్గం ఎంత ఉత్తమమై వుంటే, ఫలితం కూడా అంత ఉత్తమంగా వుంటుంది. ఈ ప్రతిపాద. అప్రతిహతమైనది."

* * *

"భారతదేశంలో చెప్పుకోదగిన సమస్త విషయాలు నన్ను సర్వకాల సర్వావస్థలలో అపరిమితంగా ఆకర్షిస్తుంటవి అత్యున్నత ఆశయాల కోసం పరితపించే ప్రతి మానవుడికీ కావలసిన సర్వసాధన సామగ్రి ఈ దేశంలో లభ్యమవుతుంది. భారత దేశం కర్మభూమే గాని భోగభూమి కాదు పాశ్చాత్యులకు పాదాక్రాంతమై వుండే భారతదేశం ప్రపంచ మానవకోటికి ప్రబోధాత్మకంగా పరిణమించి ఆశాజ్యోతిని వెలిగించలేదు గాఢాంధకారం నుంచి మేల్కొన్న స్వతంత్ర భారతదేశం క్రుంగి కృశించిపోతున్న పీడిత ప్రపంచానికి శాంతిసౌజన్య సందేశాలను అందజేయగలిగిన స్థితిలో వుంటుంది

ప్రపంచ ప్రజా క్షేమంకోసం హృదయపూర్వకమైన నిర్మల త్యాగం చేయాలంటే, బలిష్ఠమైన స్వతంత్ర భారతదేశం ఏర్పడటం అవసరం. ఒక విశుద్ధజీవి తన కుటుంబంకోసం, గ్రామంకోసం, గ్రామంఅంతా కలిసి జిల్లా కోసం, జిల్లాలన్నీ కలసి రాష్ట్రం కోసం, రాష్ట్రాలన్నీ కలిసి జాతికోసం త్యాగం చేయడానికి సిద్ధపడి వుండాలి.

భారతదేశ స్వాతంత్ర్యం శాంతి, యుద్ధ సమస్యలలో ప్రపంచ దృక్పథాన్ని విప్లవాత్మకంగా మార్చివేయగలదు భారతదేశం నిస్తేజమైపోతే, ప్రపంచ ప్రజాకోటికంతకు అది పెద్ద దెబ్బ.

భారతదేశం చరిత్రలో ఎన్నడూ ఏ జాతి మీదా యుద్ధం చేయలేదు. కేవలం ఆత్మరక్షణ కోసం బాహ్యశత్రువులను తగినంత కట్టుదిట్టం చేసుకోకుండానే అప్పుడప్పుడు ప్రతిఘటించింది. అందువల్ల భారతదేశం ప్రత్యేకించి శాంతికాంక్షను అలవరుచుకోవలసిన అగత్యంగాని, అభివృద్ధి చేసుకోవలసిన అగత్యంగాని లేదు. పవిత్రశాంతికాంక్ష ఈ దేశంలో పుష్కలంగా వున్నది శాంతిమార్గాన స్వాతంత్ర్యాన్ని సాధించడం ద్వారా, భారతదేశం ప్రపంచశాంతికి దోహదం చేసినదవుతుంది "

* * *

భారతదేశం దౌర్జన్య విధానాలనే పాటించినట్లయితే, అట్టి వాతావరణంలో నేను జీవించి వుండడం అసంభవం అప్పుడు ఈ దేశాన్ని తలచుకొని గర్వించనే గర్వించను. ధర్మసమ్మతమైన మతం ముఖ్యమైనది; దేశభక్తి స్థానం కూడా దాని తర్వాతనే తల్లి రొమ్మును పసిపాప ఏవిధంగా కరుచుకొని వుంటుందో, భారత దేశానికి నేను ఆవిధంగా కరుచుకొని వున్నాను నాకు కావలసిన ఆధ్యాత్మిక పుష్టిని భారతదేశం ఇస్తున్నది నా ఉన్నతాశయాలకు అనువైన వాతావరణం ఆశ్రయం మనదేశములో వున్నవి ఆ నమ్మకం కొంచెం పోయినా నాకు, తలిదండ్రులను కోల్పోయిన నిరాధారజీవి నవుతాను."

* * *

క్రమశిక్షణతో విశాలహృదయంతో కూడిన ప్రజాస్వామ్యం ప్రపంచంలో మహోత్కృష్టమైనట్టిది అజ్ఞానంతో, వక్రబుద్ధితో, మూఢ విశ్వాసాలతో కూడిన ప్రజాస్వామ్యం అశాంతి హేతువవుతుంది పైగా, అట్టి ప్రజాస్వామ్య విధానం దాన్ని అదే ధ్వంసం చేసుకొంటుంది నేను ఆకాంక్షిస్తున్న ప్రజాస్వామ్య ఆచరణలో బలప్రయోగానికి ఏవిధమైన అవకాశమూ లేదు

ప్రజా బాహుళ్యానికి ప్రత్యేక బుద్ధి కుశలతగాని, ముందాలోచన గాని వుండదు కాబట్టి, వారికి శిక్షణ ఇవ్వడం చాలా సులభమైన పని సర్వసాధారణంగా ప్రజానీకం ఆగ్రహావేశంతో ప్రవర్తిస్తుంది వెంటనే పశ్చాత్తాప పడతారు ప్రజాస్వామ్య పరిణామానికే నేను అసహాయోద్యమానికి ఉపక్రమించాను సువర్ణతుల్యమైన పవిత్ర హృదయాలతో దేశంకోసం పరితపిస్తున్న ప్రజా బాహుళ్యాన్ని శిక్షణ ఇచ్చి క్రమమార్గాన పెట్టాలి స్వార్థరహితమైన బుద్ధి కుశలత, త్రికరణశుద్ధిగల కొందరు ప్రచారకులతో జాతినంతనూ అపక్రమ మార్గం నుంచి ప్రజాస్వామిక మార్గాన నడపవచ్చు. ప్రభుత్వంగాని, ప్రజలుగాని దౌర్జన్యభూయిష్ఠమైనమార్గాన సంచరించినంతకాలం, ప్రజాస్వామ్యసిద్ధాంతాలను స్థాపించలేము ప్రభుత్వం అనుసరించే దౌర్జన్యవిధానంకంటే కొన్నిసందర్భాలలో ప్రజలు అనుసరించే దౌర్జన్యపద్ధతే ప్రజాస్వామ్యపరిణామాభివృద్ధికి ప్రబలశత్రువై నిలుస్తుంది ప్రజాస్వామ్యాకాంక్ష ప్రతిమానవుడికీ లోపలినుంచి రావలసిందిగాని, ఇతరుల ర్బంధంవల్ల వచ్చేది కాదు..

ప్రజాస్వామ్యం, దౌర్జన్యం ఈ రెంటికీ ఎక్కడా పొత్తు కుదరదు... నాజీ మాదిరి గానే రాజ్యాలుకూడా అహింసావిధానాన్ని అనుసరించవచ్చు అట్టి అసంభవమనడం శుద్ధ అవివేకం

* * *

"ప్రతివ్యక్తీ స్వీయదౌర్బల్యంవల్లనే తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోతాడని నా గాఢనమ్మకం.

ఆత్మగౌరవంగల ప్రతివ్యక్తికీ ఇనపసంకెళ్ళు ఎంత హేయనీయమైనవో, సువర్ణశృంఖలాలు కూడా అంతే హేయనీయమైనవి అసలు శృంఖలాలే దుర్భరమైనవిగాని, అవి ఏ లోహంతో తయారైనవనే విషయం ముఖ్యమైనది కాదు.

ఆహారవిహారాలకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ప్రతిజాతికీ ఎంత అర్హత వున్నదో, దాని పరిపాలక వ్యవహారాలను అదే చూసుకోడానికి కూడా ప్రతిజాతికీ సమస్తహక్కులూ వున్నవి."

భారత శాసన సభలో నెహ్రూ జోహార్లు

"ముందు రానున్న శతాబ్దాలలో, భావియుగాలలో ప్రజలు భగవదంశసంభూతుడైన ఈ గాంధిజీ అవతరించి సంచరించిన భూమిమీదనే అత్యల్పులమైన మనం కూడా సంచరించామని చెప్పుకుంటారు. ఆ మహామహుడికి సమకాలికులమనే అర్హతకు మనం పాత్రులం కావలసిన బాధ్యత మనపై వున్నది.

...మన అమూల్య పెన్నిధానాన్ని కాపాడుకోలేక పోయినందుకు వ్యక్తిగతంగానూ, భారత ప్రభుత్వ ప్రతినిధిగానూ మహా క్షమాపణను భరిస్తున్నాను. ఒక హిందువే ఈ మహాపాతకానికి ఒడిగట్టినందుకు హిందువునైన నాకు తలవంపుగా నున్నది" అని ప్రధాని నెహ్రూ అధిపనేశ శాసన సభలో ఫిబ్రవరి 2 వ తేదీన తన గాఢసంతాపాన్ని వెలిబుచ్చి, మహాత్మునిసేవకు జోహార్లు అర్పించారు.



మహాత్ముని చివరి ఉపవాసదీక్ష విరమణకు, ఖ్వాజా కుతుబుద్దీన్ భక్తియార్ హాక్ ఉరుసు జయప్రదంగా జరపాలని షరతు పెట్టారు. నాటి ఉరుసులో ప్రార్థన సమావేశానికి మహాత్ముడు వెళ్తూన్న దృశ్యం.

నవల

నారాయణభట్టు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౭౮

బుద్ధజయంతి: చంద్రగ్రహణము

రాజభటులా విదూషకులను బంధించి నృపకామదండనాథాగ్రణి యెదుట నుంచగా దండనాథుడు వారికి ప్రత్యుత్థానము చేసి చిరునవ్వుతో "బుద్ధజయంతి, చంద్రగ్రహణము రేపు గదా!" యని పలకరించెను.

వృద్ధవిదూషకుడు, "దండనాథా, మీ భటులు తొందరపడి యీనాడే రాజరాజచంద్రగ్రహణము చేసినారు. ఏమి చేయగలము!" అని బరులు చెప్పెను.

పడుచు విదూషకుడు చిరునవ్వుతో నన్నశాసన మలంకరించెను. అందుకు సంతోషపూర్ణులైన పిమ్మట నృపకామదండనాథుడాతని కానాటి వృత్తాంత మంతయు నివేదించెను. అది విని, రాజరాజనరేంద్రుని నిజ్జయ్యపెగ్గడలనే పారపాటున బంధించి తెచ్చితిమని రాజభటులు గడగడ లాడిపోయిరి. అది గమనించి వృద్ధవిదూషక వేషధారియగు నిజ్జయ యా భటులను కిలిపించి చక్కగా సత్కరించెను.

ఆనాడు నృపకాముని మందిరమునుండి రాజరాజు సర్వాలంకార భూషితుడై పట్టపుటేనుగుపై పట్టణవీథుల మహావైభవముతో నూరేగెను. అతని కిరుపార్శ్వముల నృపకాముడును నిజ్జయయును ఉత్తమాశ్వము లధిరోహించి వెడలిరి. ఆ యూరేగింపునకు రెండుప్రక్కలను పౌరనికరులు అశ్వికులు పదాతులు వేనవేలు నిలిచి రక్షచేయు చుండిరి. చక్రకోట్యము యువరాజు జయించిన వృత్తాంతమును కొప్పము యుద్ధమున చోళవిజయమును, రాజమహేంద్రవరమున విద్రోహమర్దనమును పటములపై ప్రకటించి అనేక విధముల గానము చేయుచు నూరేగిరి. వంది మాగధులు కైవారములు చేయుచు ముందు సాగుచుండిరి. భేరీశంఖకాహళాది విజయవాద్యములు ఘోషించుచుండెను. పౌరుల వందనములను పురసువాసినులిచ్చు మంగళహారతులను పుష్పాంజలులను గ్రహించుచు వీరమన్మథాకారముతో రాజరాజనరేంద్రుడు కన్నులపండువుగా నూరేగెను.

మరునాడుదయమున కోటగుమ్మము ముందు విశాలమగు పందిరియొకటి వేసిరి. అందు వితానము క్రింద సింహాసనమున రాజరాజు ఆసీనుడయ్యెను. విద్రోహుల నణచివేయుటలో సామర్థ్యము రాజభక్తి చూపినవారందరకు ముందు అమూల్యములగు బహుమానములు నూతనబిరుదములు ప్రసాదించిరి. అట్టి గౌరవము లందినవారిలో నగ్రగణ్యులు నృపకామదండనాథుడు, జననాథుడు, రాజమయ్య, ముప్పరాజు! వారి నవి రాజరాజే స్వహస్తములతో సభాముఖమున బహూకరించెను. ధైర్యము చూపిన సమస్త వీరులకును రాజసేవలో ప్రాణములు వదలిన వీరభటుల కుటుంబములకును తగురీతి బహుమానములును, జీవనములను ప్రసాదించెను. ద్రోహుల క్రూరకృత్యములచే నష్టమునొందిన జనములకు కూడ సహాయము చేసెదనని ప్రతిజ్ఞ చేసెను.

అట్లా బహూకరణసభ యుదయమున పూర్తి చేసి మధ్యాహ్నము ప్రధానాధికరణము ప్రారంభించెను. ఆ యధికరణమున నధికారి స్వయముగా రాజరాజనరేంద్రుడే. ఆనాడిచ్చు తీర్పులకు తిరుగులేదు. చీదమార్యుడు, ప్రాడ్వివాకుడు, పావులూరి మల్లనగణకుడు, గండాచార్యుడు లేఖకుడు—వండనాథులే సూచకులు. వారందరు నీలాంబరములు ధరించిరి.

ఆ సభ యమసభ్యరాజసభ ననుకరించుచు సదా తిథ భయంకరముగా నుండెను. రాజభటులందరు నీలాంబరములు ధరించి యముభటుల వలె యుండి బంధితుల నొక్కరొక్కరినే ప్రవేశపెట్టుచుండిరి.

ముందు కుమారసప్తకములో రాజభటులకు కొరికిన విజయాదిత్యుడు, విమలాదిత్యుడు, విక్రమాదిత్యుడు, కృష్ణగణుడు నను నలుగును రాజమందు రాజమయ్యదండనాథుడు నిలబెట్టి వీరు రాజద్రోహాలలో ప్రధానులనియు నింత జనక్షయమునకు కారకులనియు నభియోగము చదివెను. వారికి వారు ప్రత్యాఖ్యానము చేయలేదు. శిరచ్ఛేదము శిక్ష వేసి పంపివేసిరి. మల్లప్ప, కామయ, రాజమార్తాండుడు పారిపోయిరి. వారును, పారశీకులును, సైంధవులును చిక్కలేదు.

వచ్చితి మార్గమున మంత్రి పరిశములు చేసి నన్ను గురువాజ్ఞ దాటని ఘోరప్రతిజ్ఞలు చేయించెను. అపిమ్మట నాస్నేహము పరీక్షించెద నిన కామశిక్ష వేడెను. నేనది తిరస్కరింపగా సర్వవిధముల నన్ను భయపెట్టి కృతఘ్నతవలన భవించెదనని భయపెట్టి కొంతకాలమునకు కృతఘ్నుడయ్యెను. నేను చేసిన ఘోరప్రతిజ్ఞలకు బద్ధుడై అతనికే దేహ మప్పగించితిని. నాకు నిజముగా విరక్తి కలిగి ప్రజాదులందు సహ్యము కలిగి నా గ్రస్తుగువారి ఉపకారములు చేయుచు వారి బాధ శాంతినివారణ చేయుటకు యత్నించుచున్నాను. ఈ మ్లేచ్ఛ సభిక నీతడు సంఘారామము. కొంతకాలము బంధించి వాడు"

ఆ కథ విని రాజు జే తలంచెను. జేతారి నాగడునాశ్రమము శిరస్సు నాల్గుతెగు" "ఈ సభలో నైన ప్రత్యుత్తర మీయ నక్కరలేగ!

అంతట రాజమహేంద్రవర సభాపతి లేచెను.

"సంకరజాతిని సంఘారామమున జాగ్రత్త సాధులు కృష్ణశాస్త్రులు బ్రాహ్మణుని తురీయాశ్రమ్యదీక్షము చేసితిమని యతడు మహాయానాచారముల వలంబించుచున్నందున నతనిని చాతుర్వర్ణ్య పద్ధతినుండి బహిష్కరించి సమాని హ్రస్వమగ్నమున తప్తముద్రాంకితము చేసితిమని యతడు మారువేషముతో నిచ్చట నున్నట్లు తెలియవచ్చుచున్నందని శ్రీముఖపత్రిక తమకు వినిపించిరి. ఈ జేతారినాగుడే ఆ కృష్ణశాస్త్రి! సక్షుస్సులను పరీక్షింపవచ్చును!"



గాంధీజీని తమ పాలతో పోషించిన మేకలు

ఆ పిమ్మట సాంగిధానపెట్ట సంఘారామము కధ్యక్షుడగు జేతారినాథుడు నిలువబెట్టబడెను. సంఘారామమును ఆయుధాగారముగా మార్చి వేసి రాజభవనమునైన విజయమునకు ముందు పురికొల్పిన దీతడే యని జననాథదండనాథు డభియోగము చదివెను.

జేతారినాథుడు నిలువున నిలుచుండి నిర్లక్ష్యముగా, "సంఘాధ్యక్షుడనగు నన్ను విచారణ చేసి తీర్పు చెప్పుటకు ఏ రాష్ట్రపతికిని అధికారము లేదు!" అని పలికెను.

ఇంతలో రాపర్తి బేతినాయకుడు లేచి, "మహారాజా, ఈతడు సర్వవిధముల పతితుడై పూజాశ్రమమును పేర ముగ్గురు స్త్రీలను మోసగించి వారికాపురములు పాడుచేసినాడని రెుక యభియోగమును గలదు 'సుజాత' అను ఉత్తమాంగన సపాసికి సాక్ష్యమీయ గలదు. మరియు నారాయణభట్టుపరిచారకుని నితడు సంఘారామములో బంధించెను" అని విన్నవించి సుజాతను నిలువబెట్టెను.

కేవలము దుఃఖమూర్తియై సుజాత ప్రమాణము చేసి తన దుఃఖకథ తెలిపెను:

"ఈ జేతారినాథుడు కల్యాణకటకము వచ్చినప్పుడు మహానుభావుడు వచ్చినాడని పలువురు స్త్రీలనుకొనుచున్నందున నేనును దర్శనమునకు వెళ్ళితిని. సంసారము మోహబంధమని నాకు బోధించి భర్తను వదలి యాతని వెంట రాజమహేంద్రవరము ఉపచారములు చేయుచు

సభాపతి పలుకులు విని సభలో నతని హృదయభాగమునుండి వచ్చినాటు తొలగిపోయి యథోక్తరీతిగా శ్రీ విద్యాశంకర భారతీ ముద్ర తప్తమై యందు దంకింపబడియుండెను. ఒక్కసారి అందరు హాహాకారములు లొనర్చిరి. రాజరాజనరేంద్రుడు ఏమిచేయను తోపక ప్రాడ్వివాకుడగు చీదమార్యునివంక తిలకించెను. చీదమార్యుడిట్లనెను:

"మహారాజా, ఈ కృష్ణశాస్త్రి జేతారినాథుడు చెప్పినానిలో కొంత సజమన్నది. ఇతడు ఉత్తమభారతీయతియై పతితుడైనాడు. అందుచే ఆరూఢపతితుడు. ఈ రాజభక్తుని తుదకు దక్షిణాపథ్యాలకుడగు నా యనుపర్మరాజు కాని యీతని పాపమునకు తగినంత శిక్ష విధింపలేరు. ఇతనికి త్రిలోకాధిపతియగు మహేంద్రుడే తగు శిక్ష విధింపగలడు. ఈ లోకములో వేయదగిన శిక్ష జగద్గురుస్వాములే విధించినారు. ఇంటనే దేశమునుండి వెడలగొట్టుటకంటె ఈ రాజసభ వేయదగిన శిక్ష లేదు!"

చీదమార్యుని నిష్కర్ష సభకు తృప్తి కలిగించలేదు. అతనిని ముక్కముక్కలుగా కోసి కాకులకు గ్రద్దలకు వేసినను పాపము లేదని పలువురు సభాసదులు తలంచుచుండిరి. కాని ప్రాడ్వివాకుని ధర్మనిర్ణయము నెవరు ఖండింప సాహసింపలేదు.

"మా దుదినములలో వేంగీమండలము నీవు విడిచిపోవలెను! అట్లు చేయనిచో నిన్ను ఎవరేము చేసినా వారికి రాజదండన ముండదు!"

రాజభటులు బంధనములు వదలించిరి. అతడూర్ధ్వబాహుడై ఉత్తరాభిముఖముగా వెంటనే బయలుదేరెను.

అంతట నగ్రకీర్తిని నిలువబెట్టిరి. రాజమయ్య యాతని విద్రోహకృత్యములు చదివెను. ఆ పిమ్మట రాపర్తి బేతినాయకుడిట్లనెను:

"ఈ బ్రాహ్మణునికి కొంచెము లౌకిక శక్తులున్నట్లు తోచును. విషచికిత్స భూతవైద్యము కొంత తెలియును. ఆ మూలముగా పలువుర భ్రమపెట్టి విద్రోహులలో చేర్చినాడితడు!"

ఇట్లనుచు పావులూరి మల్లన పరిచారకుని విచారించెను.

వజ్రకీర్తికూడ తన్ను విచారించుట కీ రాజసభకు అధికారము లేదని మాత్రము చెప్పి మౌనము వహించెను. ప్రాడ్వివాకు డేమియు నిర్వచింపలేదు. రాజిట్లనెను:

"ఇట్టి పాపాత్ముల కెట్టి శిక్ష విధించినను దోషము లేదు కాని పవిత్రమగు సన్న్యాసాశ్రమమందు నాకున్న గౌరవము చే నా వేషము ధరించిన యీ దుష్టునికిగూడ నిష్కాసనమే శిక్ష! మూడుదినములలో వేంగీమండలము సరిహద్దులు దాటిపోవలెను!"

వజ్రకీర్తియు జేతారినాథు ననుకరించుచు నుత్తరాభిముఖుడై చేతులెత్తుకొని వడలిపోయెను.

బౌద్ధశ్రమణులకందరకు నదియే శిక్ష! వారందరు నట్లే వెడలిపోయిరి.

ఆపిమ్మట చీనాయాత్రికుని నిలువబెట్టిరి. ముప్పరాజు అతనిపై నభియోగము చదివెను:

"ఇతడే వైశ్యశ్రేణిపై విద్రోహులతంత్రమును ఫరికొల్పుచు గృహదాహము చేయించెను. ఇతడు విద్రోహులకెల్ల మూలకారకుడు. ఇతడు చీనావాడు కాడు. చక్రకోట్యమండలమునుండి వచ్చిన చారుడు. రాజద్రోహమునకు ధనము వస్తువులు అనేకము తెచ్చిన దితడే. ఇతడు శ్రమణుడుకూడ కాడు. మంత్రములు తంత్రములు ఏమియు నెరుగడు. మూడువందల యేండ్లు కాదు; ముప్పదేండ్లుకూడ లేవు!"

"మూలలకు విధించు దండనమున కర్హుడు వాడు రాజా!" అనెను వాడు.

చీదమార్యుడు, "ఇతడు దూత కాడు, చారుడు! చారుడై పరదేశమున పట్టుబడిన వానికి మరణదండనము విహితము!" అనెను.

రాజు ఆజ్ఞాపించెను.

"మరణదండనము! ఇతని శిరస్సు సంఘారామము ద్వారముకొద్ద మన్నతస్థలమున వ్రేలగట్టవలెను!"

ఆపిమ్మట నాగరాజులు మరికొందరు రాజభటులు తీసుకొని వచ్చిరి "వీరు త్రైలోక్యమల్లుని చారులు. వీరు వేంగీరాజవలె కాక రాజవంశములోనూ విద్రోహము పురికొల్పిరి. రాజమందిరముపై నల్లరిలో స్వయముగా పాల్గొనిరి"

(22-వ పేజీ చూడుడు)

మహాత్మునితో నా పరిచయం

హొరేస్ అలెగ్జాండరు

గత 20 ఏళ్లలో పాశ్చాత్యులందరిలోకీ మహాత్మునితో ఎక్కువ పరిచయం సన్నిహితత్వం ఏర్పరుచుకొన్నవాడు హొరేస్ అలగ్జాండర్. ఆయన మహాత్మునితో ఉన్న తన జ్ఞాపకాలను ఈ వ్యాసంలో రచించాడు.

ఇరవై ఏళ్ళ క్రిందట సబర్మతీ ఆశ్రమంలో మహాత్మాగాంధీ, తన చుట్టూపిల్లలతో ఆడుకొంటున్నప్పటి అదృశ్యం ఇన్నేటికన్నా మెుదట నామనస్సులో మెలుగుతూంది. అదే మొదటిసారి నే నాయనను చూడటం. ఆయినతో ఆడుకొంటూంటే, ఆపిల్లలకు కలుగుతూన్న సంతోషమే, నాకు చాలాముచ్చట గొలిపింది.

ఆయన చక్కని హాస్యధోరణికూడా అల్లాగే హాయిగా మనస్సుకు నాటేది. 1930 లో లార్డు ఇర్విన్, (ఇప్పుడు లార్డు హాలిఫాక్స్) ప్రభుత్వానికీ, కాంగ్రెసుకూ రాజీ మాట్లాడేందుకు ఏదైనా దోవ దొరుకుందేమోనని, ఎరవాడ జైలుకు వెళ్ళి ఆయనతో సంప్రదించటానికి, నాకు అనుమతి యిచ్చి పంపించాడు. రెండుగంటలు మాట్లాడాక, నేను బయల్దేరాలని లేచాను. "ఇంకా నేను ఆగవలసిన అవసరమేమన్నా ఉందా" అని అడిగాను. "ఏమీ లేదు, నాతోపాటు ఉంటూ, ఇక్కడ జైలులోనో నివసిద్దామని మీకు కోర్కె ఉంటే తప్ప, ఆగాల్సిన అవసరమే లేదు" అన్నాడు.

రౌండుటేబిలు సమావేశ సమయంలో ఇంగ్లండులో ఉన్నప్పుడుకూడా, ఆయన అమితమైన ఓర్పూ, అంత మర్యాదా, అల్లాగే ఎదుటివాళ్ళకు సహేతుకంగా, నచ్చచెప్పాలని ప్రయత్నం చెయ్యటం, ఇవి గాఢంగా నా మనస్సుకు నాటుకున్నాయి.

వారాల తరబడి, రాజకీయ నాయకులు, వార్తావిలేఖరులు, వారూ, వీరూ, ఒకళ్ళేమిటి అనేకమంది వస్తూంటే వాళ్ళతో ఎడతెగకుండా గంటల కొద్దీ మాట్లాడుతూ, తమ కోరిక ధర్మమైనదని వాళ్ళకు నచ్చచెప్పటానికి ప్రయత్నించేవాడు ఇంకెవళ్లైనా అయితే, ఓర్పు పట్టలేక, చిడుముడిపాటుతో చిటబుస్సులాడేవారు. ఎప్పుడూ అల్లాంటి చిహ్నమైనా అతను చూపలేదు.

కాని, ఇలా సహేతుకంగా వాదించే పద్ధతి వదిలిపెట్టి ఒక్కొక్కప్పుడు ప్రత్యక్షచర్యకు ఉపక్రమిస్తావేమని నే నడిగినప్పుడు చాలా తేలికగా సమాధాన మిచ్చాడు. "ఒక్కొక్కప్పుడు, మనుష్యుడు మనస్సు, తప్పు భావాలతోనో, తప్పు అభిమానాలతోనో, పారలుగప్పేసుకొని ఉండి, ఎంత హేతుకంగా వాదించినా కదలిక పుట్టదు. అల్లాంటప్పుడు, అతని హృదయావేదనకు కదలిక పుట్టే, హఠాద్విధానంలో చికిత్స ప్రారంభించి, తన మూల అభిప్రాయాలను మళ్ళీ ఒకసారి అతడు పునర్విమర్శ చేసుకొనేట్లుగా చెయ్యాల్సి ఉంటుంది." అన్నాడు.

సన్నిహితత్వము

తన పరిచయులతోనూ, తన కున్న అందరి స్నేహితులతోనూ, అంత ఆప్యాయంగా, వారి వారి జీవితవిశేషాలతో అంతగా సన్నిహితత్వమేర్పరుచుకొన్న వ్యక్తిని మరెక్కడా నేను చూడలేదు. ఆయన స్వంతజీవితం, ఇంటివిషయాలకు వీట్లవిషయమే ఎక్కువ ఆతుర్దాతో చూస్తున్నట్లే ఎప్పుడూ అనిపించేది. అందరి పేర్లూ, వారు వారు చెప్పిన జీవితవిశేషాలూ అన్నీ ఆయనకు బాగా జ్ఞాపకమే.

లండనులో ఆయనతో కారులో పోతోంటే ఇంకో ఆంగ్లయువతికూడా ఆ కారులో ఉన్నప్పటివిషయం నాకు జ్ఞాపక మొస్తోంది. ఆయన లండనులో చదువుకొంటూ ఉన్నప్పటి ఇంటి యజమానురాలనే నాకు గుర్తు. ఆయనతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుందామని వచ్చింది. ఆ కారుప్రయాణంకాసేపే, వీలైన సమయమని ఎంచుకొంది. వాళ్లిద్దరూ మాట్లాడుకొంటూ ఆవిడకుటుంబాన్ని గురించీ, కొడుకును గురించీ ఆమెను అడుగుతూంటే ఆవిడ యింట్లో ఉండి చదువుకొన్నప్పటికీ, అప్పటికీ మధ్య ముప్పై ఏళ్ళుగడిచిపోయినట్లు, దక్షిణాఫ్రికాలోనూ, ఇండియాలోనూ ఆయన ఎంతో రాజకీయజీవితం గడచినట్లు, ఇవేవీ జరగనట్లుగానే అనిపించింది.

ఇంగ్లండులో ఉన్నప్పుడు ఆయనకు రక్షగా ఇద్దరు స్కాట్లండు యార్డు డిటెక్టివులను ఆయనతో ఉంచారు. ఆడిటెక్టివుల నిట్టే స్నేహితులనుగా చేసుకొన్నాడు. అక్కడనుంచి వచ్చేసేముందు ఒకనాడు మధ్యాహ్నం, లండన్ దక్షిణభాగాన్నఉన్న ఒక డిటెక్టివ్ యింటికి స్వయంగాపోయి కబుర్లు చెప్పివచ్చాడు. ఆ డిటెక్టివ్ తర్వాత ఇల్లా అన్నాడు: "నే కు చూచిన, పెద్ద పెద్దవ్యక్తులందరిలోకీ, (ఒక్క లాయిడ్ జార్జి మినహాయిస్తే) ఎక్కువ పనిశక్తి గాంధీకి ఉండేది. అయినా నాయింటికి వచ్చి నన్ను



చూసేందుకు కూడా అంగులో తీరిక చేసుకో గలిగినవాడు ఒక్క గాంధీయే."

అసలు పెద్దపట్టణాలలో, రాజకీయవేత్తల మధ్య, ఒడంబడికలు, రాయబారాలు జరుపుతూ ఉండవలసిరావటం, ఆయన కంతగా మనస్సుకు సౌఖ్యంగా ఉండేది కాదేమో ననే నాకని పించేది.

1946 లో మంత్రిత్రయ రాయబారసమయంలో, నెలలతరబడి, రాయబారాలతో విసుగూ విరామం ఎత్తిపోయాక, నాకాళీలో, ఆయన అర్థం చేసుకొంటూ, ప్రేమిస్తూన్న, పల్లెటిజనంమధ్య ఆయన్ని చూస్తుంటే ఎంతో ఆనందం, ఆశ్చర్యం వేశాయి. ఆయన మజిలీచేసిన ఒక పల్లెటూళ్లో, ఆయన ఉన్న గదిలో పైన, రంగు రంగుల అలంకారాలతో తయారుచేసిన చాందినీ కట్టారు. ఒక్కొక్కప్పుడు, ఈ యన, కళాప్రకృతిసౌందర్యాలను వేటినీ గమనించడా అనిపిస్తుంది. ఆచాందినీ చూపించి ఆయనతో ముచ్చటించాను. "ఔను. ఈ ప్రజ ఇల్లాంటివి తయారుచేయటంలోచాలా కుతూహలం చూపిస్తారు. అది చాలా అందంగా కూడా చేస్తారు. నాకు చాలా బాగుంటాయి" అని ఆయన అన్నాడు.

తన కిష్టంలేని, బాగుండని, విషయాల్లో కూడా, అంత గట్టిగానూ చెప్పగలడు. నాఖాళీ గ్రామాల్లో ఆయన ప్రవేశిస్తూంటే, తమ సంతోషాన్ని వెలిబుచ్చేందుకు, ఆడవాళ్ళు అందరూ ఒక్కసారి గింగురుమనేటట్లు నోటితో ఈల వేసి అరుస్తూ ఆయనను ఆహ్వానించేవారు. "ఇదిచాలా అసంబద్ధంగా ఉంది. నాచెవులు చిల్లులు పడుతున్నాయి" అని ఆయన వాళ్ళను వారించాడు.

ఈమధ్య బిర్లాభవనం తోటలో, ఎండ తగలకుండా, పెద్ద అంచుఉన్న గడ్డిటోపీ పెట్టుకొని, ఆయన ఉండగా కలుసుకొన్నాను. ఆ టోపీ, ఆయన కెంతమాత్రం తగినట్టుగాలేదు.

"కొత్తమాదిరి,బర్మీస్ టోపీ పెట్టుకొన్నారే?" అని అడిగాను. "పొరపాటు పడ్డారు. ఇది బర్మీసు టోపీ కాదు. ఇది నాఖాలీపల్లీయుల టోపీ. బర్మాటోపీకి ప్రయోజనమూ, అందమూ కూడా ఉన్నాయి. ఈ టోపీ కేవలం ప్రయోజనార్థమే" అని నన్ను సరిదిద్దాడు.

గత సంవత్సరం ఆయన "కలకత్తాలో చేసిన మహాద్భుతము" ఇంకా మనస్సులో ఇప్పటి విషయంలాగే మెదులుతూంది. అసలు ఆగస్టు 15 న కలకత్తాలో ఉన్నవారెవ్వరూ, ఆ విషయాన్ని మరిచిపోలేరు. అప్పుడు ఆ విషమదినాల్లో, నేను కూడా, బేలియాఘట్టంలో ఆపరివారంతో ఉన్నాను. బహు స్వల్పవిషయమైనా, ఆయనశీలాన్ని తెలిపే పట్టం ఒకటి నాకు బాగా జ్ఞాపకముంది. ఆయన రావటంతో రెచ్చిన ఉద్రేకాలు కొంత చల్లారాక, ఆయన ప్రతికక్షులు కొందరు వచ్చి ఆయనతో దీర్ఘంగా చర్చకు పూనుకున్నారు. మామూలుగా ఆయన పడుకొనేవేళ దాటిపోయి చాలా సేపయింది. చివరికా విమర్శకులలో ఒకరు "మిమ్మల్నీ రాత్రి ఇంతకన్నా ఎక్కువసేపు మెళకువగా ఉంచటం మంచిది కా"దని అన్నాడు. గాంధీజీ నవ్వుతూ, "కాదు. ఇప్పటికే చాలా సేపు నా కాలస్యం చేశారు" అన్నాడు. దీనితో ఒకవేళ వాళ్ళ కోపం వస్తుందేమోనని నే ననుకొన్నాను. కాని మర్నాడు మళ్ళీ అంతా వచ్చారు. చివరకు గాంధీజీకి వశులైపోయి, ఆగస్టు 13 న, అల్లరి చేసినవాళ్ళే, ఆగస్టు 15 న రక్షక సైన్యాలు స్థానం స్వచ్ఛంద రక్షకసేవకులుగా తామాక్రమించుకొని, ఆయనకు రక్షగానూ, అండగానూ నిలిచి, ఆయన ఉద్యమాన్ని పెంపొందించారని ప్రపంచాని కంతకూ తెలిసింది.

ఆయన విషయంలో నాకు జ్ఞాపకమున్న తుది దృశ్యం కూడా మొదటిదానిలాంటిదే. మళ్ళీ ఒక చిన్నపిల్లతో ఆడుకొంటున్నదృశ్యమే కళ్ళకు కట్టుతోంది. క్రిందటి నెల ఒకనాడు ప్రొద్దున్న ఢిల్లీవదిలి వెళ్ళిపోతున్నాను. వెళ్ళేముందు తనను చూసి వెళ్ళవలసిందనీ ఒక ఉత్తరం ఉందనీ ఆయన అని ఉన్నాడు.

నే వెళ్ళేటప్పటికి డాక్టరు సుశీలానాయరూ, ప్యారీలాల్, ఆయన మేనకోడలు చిన్నపిల్లా అక్కడున్నారు. ప్యారీలాల్ ఉత్తరం వ్రాసుకోటం పూర్తి అయ్యాక, నన్ను సంతృప్తిపరచేందుకు ఒక చిన్నఫోటో తీసి, చూపించాడు. ఆ ఫోటోలో ఆ చిన్న పిల్ల, తన ముక్కును పూర్తిగా బాపూ మొగంలోకి నొక్కుతూంది. నేను చూసి ఆబొమ్మను గాంధీజీ కందజేశాను. ఆరోజున ఆయన మౌనవ్రతము. కాని ఆ పసిపిల్లను చేతి సంజ్ఞతో పిలిచి, ఆ బొమ్మను చూస్తూ ఇద్దరూ చాలాసేపు ఆడుకొంటూ గడిపారు.

బిర్లాభవనం వదిలివస్తూ, నాలో నే అనుకొన్నాను. "ఎంత ఆనందంతో, ఉత్సాహంగా వున్నాడో, అద్భుతం" అనుకొన్నాను. 9 గంటలు దాటాక మౌనవ్రతం పూర్తిచేసికొని, ఢిల్లీలో మతసామరస్యం కుదిరేదాకా ఉపవాసము చేయటానికి నిర్ణయ మొనర్చుకొన్నట్లు తెలిపాడు. అంతటి యాతనలోనూ, నిత్యం తన చుట్టూ ఉండేవాళ్లతో కులాసాగా ఉత్సాహంతో గడుపుతున్నాడు.

అసలానాడు ప్రొద్దున్నే భారతదేశం, శాంతికోసం "చేయటమో, చావటమో!" అన్న నిశ్చయానికి వచ్చేశాకే ఆయన మనస్సు కలత తీరి ఉల్లాసంగా ఉండిఉంటుంది.

ఆ ఉపవాసం జయప్రదంగా గడిపి బైటబడ్డాకూడా, మృత్యువు అకస్మాత్తుగా, హఠాత్తుగా ఆయన్ను కాజేసింది. కాని ఆయన మృత్యువును విజయగర్వంతోనే ఎదుర్కొన్నాడు. ధర్మయుద్ధ మొనర్చాడు. తన విశ్వాసము నిలుపుకొన్నాడు. జీవితం అంతా, స్వార్థత్యాగ మొనర్చి, "నిత్యసత్యము"నకు సాక్షిగా ఆయన తన జీవితం గడపుకొన్నందున, ఆ నిత్యసత్యముయొక్క ప్రకాశము, భూమిపై మరింత దేదీప్యమానంగా వెలుగుతూంది.

అమరజీవి బాపూజీ

పరమపూజ్య బాపూజీ పరమదించారు. కాని ఆయన అమరజీవి. తన కార్యసాధనకు ఈ భౌతిక దేహము ఇకమీదట ఒక అడ్డంకుమాత్రమే నని బహుశః ఆయన భావించియుండవచ్చును. భౌతిక దేహుడై, నవద్వారముల మధ్య బంధింపబడిన బాపూజీకన్న, భౌతికదేహ విముక్తుడై సర్వత్ర వ్యాపించిన బాపూజీ వేయి మడుంగులు శక్తిమయుడు. భౌతికదేహములో బంధితుడైయున్న బాపూజీ తనకరకమలముతో ఒకపర్యాయ మొక అభాగ్య సోదరి కన్నీటిని తుడవ గలిగినాడు; కరుణాపూరిత అనునయవాక్కులతో ఒక పర్యాయ మొకరినే అనునయించగల్గెడివాడు; తన పవిత్ర సందర్శనముచే ఒక్కొక్క పాపి హృదయములోని దోషములను తొలగన మొనర్చెడివాడు. కాని ఇపుడు ఆయన అదృశ్యహస్తము, సర్వవ్యాప్త ఆత్మ, ఎల్లప్పుడు గింగురుమని చెవుల బడుచున్న సుభాషితములు ఒకేమారు అభాగ్యులనందరను అనునయింపగల్గుము; ఆయన ఆత్మత్యాగమే శతకోటి పాపుల హృదయములలోని పాపపంకిలములను తొలగనమొనర్చును. లేకున్న అమరజీవి బాపూజీ మరణించుటమేమిటి!

ఆయన స్వతంత్రభారత జనకుడేగాదు; లోకనాయకుడునుకూడ. ప్రపంచప్రముఖరాజకీయవేత్తమేగాక అధునాతన యుగమున లోకవిశిష్ట రాజకీయతత్వమును ప్రసాదించిన మహాత్ముడాయన. అరిస్టోటిల్ కాలమునుండి అబ్రహాం లింకన్ వరకు రాజకీయవేత్తలు ఊహించి, రూపించి, స్థాపించిన ప్రజాస్వామ్యమును "దౌర్జన్య" బాధనుండి విముక్తికల్పించి, "అహింసా" యుతమొనర్చి, రూపుదిద్ది, ప్రయోగించి, సఫలుడై ప్రపంచమునకు ప్రసాదించిన అనుభవైకవైద్యుడగు రాజకీయతత్వజ్ఞుడాయన.

ఆయన అపరబుద్ధుడేగాదు, అపరమనువు కూడను. పరలోకమునందుత్తమగతులు పొందుటకు ఇహలోకకృత్యములలో మత సంబంధముగా అహింసను బోధించిన బుద్ధభగవానుని, ఏసుక్రీస్తును భక్తితో సంస్మరించుచు వారి సిద్ధాంతములనే సాంఘిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగములకుకూడ వర్తించునట్లు నూతనసందేశ మిచ్చి, భారతదేశమునకేకాదు, ప్రపంచమునకంతటికి ఆయన ఒక నూతన మనుధర్మశాస్త్రమునే ప్రసాదించినాడు.


ఆయన ఋషిపుంగవుడే కాదు కేవలము అవతారమూర్తియే. భారతదేశములోను, ఇతరదేశములోను ఇదివర కెందరో మహర్షులు జన్మించినారు; సత్యాహింసామార్గావలంబనులై, తపస్సమాధిరతులై, వేదాది పవిత్ర గ్రంథరచయితలై వారు అమరకీర్తి నార్జించుకొనిరిగాని, వారి ప్రభావము, వారి శక్తి సమకాల మానవకోటిలో ఇంతగా వ్యాపించుటగాని, వారు మానవకోటికి ఇంత శ్రేయోభిలాషులై యుండి స్వకీయ తపోబలమును, అమరత్వమును త్యజించుటగాని జరిగియుండలేదు. మానవకోటి శ్రేయస్సుకొరకు ఆత్మత్యాగము నాడు క్రీస్తు, నేడు బాపూజీమాత్రమే చేయగల్గినారు.

ఆయన ఈ భౌతికదేహమును చాలించినది రుగ్మతవల్లగాదు; జరాభారమువల్లగాదు; దౌర్బల్యజనిత క్రోధోన్మాదుడై శాసించి చేయుచుండెనో గ్రహించుకొనజాలని ఒక అభాగ్యహిందూసోదరుని అకృత్యమువలన. అంతేకాదు. భారత మంత్రులనే హత్యచేయుట కిట్టి దుర్మార్గులు కొందరు కుట్రపన్నియుండుట విచారకరము. ఈ కుట్రదారులు, వారే స్థాయికి చెందినవారైనను దండనార్హులే. ఏ "దౌర్జన్య" వాదమును సంస్కరించి ప్రజాస్వామ్యమును "అహింసా"యుత మొనర్చవలెనని బాపూజీ తలపెట్టి సఫలుడైనాడో, ఆ దౌర్జన్యవాదము తిరిగి తలఎత్తుట భారతజాతికేగాదు, ప్రపంచమునకంతకు అరిష్టహేతువు. ఈ కుట్రదారులు సంస్థానాధీశ్వరులైనను, హిందూమహాసభ నాయకులైనను, రాష్ట్రీయస్వయంసేవకసంఘ నాయకులైనను మరెవ్వరైనను తప్పక దండించవలసినదే.

బాపూజీ మనలను వీడిపోయిన ఈ విచార సమయమును తమ వర్గ స్వలాభమునకు వినియోగించుకొనవలెనని కొందరు ఆలోచించుచున్నారు. బాపూజీ వియోగమునకు దుఃఖితులైన ప్రజల ఆవేశమును తమ వర్గ విరోధుల పైకి మరలించి ఎదుటి వర్గము వారిని నాశనము చేయవలెనని కమ్యూనిస్టులు దేశమందంతట ప్రయత్నించిరి. బాపూజీ పరమ ప్రియ సేవకుడు, భారతప్రభుత్వ ఉపప్రధానియగు సర్దార్ పటేల్ బాపూజీని హత్యచేయించెనని వీరు ప్రచారము చేసిరి. బాపూజీ ఏ దౌర్జన్యసిద్ధాంతమును నిరసించెనో దాని నవలంబించవలసిన దని ప్రజలకు వీరు బోధించిరి. బాపూజీ వియోగ సంతాప కాలమును స్వలాభము కొరకు సంపూర్ణముగా వినియోగించవలసిన దని కమ్యూనిస్టు పార్టీ కేంద్రమునుండి ఆదేశము వచ్చుట గర్హణీయము.

బాపూజీ దివ్యస్మృతికి తగినట్టి స్మారక చిహ్నములు ఏర్పరచుకొని మన సంతాపమును కొంతవరకు తగ్గించుకొనవచ్చును. కాని ఆయనకు తగిన చిహ్నము, ఆయన కార్యభారమును శ్రద్ధతో మనము నిర్వహించి, ప్రపంచ శాంతి, సర్వమానవ సౌభ్రాతృత్వము సాధించుటకన్న వేరేమి వుండగలదు! బాపూజీ పవిత్ర అస్థికలను మన పుణ్యనదు లన్నిటియందు కలుపగలము. ఆయనపేరిట లెక్కలేనన్ని గ్రంథాలయములు, పాఠశాలలు, ప్రజోద్ధరణ సంస్థలు నెలకొల్పగలము. అందుకు కొన్ని కోట్ల రూపాయలు మనము పోగుచేయగలము. కాని ఆయన సిద్ధాంతాచరణకన్న ఆయనకు ప్రీతికరమగు స్మారక చిహ్నము వుండబో దని మనము గుర్తించి, వ్యవహరించుకొనవలెను.

కథియవాడ్ సంస్థానాల ఏకీకరణ:



మహాత్ముని అస్థికలను మద్రాసు బాంక్వెటింగ్ హాలులో ప్రజలు చూచి తమ శ్రద్ధాంజలుల నర్పించుటకు వీలుగా ఏర్పాటు చేశారు.

భద్రతామండలి అధ్యక్షుని ఆధ్వర్యమున ఇండియా పాకిస్థాన్ల ప్రతినిధులు ప్రత్యేకము సమావేశమై కాశ్మీర్ విషయమై జరుపుచున్న చర్చలు దాదాపు విఫలమై పోయినట్లే భావించవలెను. కాశ్మీర్ నుండి దుండగులను సంహరించుటతోపాటు భారతసేనలనుకూడ ఉపసంహరించవలెననీ, ప్లెబిసైట్ జరుపుటకు అనుకూల వాతావరణ మేర్పరుచుటకుగాను ప్రస్తుతము కాశ్మీర్ ను పరిపాలించుచున్న ప్రభుత్వమును రద్దుపరచి వేరొక తటస్థప్రభుత్వము నేర్పరచవలెనని భద్రతామండలి సభ్యు లధిక సంఖ్యాకులు భావించుచున్నారు. ఈ రెండు షరతులు పైకి సమంజసముగా నున్నట్లు కనపించుచున్నా వాస్తవమునకు అన్యాయములు, అసంబద్ధము లని సూక్ష్మపరిశీలనవలన స్పష్టమగును. కాశ్మీర్ కు భారతసేనలను పంపినది దుండగులను తరిమివేయుట కదా. ఆ దుండగులు తమవారు కారనీ, వారిపై తన కట్టి అధికారములేదనీ పాకిస్థాన్ ప్రభుత్వము చెప్పుచున్నది కదా. అట్టి పరిస్థితులలో భారత సైన్యము ఉపసంహరింపబడిన వెంటనే దుండగులు కాశ్మీర్ నంతను ఆక్రమించుకొనరని హామీ ఏ మున్నది? కాశ్మీర్ నుండి దుండగుల నందరను నిశ్శేషముగా పంపించివేయుటకు పాకిస్థాన్ గాని, భద్రతామండలిగాని బాధ్యత వహించునా? ఒకవేళ దుండగులు వైదొలగినను, కాశ్మీర్ లో ప్లెబిసైట్ జరుగునంతవరకు శాంతిభద్రతలు కాపాడుటకు భద్రతామండలి ఏ సైన్యమునైనను నియమించునా? భారత ప్రభుత్వము తన సైన్యములో కొంతభాగ మును సంహరించి, వాని స్థానమున పాకిస్థాన్ సైన్యములను కాశ్మీర్ సంస్థానములోనికి నడుపవలెనని మరొక విచిత్రప్రతిపాదన చేయబడినది. ఆ విధముగా భద్రతామండలి నిర్ణయించిరేయున్నచో, ఆ మండలి యుద్ధములను ఆపుటకుగాక రెచ్చగొట్టుటకే కృషి చేయుచున్నదని చెప్పవలసివచ్చెడిది.


ప్రస్తుతము కాశ్మీర్ ను పాలించుచున్న షేక్ అబ్దుల్లా ప్రభుత్వముపట్లకూడ భద్రతామండలి వైఖరి ఇంత అసంబద్ధముగానే యున్నది. గత 17 ఏండ్లనుండి కాశ్మీర్ లో బాధ్యతాయుత ప్రభుత్వస్థాపనకొరకు కృషి చేయు



విమానాశ్రయంవద్ద గవర్నరునుండి అస్థికల పాత్రను ప్రధాని ఓమందూరు రామస్వామి రెడ్డియార్ గారు అప్పగింత పెట్టుకొనిన పిమ్మటి ఛాయాచిత్రం

అస్తమయము

కధియవాడ్ రాష్ట్రస్థాపన



ఫిబ్రవరి 2 తేదీన ఢిల్లీపౌరులు గాంధిమహాత్ముని సంస్మరించుటకు సమావేశమైరి సభలో ప్రదర్శింపబడిన గాంధిజీ చిత్రపటం.

చున్న ఏకైకనాయకుడు షేక్ అబ్దుల్లాయే. ముస్లింలీగ్ అనుబంధసంస్థయగు ముస్లిం కాన్ఫరెన్సు జాతీయసభతో ఎన్నడూ సరి రాదు. కాశ్మీర్ ప్రజాప్రభుత్వమని పేరు పెట్టుకొని దుండగుల నాహ్వానించిన సర్దార్ ఇబ్రహీం చివరకు ముస్లిం సభ ప్రతినిధి కూడ కాడు. అతని నొక దోపిడీ దొంగకన్న ఉత్కృష్టునిగా భావించుటకు అవకాశమే లేదు. కాశ్మీర్ పైకి దండెత్తి వస్తున్న దుండగులతో కాశ్మీర్ ప్రజలు ఏ మాత్రము సహకరించుట లేదని స్థిరపడుచునే యున్నవి. కాశ్మీర్ ప్రజలే తిరుగుబాటు చేసియుండినచో, తమ స్వగృహములనే నాశన మొనరించుకొని, స్వ స్త్రీలనే అపహరించియుందురా? కాశ్మీర్ యుద్ధములో పట్టుబడినవారు, మరణించిన వారు దుండగు లెవరో పూర్తిగా రుజువు చేయుచునే యున్నారు. అట్టి పరిస్థితులలో షేక్ అబ్దుల్లా ప్రభుత్వము ప్రజా ప్రభుత్వము కాదని చెప్పుట అసంబద్ధము. నిష్పక్షపాతముగా ప్లెబిసైట్ జరిపించుటకు వేరొక తటస్థప్రభుత్వము నేర్పరచవలెనని చెప్పుట అనవసరము కాదా? ఈ విషయముల నన్నిటిని విశదీకరించుచు భారత ప్రతినిధి గోపాలస్వామయ్యంగారు చేసిన వాదములు, తమ దేశపరిస్థితిని గురించి తన కండ్లతో చూచిన విషయములు వివరించుచు షేక్ అబ్దుల్లా చేసిన విజ్ఞప్తి, భద్రతామండలి సభ్యుల మనస్సులను మార్చలేక పోయిన వనే చెప్పవలెను.

కాశ్మీర్ సమస్యపై చర్చలలో భద్రతామండలి సభ్యులు (ఉభయ పక్షముల వాదములను వినకముందే, యథార్థ పరిస్థితులను సరిగా అవగాహన చేసికొనకముందే, ఒక నిర్ణయమునకు వచ్చినట్లు కనిపిస్తున్నది. అగ్రరాజ్యముల విభేదములు నానాటికి పెరిగిపోయి ప్రపంచశాంతికి ప్రమాదం తటస్థించినచో పాకిస్థాన్ తేలికగా తమ వైపుకే మొగ్గునట్లు చేసుకొనవలెనని బ్రిటన్, అమెరికాలు ఇప్పటినుండియే ఎత్తుగడలు వేయుచున్నవి. కాశ్మీర్‌ను పూర్తిగాగాని, కొంతగాని పాకిస్థాన్‌కు లభించునట్లు చేయగలిగినచో పాకిస్థాన్‌లో తమకువలసిన సైనిక స్థావరములు సంపాదించుకొనవచ్చు నని వీరు ఆశించుచున్నారు. ఆసియాఖండములో పీడితప్రజల స్వాతంత్ర్యోద్యమములకు ఇండియా సంపూర్ణ దోహద మిచ్చుచున్నందుకు ఫ్రాన్సు, బెల్జియం, నెదర్లెండ్సు దేశములు ఇండియాపై అలుకవహించియుండుట సహజమేకదా. ఇండియా పాకిస్థాన్‌లు పరస్పరము కలహించుకొనుచు, యుద్ధనిమగ్నములై బలహీనములై యున్నచో మరొక ప్రపంచసంగ్రామమే తటస్థించినచో, తనకు ఈ రెండుదేశములనుండి ఏ మాత్రమూ భయము వుండదని రష్యా భావించుచున్నది. ఇట్టి అనుకూల వాతావరణములో కాశ్మీర్ సమస్య త్వరలో భద్రతామండలి ఒక నిర్ణయమునకు ఎట్లు రాగలదు! భద్రతామండలిలో ఇండియా, పాకిస్థాన్‌ల ప్రతినిధులు ఏ సమాధానమునకూ రాలేకపోయిరి. అందువలన వివాదాస్పదములైవున్న విషయము లన్నియు ఇండియా, పాకిస్థాన్ ప్రభుత్వములకు తెలియజేసి, తాము పరిష్కరింపవలసిన విధానమును తెలియజేయవలసిన దని వారు తమ తమ ప్రభుత్వములను కోరినట్లు తెలియుచున్నది. కాశ్మీర్ సమస్య భద్రతామండలిలో గాక భారతదేశములోనే పరిష్కరింపబడవలె ననుమాట నిజమైనది. కాశ్మీర్ సరిహద్దుల ఆవలకు దుండగులను తరిమివైచుటయే కాశ్మీర్ సమస్యకు సక్రమమైన పరిష్కారమని భారత ప్రభుత్వము ఇప్పుడైన నిశ్చయించుకొనుట మంచిది.

* * *

కధియవాడ్ సంస్థాన కూటమి

ఆశించనంత త్వరలోనే కధియవాడ్ సంస్థానములొక ప్రత్యేక రాష్ట్రముగా ఏర్పడినవి. కధియవాడ్ ప్రాంతము గుజరాతీభాష మాట్లాడు ప్రజల నివాసము. బొంబాయి పట్టణమునకు ఉత్తరమున ప్రారంభించి, సింధు సరిహద్దుల వరకు వ్యాపించివున్న ఈ ప్రాంతములో బొంబాయి రాష్ట్రములో చేరిన గుజరాత్ ప్రాంతములగు సూరత్, అహమ్మదాబాద్ వగైరాలు, పెద్దదగు బరోడా సంస్థానము మినహాయించగా తక్కిన ప్రాంతములో భారతదేశములోనున్న 600 పైచిలుకు సంస్థానములలో సగము సంస్థానము లిమిడియున్నవి. 17 సెల్యూట్ సంస్థానములు (ఒకరకముగా పెద్దవి) 267 నాన్‌సెల్యూట్ సంస్థానములు (చిన్న చిన్న సంస్థానాలు) మొత్తం 35 వేల చదరపు మైళ్ళలో ఇమిడియున్నవి. ఈ సంస్థానము లన్నిటి జనాభా 40 లక్షలకు మించివుండదు; ఆదాయము 6 కోట్ల రూపాయలు వుండవచ్చును ఈ సంస్థానములు చిన్నవగుటయే గాక, ఒక్కొకసంస్థానము భూభాగము 4, 5 వేరువేరు ప్రాంతములలో నుండుటచే ఈ 35 వేల చదరపుమైళ్ళ ప్రాంతము మొత్తము 860 ముక్కలుగా విభాగమై పరిపాలింపబడుచున్నది. ఈ సంస్థానములలో చాల సంస్థానములు మన జమీందారీలకన్న చాల చిన్నవి. ఇట్టి సంస్థానములలో వచ్చు నాదాయము రాజకుటుంబమునకే సరిపోదు; ప్రజా సౌకర్యముల కేమి మిగులును? నవానగర్, భావనగర్, జునాఘడ్, గొండాల్ వంటివి 5, 6 పెద్ద సంస్థానములలో మాత్రమే సంస్థాన పరిపాలనకు, అభివృద్ధికి కావలసిన ఆదాయము వచ్చును. కాని పెద్ద సంస్థానాల అధీశ్వరులుకూడ తమ సంస్థానము లన్నియు ఒకే రాష్ట్రముగా ఏర్పడి, ఏక పరిపాలనలో నున్నచో ఎక్కువ అభివృద్ధి జరుగుటకు అవకాశమున్నదని గ్రహించినారు. దీనికితోడు ఈ సంస్థానాలలో ప్రజా ఉద్యమము, ఆగస్టు 15వ తేదీ పైనుండి, తీవ్రముగా వ్యాపించి, కధియవాడ్ సంస్థాన ఏకీకరణ జరిగితీర వలయునని ప్రచారము జరుగుచున్నది. సర్దార్ పటేల్ కూడ ఈ విషయమై మొదటినుండి శ్రద్ధవహించియే యుండుట వలన ఈ ఏకీకరణ ఇంత త్వరలో జరిగినది.

కధియవాడ్‌లో ఒక చిన్న సంస్థాన మగు మూలీ సంస్థానములో స్వామి శివానంద, రసికలాల్ పరీఖ్ మున్నగు ప్రజాసేవకులు స్వపరిపాలనాధికారము సంపాదించుటలో సంస్థానాధీశ్వరులు, ప్రజలుకూడ తమతమ కర్తవ్యమును గుర్తించిరి. తరువాత కొంతకాలమునకు, ఒక చిన్న సంస్థానాధీశ్వరుడై వుండి, ఆ సంస్థానమును త్యజించి కాంగ్రెస్ ఉద్యమములో పాల్గొన్న ప్రజాసేవకుడు దర్బార్ గోపాల్‌దాస్ అధ్యక్షత తన 200 మంది కధియవాడ్ సంస్థాన ప్రజా సేవకులు అహమ్మదాబాద్‌లో సమావేశమై యీ సంస్థానము లన్నియు బొంబాయి రాష్ట్రములో కలసిపోవలెనని తీర్మానించి, అప్పటినుండి ఆ ప్రచారము సాగించుచున్నారు. ఈమధ్య జునాగఢ్‌లో జరిగిన కధియవాడ్ రాజకీయ సమావేశముకూడ ఈ ఉద్యమమును బలపరచినది. గుజరాత్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకూడ ఈ సంస్థానములు బొంబాయి రాష్ట్రములో కలసిపోవలననియే ఉద్ఘాటించినది. సంస్థానాధీశ్వరులుకూడ తాము ప్రజాభిప్రాయమునకు ఏనాడైనను లొంగిపోవలసిన వారమే నని గుర్తించినారు. అందువలన ఈ సంస్థానము లన్నియు కలసి ఒక ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పడవలెనని సంస్థానాధీశ్వరు లందరు నిర్ణయించుకొని ఒక ఒడంబడిక చేసుకొనిరి. ఈ ఒడంబడిక ప్రకారం కధియవాడ్ సంస్థానము లన్నియు కలసి ఒక 'కధియవాడ్ రాష్ట్రము'గా ఏర్పడును. సంస్థానాధీశ్వరులు తమ అధికారముల నన్నింటిని ఈ రాష్ట్రప్రభుత్వమునకు దాఖలు చేయుదురు. సంస్థానాధీశ్వరులకుటుంబ ఖర్చులకు వారి సంస్థాన ప్రస్తుత ఆదాయములో 10 వ వంతు భరణము యివ్వబడును. రాజవంశముల పారంపర్యము గుర్తింపబడినది. సంస్థానాధీశ్వరు లందరు కలసి తమలో 5 గురను ఒక 'రాజ సంఘము'గా ఎన్నుకొందురు; వీరిలో ఒకరు 'రాజప్రముఖ్'గా ఎన్నుకొనబడును. ఈ 'రాజప్రముఖ్' రాష్ట్ర అధినేతగా వుండును గాని ప్రభుత్వవ్యవహారమంతయు ప్రజాప్రతినిధుల చేతనే నిర్వహింపబడును. సంస్థానాధీశ్వరులకు ప్రభుత్వనిర్వహణలో ఎట్టి జోక్యము వుండదు; ఈ రాష్ట్రప్రభుత్వము ఇతరరాష్ట్రప్రభుత్వముల వలెనే పనిచేయును. కాని 'రాజప్రముఖ్' తన యిష్టము వచ్చినప్పుడు మంత్రివర్గమును బర్తరఫ్ చేయవచ్చునను షరతు తొలగించి వేయవలసినది. బొంబాయి రాష్ట్రము భాషాప్రయుక్తముగా విభజింపబడినప్పుడు, బొంబాయి రాష్ట్రములోని గుజరాత్ ప్రాంతములు, ఇతర గుజరాత్ సంస్థానములు ఈ కధియవాడ్ రాష్ట్రము కలిసి ఒక గుజరాత్ రాష్ట్రముగా ఏర్పడుటకు వీలగును.



విమానాశ్రయంనుండి మహాత్ముని అస్థికలను తీసుకొని పురప్రముఖులు ఊరేగింపుచేస్తూ బాంక్వెటింగ్ హాలుకు వస్తున్న దృశ్యం.

మతసామరస్యము

చారిత్రక సింహావలోకనము

శ్రీ క. సత్యనారాయణవర్మ



నవఖాళీ యాత్ర సందర్భపు చిత్రం

నేడు చెలరేగుతూన్న మతోన్మాదం, దారుణ హింసాకాండా చూస్తే ఈ మత విభేదాలు ఇంతేనా? మన భారతదేశంలో ఏనాడైనా మత సామరస్యం సాధ్యపడిందా అనే సందేహం తోచకమానదు. ఒక్కసారి చరిత్రపుటలు వెనుకకు త్రిప్పిచూస్తే కొన్ని విచిత్ర సత్యాలు గోచరిస్తాయి.

పదకొండవ శతాబ్ద ప్రారంభంలో గజనీమహమ్మదు చేసిన దండయాత్రలు భారతభూమిపై మహమ్మదీయుల ప్రాభవానికి నాందియైనది. అనంతరం 16వ శతాబ్ద ప్రారంభంనుండే సుమారు రెండు వందల సంవత్సరాలు ఉత్తర హిందూస్థానంలో సుస్థిరసామ్రాజ్యాలు నిర్మించిన వారిలో మొగలులు అగ్రగణ్యులు. మొగలు చక్రవర్తులు ఎంత నిరంకుశంగా పాలించినా ఒక్క ఔరంగజేబు తప్ప తక్కినవారంతా మత స్వేచ్ఛనిచ్చి హిందువులను గౌరవభావంతోనే చూచారు. ప్రస్తుతం గవర్నరు హోదాతో సమానమైన సుబేదారు వంటి ఉన్నతోద్యోగాలలో, సైన్యాధిపతులుగా, ప్రధానామాత్యులుగా హిందువుల నెందరనో నియమించి వారి ఔదార్యం కనబరుచుకొన్నారు. రాజా తోడర్ మల్, రాజా మానసింగ్, రాజా జయసింగ్, రాజారాంసింగ్ మొదలైన హిందూ సరదార్లు మొగలు ప్రభుత్వంలో మన్ననలు పొందడమే ఇందుకు ప్రబల నిదర్శనము. వేంగినాటి తెనుగు బ్రాహ్మణుడైన జగన్నాథ పండిత రాయనివంటి వాని పాండిత్యం మెచ్చుకుని సత్కరించిన ఢిల్లీ పాదుషాల విద్యాభిమానం చరిత్ర ప్రశస్తమైందిగదా!

ఇక దక్షిణహిందూస్థానంలో విద్యానగర సామ్రాజ్యం వర్ధిల్లినన్నాళ్ళు దాని పొలిమేరకైనా ఎవరూ రాలేకపోయారు. విద్యానగర సామ్రాజ్యం కడపటి రోజులలో కూడా గోల్కొండ, అహమ్మద్ నగర్, బీజపూర్ సుల్తానులు చాలా కాలం రామరాజుగారితో సఖ్యంగానే ఉంటూవచ్చి, వారిలో వారికి గల పగలను రామరాజుగారి బలం అండ చూచుకొనే తీర్చుకునేవారు. తల్లికోట యుద్ధములో యీ బహమనీ సుల్తానులందరు యేకమై అంతవరకు తమకు ఆప్తునిగా, పెన్నిధిగా చూచుకొన్న రామరాజుగారిని కుట్రపన్ని వధించేరు. ఈ సంఘటనకు రామరాజుగారి నిరంకుశ ప్రవర్తనకూడా కారణమయిందన్నది నిర్వివాదాంశమే. తదనంతరం దక్షిణ భారతదేశంలో పలుకుబడి సంపాదించిన వారిలో గోల్కొండ నవాబులు ముఖ్యులు. ఈ గోల్కొండ నవాబులలో మూలపురుషులు హిందువులయెడల దేశభాషలయందు అభిమానం కలిగి ప్రజాహితరతులలో పేరుపడ్డారు. అద్దంకి గంగాధర కవి రచించిన 'తపతీ సంవరణ కావ్యా'న్ని ఇబ్రహీం కుతుబ్ శాహి కృతి పుచ్చుకోవటం, అతని సరదార్ అమీర్ ఖాను పొన్నగంటి తెలగనార్యుడు రచించిన 'యయాతి చరిత్ర'మనే అచ్చతెనుగు కావ్యానికి కృతి భర్త కావటం ఆనాటి సామరస్యపూర్వకమైన వాతావరణకు ప్రబలనిదర్శనం.

17వ శతాబ్దపు చివరిభాగంలో మొగలు చక్రవర్తి ఔరంగజేబుకు సమకాలికుడుగా గోల్కొండను తానీషా పాలించేడు. ఈతడే భద్రాచల రామదాసుగారి ఆఖ్యానంలో తానీషాగా నేటికీ చిరస్మరణీయుడైనాడు. ఇతని కాలంలో మొగలాయీలతో వైరుధ్యం బాగా ప్రబలింది. దేశంలో కల్లోలాలు రకరకాలుగా చెలరేగుతూన్నాయి. సాటిసామంతరాజ్యమన్న అభిమానంకూడా లేకుండా గోల్కొండను ఎప్పుడు కబళిద్దామా అని ఔరంగజేబు ఎదురు చూస్తున్న రోజులు. ఈలాంటి విషమఘట్టంలో ఆంధ్రరాజకీయ ధురంధరులలో సుప్రసిద్ధులైన మాదన్నపంతులుగారు ప్రధాన మంత్రిగాను, ఆయన సోదరుడైన అక్కన్న పంతులుగారు సర్వసైన్యాధ్యక్షులుగాను ఉండి గోల్కొండ రాజ్యాన్ని కంటికి రెప్పలా కాచేరు. సమకాలికుడుగా అవతరించిన మహారాష్ట్ర రాజసింహం శివాజీతో తానీషాకు సఖ్యం కుదిర్చి దక్షిణ హిందూదేశం మతకల్లోలాలకు లోనుకాకుండా, ఢిల్లీ పాదుషాల దాడినితట్టుకునేటట్లున్నా దౌత్యం నడిపి వారి రాజనీతి నగుపరచేరు. తమ మేనల్లుడు, భద్రాచల తహసీల్దారు అయిన కంచర్ల గోపన్నగారు (రామదాసు) నవాబు అనుజ్ఞ లేకుండా రామాలయపునర్నిర్మాణానికని రైతుల సర్కారు పైకం ఖర్చు చేసినందుకువచ్చిన అభియోగంలో, రామదాసుగారికి నవాబు విధించిన శిక్షలను అమలు పరచటంలో మాదన్న పంతులుగారు చూపిన నిష్పక్షపాత బుద్ధి ఔదార్యం మెచ్చుకోదగినదిగదా! తుదకు రాజ్యంలో ఈ హిందూమంత్రుల ప్రాబల్యాన్ని సహించలేని వారు కుట్రచేసి మొగలుల దండయాత్రకు దోహదం చేసిన సమయంలో గోల్కొండ సంరక్షణకు వారి కుత్తుకలను మొగలు ఖడ్గానికి బలియిచ్చిన సంగతి చరిత్రలో చెరగిపోదుగదా! వీరి మరణానంతరంగాని ఔరంగజేబుకు గోల్కొండ వశం కాలేదు. ఈ విధంగా సాటి మహమ్మదీయ సామ్రాజ్యాన్ని కేవలం మతసామరస్యంతో పాలించినందుకు మొగలులు ఆక్రమించిన దురాగతమే భవిష్యత్తులో మొగలురాజ్య వినాశనానికి నాందియైనట్లుకూడా చారిత్రకులు ఋజువుపరచేరు.

15వ శతాబ్దం మొదలు 18వ శతాబ్దందాకా ఉభయమతవాహినులు భారతదేశంలో ఒరసి పారుతూన్న రోజులలోనే ఒక రకమైన భక్తి ప్రధానమైన మతవ్యాప్తి ఆసేతు హిమాచల పర్యంతం విరివిగా జరిగి ఆ కాలంలో పరస్పర సహకారం, సమరస ఏర్పాటు చెయ్యడానికా అన్నట్లుగా దేశంలో ఒక ఆశను, ఉత్సాహాన్ని కల్పించింది. సుప్రసిద్ధ వైష్ణవ భక్తి సార్వజనికమైన మార్గాన్ని అన్వేషించి సర్వకుల సామరస్యానికి దోవతీసిన ఆచార్యుడు రామానుజుడు దక్షిణభారతదేశానికి ఎలాగో, ఉత్తర హిందూస్థానంలో హిందూ మతానికి కేంద్రస్థానమైన కాశీపట్టణంలో ఉంటూన్న రామానందుడు రామభక్తిని ప్రజానీకంలో వెదజల్లి ఒక ప్రవక్తగా ప్రజల హృదయాలను ఆకర్షించేడు. ఈ రామానందులు 15వ శతాబ్దంలో ఉండేవాడు. ఈయన రామానుజస్వామి శిష్య పరంపరలో అయిదవతరంవాడని కూడా ప్రతీతి. కేవల నామ సంకీర్తనకు, భక్తి తత్పరతకు ప్రాధాన్యమిచ్చిన రామానందుని ప్రబోధలు ఆనాడు కాశీనగరంలో విద్యాగంధం ఏమాత్రంలేని ఒక బీద మహమ్మదీయ యువకుని ఆకర్షించి అతని మనస్సులో మథన పడుతూన్న ఒక విధమైన నూతన తత్త్వానికి ఈ రామానందుని సంకీర్తన విధానంలో తావు దొరికింది. హిందూ మహమ్మదీయ మతాల ఆచార పరంపరలకు మతావేశములకు గురియై ఆనలుగడలలో కర్మసంబంధమైన సంకెలలలో ఆస్వాదనకు అనుభూతికి దూరమై పోతూన్న నిజమైన భగవద్భక్తి విశ్వమయమైన ప్రేమ వ్యర్థమైపోతూన్న ఆ సంధియుగంలో ఒక్క రామానందుని వచనాలలోనే ఆ మహమ్మదీయ బాలునకు విశ్రాంతి దొరికింది. మతోన్మాదంచేత వర్గభేదాలు పెంచుకున్న రోజులలో కాశీపట్టణంలో ఈ బాలునకు రామానందుని దర్శనం దొరకటం ఆయన తనకు గురూపదేశం చెయ్యటం సాధ్యంకాదు! పరికదా అది ఉభయులకు క్షేమకరమైనది కూడా కాదు. తుదకు ఒకరోజు తెల్లవారుఝామున చీకటిలో శ్రీ రామానందులు గంగాస్నానంచేసి తిరిగి వచ్చేదారిలో కోరి పొంచి ఉండి ఆయనచేత పాదతాడితుడైనాడు. అప్రయత్నంగా రామానందుని నోటినుండి వెలువడిన 'రామారామా' అనే మాటలనే తారకమంత్రదీక్షగా స్వీకరించి ఆయనకు ఏకలవ్యుడైనాడు. అనన్యమైన భక్తి పొంగివచ్చినప్పుడు ఆయన కానజాలక మహమ్మదీయుడైనా అతనిని శిష్యునిగా స్వీకరించేడు. ఈ విధమైన సాధనలో తన గురువును సాధించగల్గిన మహనీయుడే కబీరు. పరస్పర ద్వేషభావం ఎరుగని అతనికి 'రామ్' 'రహీమ్' అనే పదాలు ఏకార్థసూచకములయ్యాయి. కేవలం బట్టల నేతవృత్తిగా జీవనంచేస్తూ, విద్యాగంధం లేనివాడైనప్పటికీ ప్రజలకోసం అతనిలో ఒక దివ్యవాణి ఉద్భవించి 'కబీరుగీతలు'గా నేటికీ చిరస్థాయి అయినాయి. 'సూఫీ పీర్' మొదలైన మౌల్వీలు ఆయనకు గురువులైనట్లు కొందరు మహమ్మదీయచరిత్రకారులు వ్రాసినా ఆయన రచించిన కీర్తనలలో శ్రీ రామానందులకే తాను ఋణపడి ఉన్నట్లు, తనలోగల భక్త్యావేశానికి ఆయనే కారణభూతులని పదేపదే ఉదహరిస్తుంటాడు. గుడి, మసీదు, విగ్రహం, పవిత్ర జలం, పురాణాలు, కొరాను, మతాచార్యులు —ఇవన్నీ నిజమైన దైవత్వసిద్ధికి విశ్వవ్యాప్తమైన ఆనందానుభూతికి అడ్డంకులై సత్యాన్ని మరుగుపరుస్తున్నాయని ఆయన కీర్తనలలో వ్రాస్తాడు. కాశీపట్టణం ఆయన ఉనికిని ప్రబోధాలను గుర్తింపలేకపోవటమేగాక ఆయనను దేశాంతరగతునిగాకూడా చేసింది. గోల్కొండ నవాబైన తానీషా కాలంలో కంచర్ల గోపన్నగారికి రామతారక మంత్రోపదేశం చేసినది కబీరు దేశాంతరగతుడైన సమయంలో అయి ఉండాలని మనం ఊహించవచ్చు. ఆయన ప్రచారంలో మళ్ళీ దక్షిణాదిని ఒక హిందువునకు గురువై కబీరు తన విశ్వప్రేమ సందేశాన్ని చాటడం చాల విచిత్రమైన విషయం. తుదకు వృద్ధుడై 1518లో గోరకపూర్ వద్ద 'హుఘర్'లో ఈయన దేహపరిత్యాగం చేసినప్పుడు ఆ మృతకళేబరం కోసం హిందువులు, మహమ్మదీయులు కూడా వివాదాలు పడ్డారు. తుదకు మళ్ళీ కబీరు సంకల్ప బలంచేతనే ఆయన మృతదేహం ఒక పూలరాసిగా మారినట్లు ఆ పూలరాసిని ఉభయ మతస్థులు పంచుకొని వారి వారి ఆచారాల ప్రకారం దానికే ఉత్తర క్రియలు జరిపినట్లు చెపుతారు. నేడు మతంపేర గొంతుకలు కోసుకుంటూన్న తరుణంలో ఇలాంటి మత సామరస్యం కోసం తమ జీవితాలర్పించిన మహనీయుల చరిత్రలు కొంతైనా మనశ్శాంతిని కలుగ చేయగలవని విశ్వాసం.

ఇదిగాక వంగదేశంలోని నవద్వీపంలో (నదియా) జన్మించిన చైతన్యులు, గుజరాతులో శ్రీకృష్ణుని పూజే ప్రధానంగా గల శుద్ధాద్వైతమనే పేరుతో వైష్ణవసంప్రదాయాన్ని ప్రచారం చేసిన వెలనాటి ఆంధ్ర బ్రాహ్మణుడైన వల్లభస్వామి, హిందూ, మహమ్మదీయ మత

(18 వ పేజీ చూడుడు)



మహాత్ముని మతసామరస్య సమావేశం

కథానిక:

కళారాధన

కథకుడు : ఏంటన్ చెకోవ్ తెలుగు : అమరేంద్ర

ఏదో కాగితంపొట్లం ఒకటి చేత్తో పుచ్చుకుని ఆ కుర్రాడు భయంభయంగా డాక్టరుగారి ఆస్పత్రిలో అడుగుపెట్టాడు.

"ఇవాళ బాగా తేలికగావుందా అబ్బాయ్? ఏమిటి విశేషాలు" అంటూ డాక్టరుగారు చనువుగా పలకరించారు.

కుర్రాడు కొంచెంసేపు బెదురు చూపులు చూసి చివరికి ఎల్లాగో ధైర్యం తెచ్చుకుని "మా అమ్మ తమకి నమస్కారాలు చెప్పమంది. నేను మా అమ్మకి ఒక్కణ్ణే కొడుకుని. నా ప్రాణం నిలబెట్టారు. మీ ఋణం ఎల్లా తీర్చుకోగలమో తెలియకుండావుంది" అన్నాడు.

"ఆ దేమిటోయ్. నేను చేసిన విశేషమేముంది? ప్రతివైద్యుడూ చేసేదే నేనూ చేశాను. దానికేనా ఇంత ఆర్భాటం?" అని బదులు చెప్పాడు డాక్టరుగారు. ఆ కుర్రాడి కృతజ్ఞతకు ఆయన ఉప్పొంగిపోయాడు.

"మా అమ్మకి నే నొక్కణ్ణే కొడుకుని. బీదవాళ్ళం. మీరు పడ్డకష్టానికి ఏం ప్రతిఫలం ముట్టచెప్పుకోగలం బాబూ? ఏమీలేనివాళ్ళం. అడగటానికి సిగ్గేస్తోంది. మా అమ్మా నేనూ మిమ్మల్ని ప్రార్థించే దేమిటంటే..."

"ఏమిటి?" అని అడ్డుప్రశ్న వేసి డాక్టరుగారు కుర్రాడి చేతులోవున్న పొట్లంమీదికి చూపు సారించారు.

"ఈ నిరుపేదల కానుకను తమరు కాదనకుండా స్వీకరించాలి. అదే మాకు పదివేలు."

"ఏమిటది?"

"ఆఁ, ఏంలేదు. దీన్ని మీరు మా కృతజ్ఞతకు చిహ్నంగా స్వీకరించాలి. ఇది చాలా ప్రాచీనమైన శిల్పవిగ్రహం. దీని విలువ ఇంత అని చెప్పటానికి వీలుకాదు."

"ఆఁ, ఎందుకోయ్. అనవసరం. నాకెందుకూ చెప్పు?"

"కాదుకాదు స్వామీ, తమరు తప్పక స్వీకరించితీరాలి" అంటూ కుర్రాడు కాగితం వూడదీయటం మొదలుపెట్టాడు. ఊడతీస్తున్నంతసేపూ "ఇది పుచ్చుకోకపోతే నాకూ మా అమ్మకీ చాలా కష్టంగా వుంటుంది. ఇది చాలా అరుదైన శిల్పం. పాతకాలంనాటిది. మావాన్నకి ఇదంటే ప్రాణం. అందుకే ఎంతో భద్రంగా మేము దీన్ని దాచుకుంటున్నాం. మా నాన్న పాతవిగ్రహాలు కొని కళాప్రియులకు వాటిని అమ్ముతూవుండేవాడు. మావృత్తికూడా అదే." అంటూ ఊపిరిసలపకుండా ఉపోద్ఘాతం చెప్పాడు.

పొట్లం వూడతీసి ఆ శిల్పాన్ని ఉత్సాహంగా బల్లమీద నిలబెట్టాడు. ఓ చదువరీ! ఆ దిగంబరవిగ్రహ సౌందర్యాన్ని వర్ణించగల శక్తిగాని, సామర్థ్యంగాని నాదగ్గరలేవు. అది వర్ణనాతీతం అనుభవైకవేద్యం!

ఆ నగ్నస్త్రీ విగ్రహం కంటపడగానే డాక్టరు ఒక్కసారిగా నిశ్చేష్టుడైపోయాడు. అమాంతంగా విశ్వరూప సందర్శనమైనంత దిగ్భ్రాంతి కలిగింది. తట్టుకోలేక తల గోక్కున్నాడు. గొంతు సవరించుకున్నాడు. "అవునోయ్, చాలా గొప్ప శిల్పమే. కాని—కాని—ఏం చెప్పటానికీ మాటలు దొరకటంలేదు..." అంటూ గొంతుకలో పచ్చివెలక్కాయ పట్టుకున్నట్టుగా ఉక్కిరిబిక్కిరయాడు.

"అదేమిటి బాబూ అల్లాగంటారు?" అని కుర్రాడు వెంటనే ప్రశ్న వేశాడు.

"ఏమీ లేదోయ్. బాగానే వుందికాని—ఇటువంటిబొమ్మని ఇంట్లో పెట్టుకుంటే ఇల్లంతా మైలపడిపోతుందేమోనని భయంగా వుంది. అంతకంటె మరేమీ లేదు"—అని డాక్టరుగారు నసిగారు.

"ఏమనుకున్నారో డాక్టరుగారూ! ఇది సామాన్యమైన శిల్పం కాదు. ఇది ఇంట్లో వుంటే మీ ఇంటికంతటికీ అలంకారంగా వుంటుంది. ఆహా! ఏం అద్భుత సౌందర్యం. ఒక్కక్షణం నేత్రరెప్ప వాల్చకుండా దానికేసి చూడండి. మీ ఆత్మ ఆపారానందంతో నిండిపోవలసిందే. ఈతుచ్ఛమైన లౌకికవిషయాలన్నీ క్షణంలో మరిచిపోవలసిందే! ఒక్కసారి చూడండి. ఎంత జీవం! ఏం భావం! ఏం విన్యాసం! ఆహో అద్భుతం! అత్యద్భుతం!" అంటూ కుర్రాడు అమాంతంగా గొప్ప ఉపన్యాసకుడై పోయాడు. డాక్టరు అవివేకానికి మనసులో నొచ్చుకున్నాడు.

"అంతా బాగానే వుంది. నువ్వు చెప్పిందంతా నిజమే. కాని—నేను పెళ్ళాం పిల్లలూ కలవాణ్ణి. ఆగదిలోకి పెద్దా పిన్నా, ఆడామగా ఎందరో వస్తూవుంటారు—" అంటుండగానే కుర్రాడు అడ్డంవచ్చి.

"డాక్టరుగారూ! కళల సంగతి తెలియని కళ్ళకి ఈ శిల్పంలోవున్న అందం కనిపించకపోవచ్చును. కాని తమరు గొప్పవారు. పండితులు. తమరూ అందరిలాగే స్థూలదృష్టితో చూస్తే ఎల్లా చెప్పండి? ఏమైనా కాని తమరు ఈ కానుక స్వీకరించాలి. లేకపోతే మాఅమ్మకీ, ఆమెకి ఒక్కడినే కొడుకునైన నాకూ చాలా కష్టం వేస్తుంది. మీరు నన్ను బ్రతికించారు. బదులుగా మాకు అత్యంత ప్రియమైన వస్తువుని కానుక ఇస్తున్నాం. నా విచారం ఏమిటంటే దీని జత విగ్రహాన్ని కూడా తెచ్చి తమకి సమర్పించుకోలేక పోయానే అని. అదే నాబాధ" అన్నాడు.

ఒకటి తెచ్చింది చాలక రెండోది కూడా తీసుకురాలేదని విచారంట! డాక్టరు గుండె దిగజారిపోయింది. "చాలా సంతోషం నాయనా చాలా సంతోషం. కాని, నేనేం చెప్పేదోయ్? నువ్వే ఆలోచించు. పసిపిల్లలు వస్తూ పోతూ వుంటారు. ఆడవాళ్లు వస్తూ వుంటారు. పదిమందీ వచ్చిపోయే చోటు...ఏం చెయ్యమంటావో చెప్పు. అయినా నీతో తర్కం ఎందుకులే. ఆ బొమ్మని ఇక్కడ పెట్టి వెళ్ళు" అన్నాడు.


"మారుమాట చెప్పకండి బాబుగారూ. ఈ బొమ్మని మీ పూలకుండ పక్కన పెట్టుకోండి. దీని జతకి రెండోదాన్ని తీసుకురాలేక పోయాననే నా విచారం. శలవు" అని వెళ్లిపోయాడు కుర్రాడు.

పీడ వొదిలిందనుకుంటూ డాక్టరు గదిలో అటూ ఇటూ పచార్లుచేస్తూ "బొమ్మ బాగానే వుంది; చాలా బాగుంది. చేతులారా అవతల పారెయ్యటానికి మనసొప్పటం లేదు......కాని ఇంట్లో వుంచుకోటానికి అంతకంటె మనసొప్పకుండా వుంది. ఏం చెయ్యటం? దీన్ని ఎవరికైనా బహుమతి ఇస్తే ఎంత బాగుండును! అవును కాని ఎవరి కివ్వటం?" అని మనసులో తర్జనభర్జన చేసి, తికమకలు పడి చివరకు ఇల్లా నిశ్చయించాడు.

తన కొక ప్లీడర్ మిత్రుడున్నాడు. ఈ మధ్య ఒక చిన్న కేసులో తనకు చాలా సాయం చేశాడు. డబ్బు ఇస్తే పుచ్చుకోడు. ఇవ్వటం బాగానూ వుండదు. అందుకని ఈ మహాశిల్పాన్ని అతని కి సమర్పిస్తే ఒక్కదెబ్బకి రెండు పిట్టలు రాలుతయ్. అదీగాక ప్లీడరు పెండ్లికాని వాడు. బ్రహ్మచారి అనటానికి వీలులేదుగాని ఒంటరిగాడు. ఈ శిల్పాన్ని స్వీకరించటానికి అన్నివిధాలా అతనే యోగ్యుడు.

ఈ ఊహ తట్టిన వెంటనే ఛట్టున లేచి ప్లీడరుగారింటికి బయలు దేరాడు డాక్టరు.

"హలో, గుడ్ మార్నింగ్! నువ్వు నాకోసం పడిన శ్రమకి కృతజ్ఞత తెలుపుకుందామని వచ్చాను. నీతో చెడ్డ చిక్కు. డబ్బుపేరు చెబితే మండిపడతావు. అందుకని ఈ అద్భుత శిల్పాన్ని నీకు కానుకగా సమర్పించాలని వచ్చాను. నువ్వు కాదు కూడదనకుండా స్వీకరించాలని నా విన్నపం. చూడు...ఏం సౌందర్యం! ఏం మాధుర్యం! ఆహో, అద్భుత ఆనందస్వప్నం!" అని బ్రహ్మాండంగా పీఠిక తయారుచేశాడు.



గాంధీజీ పండిత మాలవ్యాజీతో—

ఆ బొమ్మకేసి చూసి ప్లీడరు బిత్తరపోయి తత్తరపడి, తట్టుకోలేని ఆనందంతో తలకిందులైపోయాడు. "ఎక్కడ కొన్నావోయ్ ఈ అసాధారణ శిల్పం? ఎల్లాతో స్తయోగ్యకదా కళారాధకులకు ఇలువంటి ఊహలు! ఏం అందం! ఎంత ఆకర్షణ!" అంటూ పరవశుడై పోయాడు.

క్షణంలోనే ఈ బ్రహ్మానందమంతా పొంగి పొంగి ఒక్కసారిగా ఫట్టునపేలే బెలూన్‌లాగా తేలిపోయింది. ఆ బొమ్మనిచూసి ఆపాదమస్తకమూ కంపించిపోయాడు. "వొద్దు బాబూ, వొద్దు. నువ్వు నాకేమీ ఇవ్వద్దు. దీన్ని ఇక్కణ్నుంచి తీసుకుపో; నీకు పుణ్యం వొస్తుంది" అని బతిమాలకోసాగాడు ప్లీడరు "అదేమిటి? అంత భయం దేనికి?"—ని డాక్టరు అడిగాడు.

"బాగానేవుంది. కాని...కాని...తరుచు మా అమ్మ ఇక్కడికి వస్తూ వుంటుంది. పార్టీలు వస్తూవుంటారు. నౌకర్లు తిరుగుతూ వుంటారు. ఈ బొమ్మని బల్లమీద పెడితే నా పరువు ఇంకేమైనా మిగులుతుందా?" అని ప్లీడరుగారు దీనంగా విన్నవించాడు.

"వీల్లేదు. నువ్వు పుచ్చుకుని తీరాల్సిందే. లేకపోతే నాకు చాలా కోపం వస్తుంది. పుచ్చుకోకపోతే నాకు చాలా అన్యాయం చేసినవాడివౌతావు. సరిగ్గా చూడు. ఏం అద్భుతశిల్పం! ఎంత జీవం! ఏం ముఖవిన్యాసం!" అని ప్లీడరు మారుమాట చెప్పకముందే డాక్టరు తొందరతొందరగా నిష్క్రమించాడు. పీడ వొదలిందని లోలోపల పొంగిపోయాడు.

డాక్టరుగారు గడపదాటగానే ప్లీడరుగారు ఆ శిల్పాన్ని శల్యపరీక్ష చేయటం మొదలుపెట్టారు. ఇది బాగానే వుంది కాని దీన్ని ఏం చెయ్యాలో తెలియటంలేదు. ఇంతకుముందు డాక్టరుగారు పడ్డ అవస్థలోనే ప్లీడరుగారు కూడా చిక్కుకుని ఏం చేద్దాం? దీన్ని ఎల్లా వొదుల్చుకుందాం! అని తీవ్రంగా ఆలోచించసాగారు. "నిజమే, చాలా ప్రశస్తమైన శిల్పం. దూరంగా పారేద్దామా అంటే మనస్సు పీకుతోంది. పోనీ ఇంట్లో వుంచుకుందామాఅంటే నామర్దాగా వుంది..." అని ఎంతోసేపు మథనపడ్డాడు. చివరికొక అమూల్యమైన ఆలోచన తోచింది.

ఆ వూళ్ళో తన స్నేహితుడొకడు నాటకాల్లో నవ్వించే వేషాలు వేస్తుంటాడు. అతను ఆ రాత్రే ఆ వూళ్ళో బడి కట్టటానికి విరాళం పోగుచేసేందుకు ఉచితంగా నాటకంవేస్తాడట. అతని నటనానైపుణ్యాన్ని మెచ్చుకుంటూ ఈ అమూల్యశిల్పాన్ని కానుకగా ఇస్తే చాలా బాగుంటుంది. దీన్ని గ్రహించటానికే అన్నివిధాలా అతనే అర్హుడు. అదీకాక అతని కిటువంటి శిల్పాలంటే ఎంతో ఇష్టంకూడాను.

ఈ ఊహ మనస్సులో మెరవటమూ, ప్లీడరుగారు నటకుడి ఇంటికి తరలటమూ ఒక్కక్షణంలోనే జరిగినై.

ఆ సాయంకాలమంతా ఎందరో వచ్చారు, ఈ అసాధారణ శిల్పాన్ని దర్శించటానికి. వచ్చేపోయేవారి ఇకిలింపులు గుర్రాల సకిలింపుల్లాగా చెవుల్లో తుప్పు వొదలకొట్టినై.

తను వేషం వేసుకునే గదిలోకి చెలికత్తెలకే కాదు నాయకురాలికికూడా రావటానికి అధికారంలే దని నటుడు శాసించాడు.

ఆనాటి నాటకం ముగియగానే బొమ్మకేసి చూసి బుజా లెగరేసి చేతులు తిప్పుతూ "ఆరి భగవంతుడా! ఎంత ఉపద్రవం తెచ్చిపెట్టావురా...ఈ బొమ్మని నేనేంచేసుకోను? నెత్తికేసికొట్టుకోనా? నే నుండేదేమో అద్దెకొంప. ఘరానామనుషులు వస్తూ పోతూ వుంటారు. నటీమణులుకూడా వస్తూవుంటారు. పోనీ ఫొటో అయినా కాదు దబాలున డ్రాయరులో దాచిపారేసేందుకు! ఈ బొమ్మ ఎవరి కంటబడితే ఇంకేమైనా వుందా? ఇప్పుడు నా కేది దారి?" అని హాస్యనటుడు తనకి తెలియకుండానే శోకరసాభినయంలోకి దిగిపోయాడు. "ఎందు కింత ఇదవుతావు? తీసుకుపోయి ఏదో ఒక ధరకి అమ్మిపారెయ్యి. ఈ వూళ్ళో ఇల్లాంటి పాతబొమ్మలుకొనే ముసలమ్మ ఒకతె వుంది. ఇక్కణ్నుంచి ఒక్క పరుగులో వెళ్లొచ్చు" అని ఒక ఆపద్బాంధవుడు సలహా ఇచ్చాడు.

ఆ క్షణమే తన భారం వొదుల్చుకునేందుకు నటుడు పరుగు తీశాడు.

* * *

రెండురోజుల తరువాత డాక్టరు గారు ఆసుపత్రిలో రంగు రంగుల మందుల సీసాలని బూజు దులిపి వరుసలో అమర్చుకున్నారు. తలుపు తోసినట్లు కిర్రున చప్పుడైంది. చేతులో కాగితం పొట్లంతో యమదూతలాగా తన తల్లికి ఏకైక పుత్రుడైన ఆ కుర్రాడు ప్రత్యక్షం అయేసరికి డాక్టరు గారికి పై ప్రాణాలు పైకే పోయినై.

"డాక్టరుగారూ! ఏమని చెప్పను నా ఆనందం? అదృష్టవశాన దాని జతకి రెండో బొమ్మ దొరికింది. అమ్మ తమకి ఇచ్చి రమ్మని పంపించింది. మా అమ్మకి నే నొక్కణ్ణే కొడుకును. నా ప్రాణం నిలిపారు. దీన్ని కూడా స్వీకరించండి" అంటూ ఆనందంతో, కృతజ్ఞతతో అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు. డాక్టరు గారి ముఖం పాలిపోయింది. నోట మాటే లేదు...




మహాత్ముని శవాన్ని బిర్లాభవనంనుంచి ప్రత్యేకంగా అలంకరించిన శకటంపైకి తెస్తున్నారు. శవాన్ని మోస్తున్న వారిలో స్త్రీలుకూడా ఉన్నారు.



మహాత్ముని భౌతిక శరీరాన్ని బిర్లాభవనానికి వెలుపలవున్న ప్రత్యేకశకటం పైకి మోసుకొని పోతూండగా :


యమునా తీరంలో అంత్యక్రియలు




బిర్లాభవనంలో శవజాగరణం : ఒక సిక్కు 'గ్రంథసాహెబ్' పఠిస్తున్నాడు



అంత్యక్రియలకు ఢిల్లీ నగర వీథులగుండా యము



వర్నర్ జనరల్ మౌంట్‌బాటెన్ దర్శిస్తున్నాడు. ప్రధాని నెహ్రూ మహాత్ముని శిరస్సువద్ద నిలిచివున్నారు.




అమరజ్వాలలు: అపరబుద్ధభగవానుడు గాంధీజీకి యమునాతీరంలో అంత్యక్రియలదృశ్యం



2వ తేదీ సోమవారంనాడు యమునా ఘాట్‌లో గాంధీజీ అస్థికలను సంచయనం చేస్తున్నప్పుడు గీతాశ్లోకాలను చదువుతున్న బాలికలు.



ాఘాట్‌కు శవాన్ని తీసుకొనిపోతున్న ఊరేగింపు.



అంత్యక్రియలను చూస్తున్న రాజకుమారి అమృతకౌర్, అజాద్, మౌంట్‌బాటన్ దంపతులు, డా॥ లూకూడా వున్నారు.

పిల్లల నవల:



శ్రీ సత్యనారాయణ శ్రీవాస్తవ

౨౯

విందుకు అందరినీ పిలువడానికి ఊరంతా తిరిగిరావాలని పినాకరావు సుందరిని అడిగాడు "వెళ్లితే వెళ్లు, నీ స్నేహితుల్ని అందరినీ రేపు విందుకి పిలుస్తే పిలు. కాని నువ్వుమాత్రం సాయంత్రం చీకటిపడేలోపున తిరిగి రావాలి. అర్థమయిందా?

"ఒక్క-గంటలో తిరిగిరానమ్మా?"

నరేగాని, కబుర్లు త్వరగానే చెబుతారు నీలాంటి పిల్లలు. కాని అన్న మాట నిలుపుకోవడం మాత్రం అరుదు".

"నే నందరిపిల్లలలాగ కానమ్మా! నేనొక మాట చెబితే అది నిలుపుకొంటాను."

"మూద్దాం కాదూ?ను వ్వీమాటు చెప్పిన మాటగనక వినకపోతే మరీ కష్టాల పాలవుతావు!"

"ఎందుచేత?"

"తమకంటె ఎక్కువ తెలిసిన పెద్దవాళ్లమాట పిల్లలు వినకపోతే, వాళ్లకి ఏవోకష్టాలు కలుగుతూనే ఉంటాయి."

"నా కది బాగా అనుభవం అయిందమ్మా! కాని అటువంటి పొరపాటు నే నింక ఎన్నడూ చెయ్యను"

"మూద్దాంలే, అ దెంత వరకు నిజమో?" తనను తల్లిలాగ చూస్తూవున్న ఆ దేవకన్య సుందరి దగ్గర సెలవు తీసుకొని ఆడుతూ పాడుతూ వీథిలోకి బయలుదేరాడు. పినాకరావు. ఒకగంటలోపున తన జతగాళ్లనందరినీ పిలిచివేశాడు కొందరు వెంటనే వస్తాము అన్నారు. మరికొందరు ముందు బెట్టుసరిచేశారు కాని, ఆ వేసే మిఠాయిఉండలు నేతిమిఠాయి అనగానే "అలాగే వస్తాము లేవోయి పినాకం నీకోసం" అన్నారు. పినాకం స్నేహితుల్లో అందరికంటె తనకు ఎక్కువ యిష్టమైనవా డొకడున్నాడు. వాడిపేరు రామం. కాని వాడిని అందరూ కొవ్వొత్తి అని పిలిచేవారు. కొవ్వొత్తిలాట సన్నంగా, పొడుగ్గా, తెల్లగా, చురుగ్గా కొవ్వొత్తి దీపంలాగ ఉండే వాడు. అయితే స్కూలుపిల్లలందరిలోకీ అల్లరి చిల్లరిగా తిరిగి సోమరిగా ఉండేవాడు మన కొవ్వొత్తి ఒక్కడే. వాడంటే పినాకాకి ఎంతో జత. విందుకి పిలవడానికి ఒకసారి కొవ్వొత్తియింటికివెళ్లాడు పినాకం. అతను లేడు. రెండోసారి వెళ్లి చూచాడు. ఈమాటుకూడా లేడు. మూడోసారి వెళ్లాడు. అంతే అయింది. ఎక్కడికి పోయాడో! ఏతాగని వెతకడం? ఇక్కడఅక్కడా అన్నిచోట్లా వెదికాడు. చివరికి ఒక కాపుగుడిసె చూరుక్రింద కూర్చుని ఉన్నాడు కొవ్వొత్తి. పినాకయ్య వాడిదగ్గరికి వెళ్లి "ఇక్కడేం చేస్తున్నావు రామం?" అని అడిగాడు.

"అర్ధరాత్రి ఎప్పు డవుతుందా అని చూస్తున్నాను"

"ఏం? ఎందుకు? ఎక్కడికి వెళ్ళాలని?" "దూరం-చాలాదూరం వెళ్లిపోవాలి"

"మీయింటికి మూడుసార్లు వెళ్లాను నీకోసం"

"ఏం కావాలి నావల్ల నీకు?"

"నీకింకా తెలియదూ? నా అదృష్టం పండి రేపు..."

"రేపు ఏమవుతావు?"

"రేపు నేను మనిషినైపోతాను. ఇంక బొమ్మగా ఉండటం లేదు. మీ యందరిలాగే మామూలు పిల్లవాడి నైపోతాను."

"మంచిదే మరి. కాని నేరాను"

"రేపు విందు చేస్తున్నాను. నీవు రావాలి"

"ఈ వేళ రాత్రి వెళ్లిపోతూఉంటేను?"

"ఎన్ని గంటలకి?"

"ఇంక కొంచెంసేపటిలో"

"ఎక్కడికి వెళ్తూ ఉన్నావు?"

"నేనొక అందమైన దేశానికి వెళ్తున్నాను. అక్కడ హాయిగా ఉంటాను. ఆ యాటలభూమిలో..."

"ఆ దేశంపే రేమిటి?"

"ఆనందరాజ్యం! నువ్వు కూడా రాకూడదూ?"

"నేనా, రాను."

"పినాకం! చూడు పొరపాటు చేస్తున్నావు. నువ్వు ఇప్పుడు రాకపోతే తరువాత చాలా విచారిస్తావు. మన లాంటి పిల్లలకి ఈ ఆనందరాజ్యంకంటె మంచిచోటు ఎక్కడుంది? ఇక్కడ స్కూల్సులేవు. మేష్టార్లు లేరు, పుస్తకాలూ లేవు. ఆ యానందరాజ్యంలో ఒక్కరుకూడా చదవరు. లక్ష్మీవారం నాడు స్కూలు లేదు. ప్రతివారం లోనూ ఆరు లక్ష్మీవారాలు, ఒక ఆదివారమున్నూ. సంక్రాంతి సెలవు లెప్పుడో తెలుసా! జనవరి ఒకటవ తేదీనించి ఆరంభం. డిశంబరు ఆఖరి వరకుఉంటాయి. నీలాంటివాళ్లకి అదే రాజ్యం. లోకంలో నాగరికతగల రాజ్యాలన్నీ యిలాగే ఉండాలి అంటాను"

"అయితే అక్కడ రోజులు ఎలాగ గడుస్తాయి?"

"ప్రొద్దున్న మొదలు సాయంకాలం వరకు ఆటలు, పాటలు, వినోదాలు, వేడుకలు. రాత్రికాగానే నిద్రపోవడం, మళ్లీ ప్రొద్దుటనించీ ఎప్పటిలాగ ఆడుకోవడం? ఎలా ఉంది?"

"హూఁ" అని తనకికూడా అలాంటి కాలక్షేపం ఉంటే బాగుంటుం దన్నట్టు పినాకం తల పంకించాడు.

"అయితే నాతోకూడా వస్తావా? రావా? త్వరగా చెప్పు మరి వస్తావో రావో!"

"రాను. రాను. రాను. మా యమ్మతో బుద్ధిగా ఉంటానని చెప్పాను మాట నిలుపుకోవాలి. అదిగో! సూర్యాస్తమానం అవుతోంది. నిన్ను విడిచిపెట్టి నే వెళ్ళిపోవాలి. మరి వెళ్లొస్తాను. నీ ప్రయాణం సుఖంగాచేసిరా!"

"ఏమిటో మునిగిపోయినట్టు ఎక్కడికి పరుగెత్తుతున్నావు?"

"ఇంటికే. చీకటిపడేలోపున మా యమ్మ ఆ దేవకన్య రమ్మంది."

"రెండునిమిషా లుండవోయ్"

"చాలా ఆలస్యం అయిపోతుంది"

"రెండునిమిషాలకే?"

"సుందరి నన్ను తిట్టితే?"

"తిట్టనీ. తిట్టులన్నీ అయిపోయిన తర్వాత ఎలాగా మాటలాడక ఊరుకొంటుంది" అన్నాడు ఆ బడుద్ధాయి కొవ్వొత్తిగాడు.

"అయితే నువ్వేం చేస్తావు? నువ్వు ఒక్కడివి వెళ్తూఉన్నావా? నీతో ఎవరైనా వస్తున్నారా?"

"ఒంటరిగానా? మేము వందమందికి పైగా కలిసి వెళ్తున్నాము."

"అందరూ కాలినడకనే వెళ్తారా"

"ఒక్క-క్షణంలో ఒక్క గుఱ్ఱపుబగ్గీ వచ్చి నన్ను ఎక్కించుకొంటుంది. ఆ యానందరాజ్యానికి తీసుకొనిపోతుంది."

"ఆ గుఱ్ఱపుబగ్గీ యిపుడే వస్తే నేను నేమైనా యిస్తాను"

"ఎందుకు?"

"మీరందరూ వెళ్లడం చూద్దామని"

"మరికొంచెం సేపు ఉంటే నీవే చూడవచ్చు, మే మంతా ఎలాగ వెళ్తామో!"

"లేదులేదు, నేను ఇంటికి వెళ్లిపోవాలి"

"మరి రెండు క్షణాలు"

"ఇప్పటికే ఆలస్యం అయింది. దేవకన్య సుందరి ఏమను కొంటుందో!"

"ఏమనుకుంటుంది. నిన్ను గబ్బిలాయీలు తినేస్తాయని ఆమెకు భయమా"

"నరేగాని- ఆఊరులో నిజంగా స్కూల్సులేవా."

"స్కూలు నీడకూడా ఎక్కడా లేదు."

"మేష్టర్లు."


"ఒక్కడుకూడా లేడు"

"అయితే ఎవ్వరూ చదువుకోరు."

బాలగేయాలు

శ్రీ చింతా దీక్షితులు

(సంపాదించినవి)



1

(అయిదువ్రేళ్లు)

విడియాల విత్తు
కొండెముల కొరివి
పుట్టు సన్యాసి
ఉంగ్రాల భోగి
పెండ్లికి పెద్ద.

2

చిన్నన్న గుంట్లో
జింకలు మెయ్యా
పెద్దన్న గుంట్లో
పెయ్యలు మెయ్యా
కట్టిరారా పెద్దెంక
తోలుకురారా చిన్నెంక
పాలుపిండరా పాపయ్య
పొయిమీద పెట్టవే లింగమ్మ
దేవుకు తినవే ఎర్రపిల్ల
తంటాలుచెప్పే బుడ్డపిల్ల.

3

సందెకాడ ఎవరు మా
సందు కొచ్చినారు
గోపాలకృష్ణ డైతె
కోలాట మేసి పోరా
ఇల్లు మీద ఇల్లు
జాజి పూల పాన్పు
పాన్పు లోన రాడా
పేరు తెల్పి పోడా.

4

కొట్టు కొట్టు పేలాపిండి
కొట్ట లేను పేలాపిండి
విసురు విసురు పేలాపిండి
విసర లేను పేలాపిండి
బొక్కు బొక్కు పేలాపిండి
బొక్క లేను పేలాపిండి.

5

కొంగా కొంగా
నా గోళ్లుచ్చుకు
నీ గోళ్లియ్యి.

"చదువుకోరూ"

"ఎంత ఆనందంగా ఉంటుంది. నేను ఎన్నడూ అక్కడికి వెళ్ల లేదు గాని, ఎలాగ ఉంటుందో తెలుసుకోగలను"

"అయితే నువ్వు కూడా రాకూడదూ"

"ఇపుడు లాభం లేదు. నేను బుద్ధిగా ఉంటానని మా యమ్మతో చెప్పాను. ఇపుడు మాట తప్పదలచుకో లేదు."

"అయితే, మనతోడి జతగాళ్లు అందరికీ చెప్పు. వాళ్లు అక్కడ ఆడుకొంటూ ఉంటారు"

"మంచిది మరి కొవ్వొత్తీ! వెళ్లిరా. ఎపుడైనా నీ జతగాళ్లని మఱచిపోకు. జాపకం ఉంచుకో!" అని వెళ్లి మళ్లా వెనక్కి వచ్చి, తన జతగాడికేసి తిరిగి అడిగాడు.

"ఆ రాజ్యంలో వారానికి ఆరు రోజులు లక్ష్మీవారాలు ఒకరోజు ఆదివారం అని నీకు బాగా తెలుసునా?"

"తప్పకుండా"

"సంక్రాంతి సెలవులు జనవరి ఒకటవ తేదీనించి ప్రారంభమై డిశంబరు ఆఖరు వరకు ఉంటాయని తెలుసునా?"

"అంతే"

"ఎంత హాయిగా ఉంటుంది" అని పినాకం ఊటలూరాడు మళ్లీ నిశ్చయం చేసుకొని వెళిపోవా లనుకొన్నాడు.

"ఈమాటు వెళ్తాను. ఇంక నీవు పోయిరా!"

"వెళ్లిరా మరి"

"అయితే నువ్వు ఎప్పుడు బయలు దేరుతావు"

"ఇపుడే"

"పోనీ, ఒకగంటలో మీరు బయలు దేరితే అప్పటివరకైనా ఉంటాను."

"మరి దేవకన్య సుందరి?"

"ఇప్పటికే ఆలస్యం ఎలాగా అయింది. ఒకగంట అటు అయినా, ఇటుఅయినా మునిగిపోయింది లేదు"

"పినాకం, పాపం నిన్ను సుందరి తిట్టదూ?"

"నాకు ఆమాత్రం ఓర్పు ఉందిలే. ఆమె యెంతవరకు తిట్తుందో బాగా తిట్టనిస్తాను. వాగి వాగి ఊరుకొంటుంది"

ఇంతలో చీకటి పడింది. రాత్రి ప్రొద్దుపోయింది. దూరంగా ఒక్క చిన్న దీపం కదలడం కనిపించింది. కొంత సేపటిలో మాటలు వినిపించాయి. దూరంగా బూర ఊది నట్టయింది. అది సన్నంగా దోమకూత లాగ వినిపించింది. కొవ్వొత్తి ఒక్క గంతు వేసి "అడుగో! వచ్చింది" అన్నాడు.


"ఏమిటది?" అని పినాకం రహస్యంగా అడిగాడు.

"అదే! నన్ను తీసుకొని పోవడానికి వచ్చిన గుఱ్ఱపు బగ్గీ. నువ్వుకూడా వస్తావా? రావా?"

"అయితే మరి ఆరాజ్యంలో ఎవ్వళ్లూ చదవవలసిన అవసరం, లేదంటావా?"

"అక్కర లేదు. చదువరు. చదువరు"

"ఎంత హాయిగా ఉంటుంది. ఎంత ఆనందంగా ఉంటుంది, ఆ యానంద రాజ్యం!"



గాంధీ మహాత్ముడు

'వేంకటేశం'

తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ! ఇదివరకు మీకు గాంధీ తాతనుగురించి కొంత చెప్పాను ఆయన మనకు స్వాతంత్ర్యాన్ని యెట్లా సంపాదించిందీ, ఆ స్వాతంత్ర్యం మనం అనుభవించటానికి ఆయ నెటువంటి కష్టము అనుభవించిందీ మొదలైన సంగతులు చెప్పాను.

ఆయన త్యాగంవలన మనకు స్వాతంత్ర్యం వచ్చింది. దేశంలో ఇంగ్లీషువాళ్ళు పరిపాలించటం పోయింది. మన కాంగ్రెసు నాయకులే యిప్పుడు దేశాన్ని పరిపాలిస్తున్నారు. మనం సుఖంగా వుంటున్నాము. మనం యిట్లా సుఖంగా వుండటానికి కారణం యెవరు? గాంధీతాతే. అటువంటి గాంధీతాతని కొంతమంది నీచులు కుట్రచేసి హత్యచేశారు. అంతమంచి గాంధీతాతని ఎందుకు చంపారనుకొదూ మీ రనుకొనేది? చెబుతా దానికి కారణం. గాంధీతాత చాల మంచివాడు. ఆయన ఎప్పుడూ నిజమునే మాట్లాడుతాడు. ఇంకొకళ్ళని బాధ పెట్టటం ఆయన కిష్టంలేదు. మంచివాళ్ళను చూస్తే చెడ్డవాళ్ళ కెప్పుడూ కడుపుమంటేగా. మంచివాళ్ళు బతికి వున్నంతకాలం చెడ్డవాళ్ళ ఆటలు సాగవు అందుకనే కొంతమంది చెడ్డవాళ్ళు కలిసి కుట్రచేసి గాంధీతాతని చంపారు

గాంధీతాత చనిపోయాడని తెలియంగానే ప్రపంచమంతా దుఃఖించింది. ప్రతివ్యక్తీ తన అప్పుణ్ణి తన తండ్రిని కోలుపోయినంతగా దుఃఖించాడు. 'గాంధీగారు చాల మంచివాడే! ఆయ న్నెందుకు చంపారు? ఆయన్ను చంపటానికి ఎవరికి చేతులు వచ్చాయి?' అని ఒక ముసలివాడు ఏడ్చాడు. కొంతమంది గాంధీతాత మరణించాడని తెలియంగానే గుండె ఆగిపోయి చచ్చిపోయారు. ధనగర్వంతో, బలమదంతోవున్న దేశాలలోని ప్రజలుకూడా గాంధీతాత గొప్పతనాన్ని ఒప్పుకోకతప్పటంలా.

అన్నట్టు చెప్పటం మరిచిపోయా. గాంధీతాతను చంపింది ఒక హిందువే. భగవంతుడిని ప్రార్థించటానికి వెళ్ళుతున్న గాంధీతాతని యీ నీచుడు రివాల్వరుతో కాల్చి చంపాడు. చంపింది ఒక్కడే. కాని ఆ ఒక్కడి వెనకాలా అనేకమంది కుటదారు లున్నారు. ఆ చంపినవాడు ఒక పిచ్చివాడని కొందరంటున్నారు. మీరు కూడ నమ్ముతారా ఆ మాట? పిచ్చివాడు ఎక్కడన్నా ఒక మనిషిని చంపుతాడా? అందులో దేశనాయకుడిని, మహాత్ముణ్ణి అబద్ధం. పిచ్చివాడు వీథులవెంట పరిగెత్తుతూ కేకలువేస్తాడు కాని ఒక మనిషిని చంపడు. గాంధీతాతని ఒక పిచ్చివాడు చంపాడన్న విషయం మీరుమాత్రం నమ్మకోకండి.

ప్రపంచ ప్రజలందరు గౌరవిస్తున్న గాంధితాత గొప్పతన మేమిటి? ఆయన గొప్పతనానికి కారణాలు రెండే రెండు ఒకటి సత్యము. రెండు అహింస. గాంధీతాత ఎప్పుడూ అబద్ధమాడలా, పాండవులలో పెద్దవాడైన దర్మరాజుకూడ ఒకసారి అబద్ధమాడాడు కాని గాంధీతాత ఎప్పుడూ అబద్ధమాడలా. ప్రజలను బాధిస్తున్న రాక్షసులను సన్మార్గంలో పెట్టటానికి భగవంతుడుకూడ హింసనే ఉపయోగించాడు ఆ రాక్షసుల్ని సన్మార్గంలోకి తిప్పటం చేతగాక భగవంతుడు వాళ్ళని చంపివేశాడు రాక్షసులంటే ఎవరోగాదు. వాళ్ళు మనుష్యులే అంటే ఆ మనుష్యులు ఎప్పుడూ చెడ్డపనులే చేస్తుంటారు. గాంధీతాత చెడ్డవాళ్ళని మంచివాళ్ళుగా మార్చటానికి అహింసను ఉపయోగించాడు హింసించకుండానే దుర్మార్గులను సన్మార్గంలోకి తిప్పటానికి ప్రయత్నించాడు. చాలావరకు జయం పొందాడు. అంటే భగవంతుడు సాధించలేనిదానిని గాంధీతాత సాధించగలిగాడన్నమాట కాబట్టి గాంధీతాత భగవంతుడికంటే గొప్పవాడుకదూ? అందుకనే ఆయన్ని మహాత్ము డన్నారు.

అటువంటి గాంధీతాతని హత్యచేశారు. ఉపకారికి అపకారం చేశారు తిన్నయింటివాసాలు లెక్కపెట్టిన మాదిరిగా మనకు స్వాతంత్ర్యం సంపాదించిపెట్టి, అజ్ఞానంలో వున్న మనకు జ్ఞానం కలిగించిన గాంధీతాతను ఒక రాక్షసుడు చంపేశాడు.

గాంధీతాత చచ్చిపోయాడు. అటువంటి తాత యింతవరకు ఏ దేశంలోనూ పుట్టలేదు మనదేశంలో కూడా మళ్లా పుడతాడనే నమ్మకం లేదు. ఆ తాత ఆత్మకు శాంతి యివ్వటం మన విధి గాంధీతాత రోజూ ప్రార్థనలు చేస్తాడుగదా, ఉపవాసాలుండటం గాంధీగారి కిష్టంగదా అని మనంకూడా ప్రార్థనలు చేస్తూ ఉపవాసంవుంటే ఆయన ఆత్మకు శాంతి కలుగుతుందా? ఎప్పుడూ కలగదు. వెనకటికి, ఒక అబ్బాయి వాళ్ళ అమ్మదగ్గరకు వెళ్ళి "అమ్మా! అమ్మా! తాతయ్య గొప్పవాడని ఊళ్ళో అందరూ అంటారు తాత రోజూ గార్లు తినేవాడుట. నేను కూడా రోజూ గార్లుతింటే గొప్పవాడిని అవుతానా అమ్మా?" అని ఎక్కడన్నా గార్లు తింటే గొప్పవాళ్ళవుతారా? తాత చేసిన మంచిపనులు చేస్తే గొప్పవాళ్ళవుతారు. గార్లు తింటేమాత్రం కారు. అట్లాగే గాంధీతాత ప్రార్థనలుచేశాడనీ, ఉపవాసా లున్నాడనీ మనంకూడ వాటిని మాత్రమే చేస్తే ఆయనంతటి గొప్పవాళ్ళ మైపోతామా? ఆయన ఆత్మకు శాంతి కలుగుతుందా? ఆయన వేటియందైతే నమ్మకముంచి ఆచరించాడో మనం కూడా వాటిని ఆచరించితే ఆయన ఆత్మకు శాంతి కలుగుతుంది. అంటే మనంకూడ సత్యము, అహింసలయందు నమ్మకముంచి వాటిని ఆచరణలో పెట్టినప్పుడే ఆయన ఆత్మకు నిజంగా శాంతి కలుగుతుంది. లేకపోతే మనం తాతఋణం తీర్చుకోలేనివాళ్ళ మవుతాం.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

మన రాష్ట్రంలో మెట్టపైరుల పంటలు వేరుశనగ

మన రాష్ట్రంలో వేరుశనగ ప్రతిసంవత్సరము సుమారు 3,742,800 ఎకరాలలో పండిస్తారు. కాని 1947 వ సం లో వేరుశనగ 41,35,400 ఎకరాలలో పండించారు. మన దేశంలో వేరుశనగ పండించే పొలంలో నూటికి 41.5 వంతులు మన రాష్ట్రంలోనే వున్నది.

తొలకరించగానే ముందుగా నాటిన వేరుశనగ అక్టోబరు నెలలోనే పంటకు వచ్చింది. కొంచెం ఆలస్యంగా వేసిన పంట ఇప్పుడిప్పుడే పీకి నూరుస్తున్నారు. ఈ సంవత్సరం వానలు సకాలంలో కురవకపోవటంవలన పంట బాగా పండలేదు. మామూలు పంటలో నూటికి 82 వంతులు పంట ఈ సంవత్సరం పండుతుందని అంచనా వేశారుగాని తీరా నూర్పిడి జరిగినతరువాత మామూలు పంటలో నూటికి 78 వంతుల పంటయే ఈ సంవత్సరం పండినట్లు తెలిసింది. ఈ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం 16,07,600 టన్నుల వేరుశనగకాయలు పండినవి; ప్రతిసంవత్సరము సుమారు 16,19,450 టన్నులు వేరుశనగకాయలు పండుతూ వుండేవి. వేరుశనగగింజలధర 82 2/7 పౌనుల మణుగు 1 కి జనవరి 10 వ తేదీన గుంటూరులో రూ. 28-8-0; ఈరోడ్ లో రూ. 22-13-0; విజయనగరంలో రూ. 22-9-0. నంద్యాలలో రూ 22-5-0; బళ్లారిలో రూ 20-0-0 వున్నది. రెండు నెలల క్రితం ధర ఇంతకన్న నూటికి 15 నుంచి 20 వంతులవరకు తక్కువ వుండేది.

నువ్వులు

మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరము నువ్వుపంట దాదాపు 5,07,000 ఎకరాలలో వేస్తారు. భారతదేశంలో నువ్వు పంట వేసే భూమిలో నూటికి దాదాపు 14 7 వంతులు మన రాష్ట్రంలోనే వుంది. ఈ సంవత్సరం నువ్వుపంట మన రాష్ట్రంలో 5,08,600 ఎకరాలలో వేశారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవక పోవటం వలన తూర్పు గోదావరి, కర్నూలు జిల్లాలలో తప్ప ఇతర జిల్లాలలో నువ్వుపంట మామూలు కన్న తక్కువగానే పండింది. మొత్తం మీద ఈ సంవత్సరం నువ్వు పంట గత సంవత్సరం పంటలో నూటికి 85 వంతులు మాత్రమే పండిందని అంచనా వేశారు. కాని గత సంవత్సరం కన్న ఎక్కువ భూమిలో ఈ సంవత్సరం నువ్వు పండించటం వలన ఈ సంవత్సరం పంట మొత్తం 59,400 టన్నుల నువ్వులని అంచనా వేశారు. గతసంవత్సరం మొత్తం 58,600 టన్నుల నువ్వులు మాత్రమే మనరాష్ట్రంలో పండించారు. ఇంపీరియల్ మణుగు (82 2/7 పౌనులు) నువ్వుల ధర, జనవరి 10 వ తేదీన, కాకినాడలో రు. 31-10-0; తిరుచునాపల్లిలో రూ 31-9-0 విశాఖ పట్టంలో రు. 30-2-0; రాజమహేంద్రవరంలోను, ఏలూరులోను రు 29-12-0; విజయనగరంలో రు. 26-9-0 లు వున్నది. రెండు నెలల క్రితం ధరతో పోల్చిచూస్తే ఇప్పటిధర నూటికి 10 వంతులు పెరిగినదని చెప్పవచ్చును.

కందులు

ఈసంవత్సరం మన రాష్ట్రంలో కం దాదాపు 8,02,300 ఎకరాలలో వేశారు. గత సంవత్సరం దాదాపు 2,90,500 ఎకరాలలో మాత్రమే కంది వేశారు. కందుల ధర చాల జాస్తిగా వుండటంవలన దక్షిణాదిలో గత సంవత్సరం కన్న ఎక్కువభూమిలో కందివేశారుగాని, ఉత్తరసర్కార్లలో మాత్రం కందివేశిన భూమి గతసంవత్సరంకన్న కొంచెం తగ్గింది. కందిపంట ఈ సంవత్సరం దాదాపు గతసంవత్సరం పంటవలెనే పండుతుందని అంచనా వేస్తున్నారు. గతసంవత్సరం మన రాష్ట్రంలో మొత్తం 41 వేల టన్నుల కంధులు పండినవి; ఈ సంవత్సరం మొత్తం 40,700 టన్నులు కందులుమాత్రమే పండుతవని అంచనా వేస్తున్నారు.

మిరియాలు

మనరాష్ట్రంలో మిరియంపంట మలబారు, దక్షిణ కెనరాజిల్లాలలో మాత్రమే పండుతుంది. ఈ రెండు జిల్లాలలోను కలసి ఈ సంవత్సరం మొత్తం 95,900 ఎకరాలలో మిరియం పంట వేసినట్లు తెలుస్తున్నది. గతసంవత్సరం ఈ రెండు జిల్లాలలోను మొత్తం 97,049 ఎకరాలలో మిరియం పంట వేశారు. ఈ సంవత్సరంమలబారులో మిరియంచెట్లు పూతమీదవుండగా వానలు ఎక్కువగా కురిసాయి. అందువలన చాలపూలు నాశనమైపోయాయి. దక్షిణ కనరాలో మాత్రం పంట మామూలుగానే పండింది. గతసంవత్సరం ఈరెండు జిల్లాలలోను మొత్తం 9370 టన్నులు మిరియాలు పండించారు. కాని ఈ సంవత్సరం మొత్తం 8,330 టన్నులు మిరియాలు మాత్రమే పండుతవని అంచనా వేస్తున్నారు

ఫ్రాన్స్‌లో ద్రవ్యసంస్కరణలు

ఫ్రాన్సులో చలామణిలోనున్న ఫ్రాంక్ నాణెము మారకపు విలువను నూటికి 80 వంతులు తగ్గిస్తూ ఫ్రెంచిప్రభుత్వం ఒక శాసనం చేసినది. ఇంతవరకు బ్రిటిష్ నాణెమగు స్టర్లింగుకు 480 ఫ్రాంకులుగా మారకము జరుగుచుండేది. ఇక ముందు ఒక స్టర్లింగుకు 864 ఫ్రాంకులు చొప్పున మారకము జరుగును. ఇప్పుడు కొత్తగా నిర్ణయింపబడిన రేటుప్రకారము ఒక డాలరు 214. 392 ఫ్రాంకులు.

యుద్ధకాలంలోను, యుద్ధానంతరము ఫ్రాన్సులో చలామణిలోనున్న ఫ్రాంకునోట్ల మొత్తము చాల హెచ్చిపోయినది. 1938 వ సం. డిశంబరునెలలో దాదాపు 10,170 కోట్ల ఫ్రాంకులు చలామణిలో నుండెను. 1947 వ సం. నవంబరునెల 27-వ తేదీన 87,949 కోట్ల ఫ్రాంకులనోట్లు చలామణిలో నుండెను. అంటే చలామణిలో నున్న ద్రవ్యము దాదాపు 9 రెట్లు పెరిగిపోయినది. కాని ఇంత అధికమొత్తము ధనముతో కొనుటకు వస్తువులు మాత్రము లేవు. యుద్ధకాలంలో ఫ్రాన్సు పరిశ్రమలన్నియు నాశనమై పోయినవి. ఆ పరిశ్రమ నింకను యథాస్థితికిరాలేదు. ఏదో కొద్దిమాత్రముగా పనిచేస్తున్న ఆ పరిశ్రమలలోనే సమ్మెలు చీటికిమాటికి జరుగుచుండుటచే ఉత్పత్తి చాల తక్కువగా నున్నది. విదేశములనుండి వస్తువులు దిగుమతి చేసుకొనుటకు కావలసిన ధనముకూడా లేదు. ఫ్రాన్సులో బంగారపు నిలువలు 1938 వ సం. డిశెంబరు నెలలో 243 కోట్ల ఫ్రాంకులు వుండెను. కాని 1947 వ సం. ఆగస్టునెంకు ఈ నిలువలు 54 కోట్ల ఫ్రాంకులకు తగ్గిపోవును. ఈ నిలువలు వాడినచో అప్పటినుండి రెండు నెలలైన సరిపోవని అంచనావేసి, వాడటం మానివేశారు. యుద్ధం ముగిసినతరువాత చాలకాలంవరకు లోకోద్ధరణసంఘు మూజమాన్యమున అత్యవసర ఆహార పదార్థములు ఇతర యూరప్ దేశాలతోపాటు ఫ్రాన్సుకు కూడ సరఫరాచేయబడెను. ఆ సరఫరాలు మానివేసి, ఫ్రాన్సు బంగారము, డాలరు నిలువలు పూర్తిగా అయిపోయినతరువాత అమెరికా ప్రత్యేకముగా కొంత ఋణ మిచ్చి అత్యవసర ఆహారపదార్థములు కొనుక్కొనుటకు, ఫ్రాన్సుకు అవకాశ మిచ్చినది.

ఫ్రాన్సులో పరిశ్రమలు, వ్యాపారమంతయు నాశనమైపోవుటవలన ప్రభుత్వ ఆదాయము చాల తగ్గిపోయినది. ప్రభుత్వ ఖర్చులకు కావలసిన ధనము బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్‌వద్దనుండి అప్పుపుచ్చుకొనటంప్రారంభించారు. ఈవిధంగా మొత్తం 1500 కోట్ల ఫ్రాంకులు ప్రభుత్వం అప్పు పుచ్చుకుంది. ప్రభుత్వావసరములకు, పరిశ్రమల పునరుద్ధరణకు కావలసిన డబ్బు అప్పుగా పుచ్చుకుని ఒకవంక చలామణిలోనున్న ధనమును పెంచివేస్తూ, వేరొకవంక ఆ ధనముతో కొనుటకు వస్తువులు దొరకకపోవటము, అత్యవసర పదార్థములు అవసరములకు చాలనంత తక్కువ మొత్తములుగా రేషన్ చేయుటమువలన బ్లాక్ మార్కెట్ ధరలు, కంట్రోలులేని వస్తువుల ధరలు విపరీతముగా పెరిగిపోయినవి. డాలరు కొరతవలన ఆహార పదార్థముల దిగుమతి తగ్గించటము, గోధుమపంట ఈ సంవత్సరం కొంచెం చెడిపోవటమువలన వ్యవసాయదారులు ఆందోళనజెంది తమ గోధుమలను ఏ ధరకైనా అమ్ముటకు యిష్టపడక దాచుకొనుచున్నారు. బలవంతముగా వ్యవసాయదారులవద్దనున్న ధాన్యము కొనుటకు ఫ్రెంచి ప్రభుత్వమునకు అధికారముగాని, బలముగాని లేదు. అందువలన వస్తువులన్నిటి ధరలు, ముఖ్యముగా ఆహారపదార్థముల ధరలు విపరీతముగా పెరిగిపోయినవి 1938 వ సం.తో పోల్చిచూస్తే, కార్మికుల జీతములు ఆరున్నర రెట్లు, అద్దెలు రెండురెట్లు, మాంసముధర 24 రెట్లు, గోధుమలుధర 19 రెట్లు, సారాధర 13 రెట్లు, వెన్నధర 33 రెట్లు పెరిగినవి 1938 వ సం. ధరలతో పోల్చి చూస్తే వ్యవసాయవస్తువుల ధరలు 11 రెట్లు, పారిశ్రామిక వస్తువుల ధరలు ఎనిమిదిన్నరరెట్లు పెరిగినవి; జీవనవ్యయం మొత్తం 11 రెట్లు పెరిగినది ఈ ధరలన్నీ ప్రభుత్వముచే నిర్ణయింపబడిన కంట్రోల్ ధరలు మాత్రమే. బ్లాక్‌మార్కెట్ ధరలు కంట్రోల్ ధరలకు దాదాపు మూడు రెట్లు వుంటున్నవి. ప్రభుత్వ ధరలకు అమ్మే రొట్టెలో సగానికి సగం మాత్రమే గోధుమ వుంచి, మిగతా భాగం మొక్కజొన్న వేస్తున్నారు. పాలు రోగులకు పిల్లలకు తప్ప మరెవ్వరికి యిచ్చుటలేదు. కొన్ని పదార్థములు రేషన్ చేసినా కొన్ని వారాలపాటు సరుకులేదని చెప్పి, రేషన్ యివ్వటమే మానివేస్తున్నారు. ఈ జీవన పరిస్థితులు భరించలేక కార్మికులు ఎక్కువజీతములు కోరుతూ సమ్మెలు చేస్తుండటము, ఆ సమ్మెలవలన ఉత్పత్తి మరింత తగ్గిపోయి, పరిస్థితి మరీ అధ్వాన్నమై పోవటము జరుగుచున్నది

ఇట్టి పరిస్థితినుండి బైటపడుటకు చలామణిలో నున్న ధనమును తగ్గించి, ధరలు పెరుగకుండా అదుపులోనుంచి, అత్యవసర పదార్థములు తగినంత మొత్తములు సరాఫరా చేయవలెను. ఈ మూడు విషయములలోను ఫ్రెంచి ప్రభుత్వము కొంతవరకు సంతృప్తికరమైన విధానమునే అనుసరించుచున్నది. కార్మికుల వేతనములు, వస్తువుల ధరలు పెంచకూడదని ఈ మధ్యనే నిర్ణయింపబడినది కొనుగోలు దారులు వస్తువులు కొనుక్కొనుటకు అప్పు యివ్వకూడదని బ్యాంకులకు ఉత్తరువు ఈయబడెను. చలామణిలోనున్న ధనమును తగ్గించుటకు ఒక లెవీ విధానము నిర్ణయింపబడినది సంవత్సరమునకు $4\frac{1}{2}$ లక్షల ఫ్రాంకులు మించిన ఆదాయం గల వారందరూ తమ లాభములలో కొంతభాగమును లెవీ చెల్లించుటగాని, లేక ప్రభుత్వ ఋణములకు చందాలు వేయుటగాని చేయవలెను. ఈ లెవీ ప్రకారం 12500 కోట్ల ఫ్రాంకులు వెంటనే చలామణిలో నుండి తొలగించబడును.

కొంతకాలం క్రితం మన దేశంలో వెయ్యి రూపాయి నోట్లు చలామణిలో నుండి తొలగించినట్లు, ఈమధ్యనే ఫ్రాన్సులో అన్నిటికన్న పెద్దనోటగు 5 వేల ఫ్రాంకు నోటు చలామణిలో నుండి తొలగించారు. ఈ విధంగా 38 వేల కోట్ల ఫ్రాంకునోట్లు చలామణిలో నుంచి తొలగిపోతవి. ఈ నోట్లు వున్నవారు పూర్తిగా నష్టపడిపోరు. క్రింది తరగతుల వారివద్ద నున్న నోట్లను పూర్తిగా ఇతరనోట్లలోనికి మారుస్తారు. ధనికుల వద్దనున్న నోట్లు, వారి వద్దనున్న నోట్ల మొత్తమును బట్టి, కొంత భాగము మాత్రమే ఇతర నోట్లలోనికి మార్చి, మిగిలిన భాగమును ప్రభుత్వమునకు ఋణము యిచ్చినట్లుగా జమకట్టుతారు. ఈ విధంగా లెవీవలననూ, నోట్ల చలామణి రద్దు! చెయ్యటం వలననూ మొత్తం 80 వేల కోట్ల ఫ్రాంకులు చలామణిలో నుండి తగ్గించ బడవచ్చును.

ఈ లెవీలో వసూలుచేసిన సొమ్ము పరిశ్రమల పునరుద్ధరణకు ఉపయోగింతురు. అందువలన పరిశ్రమలు కొంతవరకు బాగుపడి, ఉత్పత్తి అధికమై దేశములో కావలసిన వస్తువులు లభించి ధరలు తగ్గుటకు అవకాశ మిచ్చును. అమెరికా



నుండి కావలసిన అత్యవసర ఆహారపదార్థములు కొనుక్కొనుటకు, మార్షల్ పథకం ప్రకారం ఋణం లభించేవరకు సరిపోయేటంత, తాత్కాలిక ఋణం యివ్వవలసిందని ఫ్రెంచిప్రభుత్వం అమెరికాను అర్థించవచ్చును. ఇట్టి ఋణము ఈ మధ్యనే ఇటలీకి యివ్వబడినది కాబట్టి ఫ్రాన్సుకు కూడ ఇచ్చుటకు అమెరికన్ ప్రభుత్వము అంగీకరించవచ్చును.

ఫ్రాన్సు దేశములో ధరలు విపరీతముగా పెరిగిపోవుటవలన ఫ్రాంకు మారకపువిలువ చాలవరకు పడిపోయినది. ఫ్రాన్సునుండి అమెరికా ఎగుమతి చేసిన వస్తువులకు వచ్చిన డాలర్లు చాల చౌకధరకు ప్రభుత్వమునకు అమ్మివేయవలసి వచ్చుటచే, వ్యాపారస్థులు డాలర్లు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముట మొదలుపెట్టినారు. అంతేగాక వ్యాపారస్థులు, ఇతరవ్యక్తులు స్విట్జర్లాండు బ్యాంకులలోను, తమ ఇండ్లలోను డాలరు నోట్లు దాచుకుంటున్నారు. అందువలన అత్యవసరములగు ఆహారపదార్థములను కొనుటకు డాలర్లు లభించుటలేదు. కాబట్టి డాలరుమారకపు విలువ తగ్గించవలెనని ప్రభుత్వం నిర్ణయించినది. ఈ నిర్ణయం ప్రకారం వ్యాపారస్థులు వ్యాపారములో సంపాదించుకున్న డాలర్లలో సగం మొత్తము మాత్రమే ప్రభుత్వమునకు కొత్తరేటు ప్రకారం అమ్మవలెను. మిగిలిన డాలర్లు వారికి లభించిన ధరలకు అమ్ముకొనవచ్చును. ప్రభుత్వము ఆహారపదార్థములు, బొగ్గు, నూనెలుమాత్రమే దిగుమతిచేయును. వ్యాపారస్థులు తమవద్దనున్న డాలర్లతో ఇతర వస్తువులు దిగుమతి చేయవచ్చును ఫ్రాంకుమారకపు విలువ నూటికి 80 వంతులు తగ్గించినారు కాబట్టి డాలర్లు ప్రభుత్వమునకు అమ్ముటంవలన వ్యాపారస్థులకు ఏమంత నష్టముండదు. అందును సగము డాలర్లు మాత్రమే ప్రభుత్వమునకు అమ్మవలెను గాబట్టి మిగిలిన సగభాగముతో ఎంత లాభమైనా పొందవచ్చును. ఈ ఏర్పాటు సంతృప్తికరముగ అమలు జరిగిన అత్యవుసర ఆహారపదార్థములు, ఇతరవస్తువులుకూడ దిగుమతి అయి, ధరలు పెరిగి పోకుండా వుండుటకు వీలగును. పైజెప్పిన లెవీ విధానమును, ఈ మారకపువిధానమును ఫ్రెంచిప్రభుత్వము సంతృప్తికరముగా అమలు జరుపగల్గినచో ఫ్రాన్సుఆర్థికస్థితి కొంతవరకు చక్కబడును.

మహాత్ముని సత్యాగ్రహ యాత్రలు

శ్రీ యం. చలపతిరావు



న్యూకాజిల్ నగరములో భారతీయులు స్త్రీలు పురుషులు బాల బాలికలు వందలుగా ఒక వామనమూర్తి నాయకత్వమున సమావేశమైనారు. వీరిలో హెచ్చు మంది ఉత్తర నేటాల్ గనులలో పనిచేస్తూ ఉన్నారు. తమ, తమ భార్యల, పుత్రికాపుత్రుల స్వాతంత్ర్యం మీద ప్రభుత్వం విధించిన మూడుపౌనుల పన్నుకు తమ అసమ్మతిని సూచించుటకు వీరందరూ సమ్మె చేసినారు. యజమానులు ఏర్పాటుచేసిన నివాసములను వదలివేసినారు. వేరే ఇళ్లు వారికి లేవు. వారి ఆస్తి అంతా వారు ధరించిన దుస్తులు, కప్పుకొనిన కంబళ్లూ. ఆచ్ఛాదనగా ఆకాశము, పదిమందీ తిరిగే బాటే పండే పక్క, తమ నాయకునిలో అచంచల విశ్వాసము ఇవే— వారికి ఉన్నవి. అదృష్టవశాత్తు ఆ నాయకుడు గాంధీజీ అయినాడు.

అప్పటికే ఆయనలో కార్యదక్షత, ఆత్మవిశ్వాసము, పట్టుదల కన్పించుతూ ఉండేది. ఒక మామూలు భారతీయునిఇంట ఉంటూఉన్నాడు. బహు చిన్న యిల్లు. అది తీర్థక్షేత్రము అయినది. జనము తండోపతండములుగ వస్తున్నారు. ప్రొద్దస్తమానము పొయిలో మంటలు లేగుతూనే ఉంటున్నవి. రోజులు గడుస్తున్నవి. వచ్చేప్రజ పెరిగి, పోతూ ఉన్నది. వందలు వేలైనవి. ఆ వచ్చేవారిలో కొందరు జైళ్ళకు పోయి వచ్చిన వారున్నూ ఉన్నారు. అయినా అంతా ఎలాంటి సంఘటనలూ లేక బహుప్రశాంతంగా గడచిపోయినది.

వీరందరికీ ఎలా నివేశనము ఏర్పాటు చేయడం ! వీరికి భోజనవసతి కలిగించడము ఏలాగ ? ఈ రెండు ప్రశ్నలగురించే గాంధీజీ నిరంతరము ఆలోచిస్తూ ఉన్నాడు. ఏదో మార్గాంతరము ఒకటి గోచరించినది. యాత్రికుల నందరినీ సత్యాగ్రహ సైనికులుగ ఎందుకు మార్చివేయకూడదు ? ఈ సైన్యమును యావత్తూ ట్రాన్సువాల్‌కు నడిపించి అక్కడి జెయిళ్ళను అన్నింటినీ ఎందుకు నింపకూడదు. లేదా వీరినందరినీ 'టాల్‌స్టాయి' కమతంకు తీసుకుపోతే ఆసత్పురుషుడూ కాలెన్‌బాక్ కావలసిన ఏర్పాట్లు అన్నీ చేస్తాడు. కాని అయిదువేల మంది ఉన్నారు. ట్రాన్సువాల్ సరిహద్దుకు వీరిని తీసుకు వెళ్లేందుకు రైలు ఖర్చులుకూడా లేవు. పైగా ఇక్కడికి చాలా దూరం. అయినా నడచి వెళ్ళడానికి గాంధీజీ నిశ్చయించుకొనినాడు.

"నా హృదయమును కఠినం చేసుకోవడము కంటే నాకు మార్గాంతరము లేదు." అని ఈ చరిత్రాత్మక నిర్ణయమునుగురించి గాంధీజీ వ్రాసినాడు. ఈ పనివారి వెంట వారి భార్యలు, పిల్లలూ ఉన్నారు. వీరిలో ఎవ్వరున్నూ తిరిగి గనుల ప్రాంతమునకు పోదలచలేదు. ట్రాన్సువాల్ యాత్రానియమ, నిబంధనలను యావన్మందికీ చదివి వినిపించినారు. ప్రతి సైనికునకూ రోజుకు ఒకటిన్నర పౌను రొట్టె ఒక ఔన్సు చక్కెర మాత్రమే ఆహారంగా ఇస్తారు. అవసరమైన దుస్తులకంటె ఎక్కువ ఎవ్వరూ తెచ్చుకొనరాదు. ఇతరుల వస్తువులను 'తాక' రాదు. నిర్బంధమునకు స్వాగతమివ్వవలెను. తిట్టులనైనా కొరడాదెబ్బలనైనా సరే సహనము పూని ఓర్చుకొనవలెను.

అక్టోబరు 28వ తేదీన ఈ సైనికదళము యాత్రను ప్రారంభించినది. చార్లెస్‌టౌన్ అనే ఒక సరిహద్దుపట్టణమును సురక్షితముగ చేరినారు. నగరము బహుచిన్నది. అయినందున స్త్రీలకూ, పిల్లలకూ మాత్రమే ఆచ్ఛాదనము లభించినది. మిగిలినవారు ఆరుబయటనే బస చేసినారు. తమకు తామే 'పాకీ' పని చేసుకునేవారు. స్థలమును శుభ్రపరుచుకొనే వారు. న్యూకాజిల్ నుంచి అదనముగా కొన్ని కులు వచ్చినాక, ఇరవై నాలుగు గంటలూ గాడిపొయ్యి మండుతూనే ఉన్నది. రొట్టె, చక్కెరకు బదులు ఇప్పుడు అన్నమూ, పప్పూ దొరికినది. అయినా అందరూ అన్నాతురుల వలెనే కన్పించుచున్నారు. నాయకవర్గమునకు ఉండే ఇబ్బందులు అనేకముగా ఉన్నవి. వంటవాళ్ళకు గాంధీజీ నాయకుడు. వడ్డనకు ఆయనే నడుముకట్టేవాడు. పప్పు కేవలము జలమయంగానైనా ఉండేది. అన్నము ననురాయ అయి భోజన యోగ్యంగాకనైనా ఉండేది. అయినా ఒక్క మెతుకు వృధా కానివ్వలేదు. ఆగ్రహ ప్రదర్శనముగాని శిక్షణ భిన్న ప్రవర్తనముగాని లేదు. కార్మికవాహిని దినదిన ప్రవర్ధమాన మవుతూ ఉన్నది. మార్గ మధ్యమున తమ పిల్లలు మరణించినా మొక్కవోని ధైర్యముతో యాత్ర సాగించి ఇరువురు స్త్రీలు గాంధీ సేన మకామును చేరినారు. ట్రాన్సువాల్ సరిహద్దును చేరుటకు పూర్వమే చార్లెస్‌టౌన్ వద్దనే యాత్రికులను అరెస్టు చేయవలసినదిగా గాంధీజీ ప్రభుత్వమునకు తంతీ ఇచ్చినాడు. ఒక వారము రోజులవరకూ సమాధానము ఏమీ లేదు. సైన్యమునకు కొత్త ఉత్తరువులను జారీచేసినారు. ఎనిమిది రోజుల పర్యంతం టాల్‌స్టాయ్ ఫారమును చేరేవరకు, లేదా మధ్య అరెస్టు అయ్యేవరకూ— రోజుకు ఇరవై, ఇరవై నాలుగు మైళ్ళవంతున ప్రయాణం చేయవలెనని సేనాని ఆదేశించాడు.

నవంబరు 6-వ తేదీ ఉదయం ఆరు గంటలకు 2,087 మంది పురుషులు 127 మంది స్త్రీలు, 57 గురు పిల్లలు దైవప్రార్థనలుచేసి భగవంతుని పేర యాత్రను ఆరంభించినారు. చార్లెస్‌టౌన్‌కు ఒక మైలు దూరములో సరిహద్దు కవాటముకడ అశ్వారూఢులైన రక్షకభటులు నిలచి ఉన్నారు. తను సైగ చేసినప్పుడు ముందుకు సాగవలసిందని తన పరివారమునకు ఉత్తరువులు ఇచ్చి గాంధీజీ వీరివద్దకు వెళ్ళినాడు. గాంధీజీ ఇంకా సైగ చేయనే లేదు. ఆయన ఆ పోలీసు వారితో మాట్లాడుతూనే ఉన్నాడు. ఉత్సాహభరితులైన భారతీయులు కోలాహలంగా సరిహద్దును దాటి వాల్క్స్‌రస్ట్ పట్టణమును ప్రవేశించినారు. పోలీసువారు వీరిని అరెస్టు చేయలేదు. కొద్ది వ్యవధిలోనే అందరూ తిరిగి మామూలుగా సుశిక్షితులైన సైనికుల వలె ఉండిపోయినారు. వాల్క్స్‌రస్ట్ వీధులలోను ఈ సైనికదళం పోతూ ఉండగా, దౌర్జన్యం ప్రయోగిస్తామని లోగడ బెదిరించిన శ్వేత జాతీయులు ఏమీ చేయలేదు. మరొక ఎనిమిది మైళ్ళు యాత్ర సాగించి సాయంత్రమునకు పామ్‌ఫర్డు చేర్కొనినారు. తమ తమ భోజన పదార్థాల వాటా తీసుకొని ఆరుబయట విశ్రమించినారు. గాంధీజీని అర్ధరాత్రి అరెస్టు చేసినారు. అయినా ఉదయం యాత్ర మామూలు ప్రకారము సాగిపోయినది. బెయిలుమీద విడుదలైన గాంధీజీ వచ్చి మరల యాత్రికులను కలుసుకొనినాడు.

ఆదిన నిర్ణయించిన ప్రకారము కార్యక్రమం నిర్విఘ్నముగా సాగిపోతూ ఉన్నది. మరొక నాలుగు రోజుల నడకతో వీరు జోహాన్సుబర్గును చేరుకోగలరు. యాత్రికులలో ఉత్సాహం, అధికారులలో ఆందోళన హెచ్చుతూ ఉన్నది. నవంబరు 9వ తేదీన పొలక్ భారతదేశమునుంచి గోఖలే పంపగా, వచ్చి టీక్‌వర్త్‌వద్ద యాత్రాదళమును కలుసుకొనినాడు. అదే రోజున గాంధీజీని అరెస్టుచేసి హైడెల్‌బర్గు తీసుకువెళ్ళినారు. దళనాయకత్వమును పొలక్ వహించినాడు. దళము గ్రేలింగ్‌స్టాండ్ చేరినది. జోరున వర్షం కురుస్తూ ఉంది. భోరున గాలి వీస్తూఉంది. అలాగే యాత్రికులు ఆరాత్రి గడపినారు. తమ అరెస్టుకు అన్ని ఏర్పాట్లూ జరిగిన వని వీరికి వర్తమానం వచ్చినది. మర్నాడు ఉదయం వీరు బాల్ఫర్ చేరినారు. అక్కడ మూడు రైళ్ళు తయారుగా ఉన్నవి. వీరిని నేటాల్ పంపివేయడానికి అధికారులు నిశ్చయించినారు. "మా వామనమూర్తిని మాకు వప్పగింత పెడితే గాని మేము రైలు ఎక్కము" అని మొండివేసినారు. పోలక్ బ్రతిమిలాడి నిర్నిబంధముగా రైలు ఎక్కిపోవడానికి సైన్యమును ఒప్పించినాడు. ఇళ్ళు లేవు ఉద్యోగాలులేవు. ఇప్పుడు నాయకుడున్నూ లేడు. ఈ స్థితిలో ఆ రెండువేల వీరులున్నూ నెటాల్‌కు బయలుదేరినారు. వారు అనేక ఇబ్బందులకు లోను కావలసి వచ్చినది. తరువాత కారాగారములలో కృశించవలసివచ్చినది. వీరి నాయకప్రముఖులను మూగ్గుర్ని వేరు వేరుగా నిర్బంధించినారు. గాంధీజీని బ్లూమెంఫాంటీన్ లోనూ, కాలెన్‌బాక్‌ను ప్రెటోరియాలోనూ ఖైదుచేసినారు. నేటాల్ అంతట స్వప్రేరిత అల్లరులు ఆరంభమైనవి. భారతదేశం నుంచి అసమ్మతి, నిరసన ప్రకటన ప్రవాహమూ బయలుదేరినది. తుదకు యాత్రికులు విజయము పొందినారు. మూడు పౌనుల పన్ను రద్దు అయినది. సత్యమునకు అఖండ విజయము చేకూరినది.


తరువాత రెండు దశాబ్దములకు సువిశాల భారతదేశమున అంతకంటెనూ ప్రధానమైన యాత్రను నడుపవలసి ఉన్నది. 1915 లో మాతృదేశమునకు తిరిగివచ్చి యావద్భారత పర్యటనమును ప్రారంభించినాడు. దేశమును, దేశీయులను అర్థం చేసుకోవాలనే ఆత్రంలో హిమాలయములు మొదలు కన్యాకుమారి వరకూ సంచారము చేసినాడు.

రౌలట్‌బిల్లు ఆందోళనసందర్భమున మరీ ఎక్కువగా దేశాటనము చేయవలసి వచ్చినది. తిరుగవలసిన ప్రాంతము హెచ్చినది. ఉపన్యసింపవలసిన సభలు పెరిగినవి.

లార్డ్ చెల్మ్స్‌ఫర్డ్‌కు 1920, జూన్ 12-వ తేదీన వ్రాసిన లేఖద్వారా ప్రారంభించిన పోరాటమే సత్యాగ్రహవ్యూహమున గణనీయమైనది. కాంగ్రెసు ఖిలాఫత్ సంస్థలు రెండున్నూ ఆయన ఆజ్ఞానుబద్ధమై ఉన్నవి. అలీ సోదరులతో యావద్భారత సంచారాలు మొదలైనవి. గాంధీ టోపీ, రాట్నములచే చిహ్నముగ ఏర్పడిన కొత్త కార్యవిధానమునకు ప్రజలను ఉన్ముఖులుగా చేయుటకే వీరీ పర్యటనమును ప్రారంభించినారు.

బీహారులో ఒక కుగ్రామంలో గాంధీజీ ఆయన పరివారము చిక్కుకుపోయినారు, వర్షము పడుతూ ఉన్నది. ఒక ముసలిది "గాంధీజీ యేడి?" అంటు వెతుక్కువచ్చింది.

"అయ్యా, నాకు ఇప్పుడు నూటనాలుగు సంవత్సరాలు. భారతదేశము నందలి పుణ్యక్షేత్రము లన్నింటినీ సేవించినాను. మా ఇంటనే రెండు ఆలయములను కూడా ఏర్పాటు చేసుకొనినాను. మనకు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవతారములుగ వచ్చినట్లే మహాత్మాగాంధీకూడా ఒక





అవతారమువలె ప్రత్యక్షమైనట్లు విన్నాను ఆయనను దర్శించేవరకూ నాకు మరణము సంప్రాప్తము కాదు. నాచూపు మందగించి పోయినది." అన్నది ఆ వృద్ధురాలు. ఇదే విశ్వాసము భారతజాతినంతనూ కదల్చి వేసినది. మహాత్ముడు ప్రేమ దౌర్జన్యమును సహింపవలసి వున్నది. అస్సాంలో 25,000 మంది చేరిన బహిరంగ సభలో "నా మాటలనుమాత్రం విని నెమ్మదిగా ఇళ్లకు పోతారా? లేక స్వరాజ్యం కొరకు పాటుపడతారా?"అని గాంధిజీ ప్రశ్నించినాడు. "మిమ్ములను ఎన్నటికీ విడనాడము" అని 25,000 కంఠములు ఏకధ్వనిగా పలికినవి. "అలాగైతే మీ విదేశవస్త్రములన్నింటినీ ఇలా ఇచ్చి వేయండి" అని గాంధిజీ అనగానే బ్రహ్మాండమైన జ్వాలలు బయలు దేరినవి.

నాలుగు సంవత్సరముల సన్నాహం 1929వ సంవత్సరములో రానున్న పోరాటమును సూచించినాడు. ద్వేషానలము దేశమంతటా వ్యాపించినది. శాసనసభలలో ఉపన్యసించడంలో ప్రజలు విసుగెత్తి పోయినారు. 1930 మార్చి 2-వ తేదీన రెజినాల్డ్ రేనాల్డ్స్ ద్వారా రాజప్రతినిధికి తుదిసందేశము పంపినాడు. అందు ఏకాలశ సూచనలు చేసినారు. వీటిని అంగీకరించకుంటే 11-వ తేదీన ఉప్పుచట్టమును తిరస్కరించుటకు పూనుకొంటానని తెలియజేసినాడు. రాజప్రతినిధి సమాధానం అసంతృప్తికరంగా ఉన్నది. "సవినయముగ నేను రొట్టెను అడిగినాను. అందుకు బలుగా నాకు రాయి వచ్చినది." అని గాంధీజీ రాజప్రతినిధి ప్రత్యుత్తరమును వ్యాఖ్యానించినాడు. మార్చి 11-వ తేదీన సబర్మతీ నదిఒడ్డున తన అఖరుసందేశమును ఇచ్చినారు. "మన వాదము బరమైనది. మన పద్ధతులు నిష్కళంకమైనవి. భగవంతుడు మనపక్షమున ఉన్నాడు. సత్యమును విడనాడనంత వరకూ సత్యాగ్రహికి పరాజయం ఉండదు. రేపు ప్రారంభం కానున్న సమరమున విజయప్రాప్తికి నేను ప్రార్థించుచున్నాను."

'సత్యము' తిరిగి యాత్రను ప్రారంభించినది. సర్వప్రపంచమునకూ 'దండీ' పేరు ఎరుకయినది. గాంధిజీ తన అనుచరులను స్వయముగా ఎన్నుకొనినాడు. ఎందరో మేమంటే మేము అని ముందుకువచ్చినారు. కాని కావలసిన సంఖ్య బహుకొద్ది మార్చి 12 యంగ్ ఇండియా పత్రికలో 79 మందిగల సత్యాగ్రహుల పట్టిక ప్రకటితమైనది. 61 సంవత్సరముల గాంధిజీ మొదలు 16 సంవత్సరముల యువకుల వరకు ఈ జట్టులో ఉన్నారు.

గాంధిజీ రోజు తరువాత రోజు తన కార్యక్రమమును విశదీకరించుచున్నాడు. ప్రశ్నలకు సమాధానము చెప్పుతూ ఉన్నాడు ప్రాతఃకాలప్రార్థనల సందర్భమున తన ఉపదేశము బోధించుచునే ఉన్నాడు. ఆశ్రమమునకు వచ్చే ఆగంతుకులకు అంతులేదు. వివిధప్రాంతముల నుండి సందేశములు వచ్చినవి.

12-వ తేదీ ఉదయం ఆరుగంటలకు 79 సత్యాగ్రహులు వెంటరాగా గాంధిజీ తన యాత్రను ప్రారంభించినాడు. ప్రపంచ దృష్టి యావత్తూ సంఘటనమీదనే కేంద్రీకృతమై ఉన్నది. బ్రహ్మాండమైన జనసమూహము ఆయనను వెంబడించినది. చేత కర్రబూని పెద్దపెద్ద అంగలు వేస్తూ గాంధిజీ ముందుసాగినాడు. రామచంద్రుని లంకాపురి యాత్రవలె దండీ యాత్ర చిరస్మరణీయం కాగలదని మోతీలాల్ నెహ్రూ అన్నాడు.

ప్రజా కోలాహలం విపరీతంగా ఉంది. బయలుదేరిన నాలుగురోజుల తరువాత అయినా గాంధిజీని మహదేవదేశాయ్ కలుసుకోలేక పోయినాడు. ఏప్రిల్ 5-వ తేదీన యాత్రికులు 'దండీ' చేరినారు.

మర్నాడు తన స్వచ్ఛందసైనికులను గాంధిజీ సాగరతీరమునకు తీసుకొని పోయినాడు. ప్రతి రోజూ పరిసరగ్రామాలకు పోయి శాసనోల్లంఘనోద్యమమును ప్రచారం చేసినాడు.

మే 4-వ తేదీన వింతపరిస్థితులలో గాంధీజీని అరెస్టుచేసినారు. రాత్రి 12-45 గంటలకు సూరత్ జిల్లా మేజస్ట్రేటు, ఇద్దరు పోలీసుఉద్యోగులు చేత పిస్టళ్లు బూని ముప్పయిమంది సాయుధపోలీసులు వచ్చినారు. యాత్రికులను చుట్టుముట్టినారు. బ్రిటిష్ ఉద్యోగి గాంధిజీ ఉన్న చోటికి వెళ్లి "మీరేనా మోహనదాస్ కరంచంద్ గాంధి" అని టార్చిలైటు వేసి అడిగినాడు. "మీరు నన్ను కోరుతూ ఉన్నారా?" అని గాంధిజీ ప్రశ్నించి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వ్యవధి అడిగినాడు. ఆ ప్రకారం జరిగింది. "నన్ను ఏ సెక్షను క్రింద అరెస్టు చేసినా"రని గాంధిజీ మేజస్ట్రేటును అడిగినాడు. తన దగ్గర ఉన్న వ్రాత ఉత్తరువును గాంధిజీకి అందచేసినాడు. 1827 రెగ్యులేషన్ 25 కింద అరెస్టు జరిగింది. గాంధిజీ అంతా సర్దుకొని ప్రార్థన పూర్తి చేసుకొని బయలుదేరినాడు. 1-10 నిమిషాలకు లారీలో ఎక్కించుకొని వెళ్లి పోయినారు. "అర్ధరాత్రివేళ దొంగలవలె వచ్చినారు ఆయనను ఎత్తుకుపోవడానికి" అని మీరాబెన్ అన్నది.

1930 పోరాటంలో సత్యం జయించినదా, లేదా అనేది తేల్చడం కష్టం. కాని తరువాత మూడేళ్లకు గాంధిజీ మళ్లీ జైత్ర యాత్రను ప్రారంభించినాడు.

మతసామరస్యం

(10 వ పేజీ తరువాయి)

సారాన్ని మథించి ఒక ప్రత్యేక రూపం ఇచ్చి పంజాబులో సిక్కుమత స్థాపకుడైన గురునానక్ మొదలయిన వారూ ఈ 15వ శతాబ్దంలోనే ఇంచుమించుగా జన్మించి భారతవర్షంలో నాలుగుమూలలా ధర్మసంస్థాపనకూ, మతసామరస్యానికి, భక్తిమార్గప్రబోధనకూ బాటలు వేశారు. మత, కుల, వర్గ భేదం పాటించకుండా కేవల ప్రజానీకం యొక్క మెధ్యాన్ని తొలగించి వారికి భక్తిరసాయనాన్ని అందిచ్చి ఒక క్రొత్తదైన నడిపి ఆ సందిగ్ధకాలంలో దేశానికి కర్ణధారులైనట్లు తోస్తుంది.

రెండువందల సంవత్సరాల తరబడి ఈ భారతభూమిలో సార్వభౌమత్వం వహించిన పాదుషాలు, కుతుబ్ మినార్-తాజ్ మహల్ వంటి అపూర్వ మందిరాలలో ముస్లిం కళా లక్ష్మిని తాండవింప జేసి దేవాలయాలలో భారతీయ శిల్పులు ప్రదర్శించిన నిరుపమాన శిల్పశోభకు తీసిపోని ఒక ప్రత్యేక సంప్రదాయం భారత భూమిలో శాశ్వతపరచి ధన్యులైనారు. నిష్కళంక కళారాధకుడు నటరాజ మూర్తిని దర్శించినప్పుడు, తాజ్ మహల్ దర్శించినప్పుడు తన్ను తన్మయుని జేయుగల ఒకే కళామూర్తి ఆయనకు సాక్షాత్కరించి ఒకేవిధమైన ఆనందానుభూతిని పొందగలడు. కబీర్ ఉపాసించిన, సంకీర్తనం చేసిన ఆ విశ్వప్రణయమూర్తికి 'రామ్, రహీమ్' అనే నామధేయం ఏకార్థప్రతిపాదకము లెలా అయినాయో, ఈ కళారాధకునకుకూడ ప్రపంచంలో ఎక్కడ ఏ కళాఖండాన్ని దర్శించినా అందులో అంతర్లీనమై ప్రతిబింబించే ఏకకళామూర్తినే దర్శించ గలుగుతాడు. మహమ్మదీయుల గానము, శిల్పము, కవితారీతి, సంస్కృతి, నాగరికత ఎన్నో ఈ శతాబ్దాలుగా వచ్చిన బాంధవ్యంతో హిందూ జీవనంలో మిళితమైపోయినాయి. ఎన్నో పురుషభాషాపదాలను నేటికి మన స్వంతంగా చేసికొని నిత్యకృత్యంలో వాడుకుంటున్నాము. హిందువులు అధికసంఖ్యాకులై మహమ్మదీయపాలనకు లోబడి, మహమ్మదీయులు అత్యధికసంఖ్యాకులుగాను, ప్రభువు హిందువుడై ఉన్న సంస్థానాలు నేటికీ ఉన్నాయిగదా. హిందు ప్రభువుల ధర్మకర్తృత్వంలో మసీదులు, మహమ్మదీయుల ధర్మకర్తృత్వంలో దేవాలయాలూ నేటికీ ఉంటున్నాయే. ప్రజలు పరస్పరం వావివరుసలతో పిలుచుకుంటారే. ఇన్ని విధాల ఐక్యమైపోయిన ఈ రెండు వాహినులు మళ్ళా ఈ విధంగా పరస్పరం ద్వేషించుకొని మతోన్మత్తులై పీకలు తెగగోసుకునే దౌర్భాగ్యం పట్టడానికి ఏదో కీలకం ఉండి ఉండాలి. స్వర్గీయులైన అన్సారీ, అజ్మల్ ఖానులవంటి వారు సంకల్పించిన ఈ ఐక్యత ఈ విధంగా దివాస్వప్నమైపోయిందే! దేశవిభజన తగదన్న కాంగ్రెసు పెద్దలు తుదకు మహాత్ముడు సహితమూ ఈ దారుణహింసాకాండకు తలయొగ్గి రెండుజాతుల సిద్ధాంతం అంగీకరించవలసినవారైనారే. దీనికంతకూ ఈరెండువందల సంవత్సరాలనుండి విషబీజాలు నాటిన బ్రిటిష్ రాజ్యతంత్రం, విభజించి పరిపాలించే కుటిలరాజనీతి యొక్క ఫలితాలని వేరుగా చెప్పాలా? దీర్ఘకాలప్రణాళికలలో కాలానుగుణ్యంగా ఉద్యోగాలకేర, బిరుదావళులకేర, ప్రత్యేక సౌకర్యాలఎర ఒక సంఘాన్ని చీల దీసి లేనిపోని మృగతృష్ణలను కల్పించి చేసిన బ్రిటిషు ఇంద్రజాలికుని కృత్రిమసృష్టియే నేటి విభక్తభారతము. ఏ మనుకొని ప్రయోజనం! ఇండియన్ యూనియన్ లోని మహమ్మదీయుడు, పాకిస్తాన్ లోని హిందువుడు పంచమాగదళ శ్రేణికి జెందినవాడుగా నేడు పరిగణింపబడుతున్నాడు. స్వరాజ్యసాధనలో కన్నా కూడ అధికతరశ్రద్ధతోనూ, పూనికతోనూ అనేకక్లిష్టసంఘటనల ముందు మృత్యుముఖంలో చొరబడి ఉభయమత సామరస్యం కొరకు పాటుబడిన మహాత్ముని కృషినికూడా అర్థం చేసుకోలేని దుర్గతిలో దేశం ఉన్నదంటే అంతకన్నా మనకు నైతికపతన మేముంది! ఈ భ్రాతృహత్యలకూ, మతోన్మాదానికి ఫలితంగా నేటి కాటకం మనలను పగ సాధిస్తోందేమో.

యుద్ధావసరలకై రహస్యాయుధాగారాలలో దాచిన మారణాస్త్రాలు, బ్రిటిష్ సైనికాధికారుల దాపరికంలో ఉంటూన్న వని వాటి గుట్టు వారికే తెలియునని, ఆవిధంగా దాచిన సరకులను వారు భారతదేశం విడిచి పోతూ పోతూ, ఏ స్వల్పమో డబ్బుకక్కురితికో లేక అంతఃకలహాగ్ని రగల్చడానికో ఈ మతోన్మాదులైన విద్రోహులకు కైవశంచేసి ఈ మారణహోమానికి కారకులైనట్లు కూడా బుజావు పరుస్తున్నారు. ఇందుకు ప్రక్కతాళంగా పాకిస్థాను ఫాసిష్టురాజనీతిని పట్టుగొమ్మగా స్వీకరించి పరిపాలించడం దోహదమయింది. అయినప్పటికీ ఈ సంఘటనల వెనుక నీడలా ఉండే బ్రిటిష్ కుటిలరాజనీతిని గుర్తిస్తే నేటి ఈపరస్పర ద్వేషానలం సమసిపోగలదు. నేటికైనా కొందరు ప్రముఖ లీగు నాయకులు రెండు రాజ్యాలసిద్ధాంతంలో గల అనర్థాలను గుర్తింపగలగడం ముదావహం. ఉత్తరభారతావనిలోగల అలజడికి గల కారణాలు, వాతావరణ, దక్షిణ భారతావనిలో లేదు, అయినా నైజాము సమస్యతో మనకూ కొంత అలజడి కలుగునేమో అని అనుమానించవలసి ఉంటుంది. అందుచేత ఒక్కసారి పూర్వచారిత్రక సంఘటనలను పఠించి భవిష్యత్తును అప్రమత్తతతో సాధించి భారతదేశంలో సత్వరశాంతి కలుగుగాకయని ఆశిస్తున్నాను.

మానససరోవర సంచార విశేషాలు

శ్రీ ప్రణవానంద మహర్షి

కైలాస మానస తీరవాసి శ్రీ స్వామి ప్రణవానంద మహర్షి 24వ పర్యాయము కైలాస పర్వతము, మానస సరోవరము, పశ్చిమ టిబెట్టు సంచారము పూర్తి చేసి యీ క్రింది విశేషములను తెలియపరచిరి.

పశ్చిమ టిబెట్టు విశేషములు

సంచారులకు, యోగులకు, మునులకు నివాస భూమియగు టిబెట్టు దేశము కూడా స్వతంత్ర రాజ్యమగు నేపాళముతోబాటు, అల్మోరా, ఘర్వాల్ జిల్లాలకు సరిహద్దుగ నున్నది. హిందూదేశమునకు చిట్టచివర స్థానము అయిన గర్బ్యాంగుకు (సముద్రమట్టమునకు 13,000' అ.) చుట్టుగా నడచినచో ఒక రోజులో టిబెట్టు సరిహద్దు వచ్చును. పశ్చిమ టిబెట్టులో నున్న తక్లాకోట, అల్మోరా జిల్లాలోని అన్ని గ్రామముల కంటె దగ్గరనున్న సంతపూరు తక్కువ కొండ కనుమల కంటె సుగమము. సమీపములైన 'లిపు' సనుస కనుమ గుండా (స. మ. కు. 16,000' అ.) యిప్పటికి చేరవచ్చును. అనాదికాలము నుండియు ఆల్మోరా జిల్లాలోని భోటియాలే టిబెట్టుతో వంశానుగతమైన వ్యాపారము సాగించుచున్నారు. వీరు ధృఢగాత్రులు. వీరికి యితరుల పోటీ చాల తక్కువ. ఇప్పటికినీ అక్కడి వ్యాపారము మార్పిడి పద్ధతిలోనే నడచుచున్నది. అతి పుణ్యాత్ములైన యాత్రికులు పవిత్రమగు కైలాస మానస సరోవరములకు కాలినడకతో యెంతకూ తరగని దీర్ఘయాత్రలు కావించుచూ వచ్చిరి. చాలమంది నూతన ప్రదేశ పరిశోధకులును, ప్రయాణీకులును, ఎవరికినీ చొరరాని యీ సన్యాసుల భూమిని గూర్చి, చాలగా వ్రాసిరి. అందు కాలేజీలాంతర్యమున్నగు వారు కొందరి సన్యాసుల దౌర్జన్యములను గూర్చియూ, అనాగరికమైన అమానుష కృత్యముల గూర్చియూ, భయంకరములైన కథలను తమ మనస్సులలో వూహించుకొని వర్ణించిరి. చిట్టచివరకు టిబెట్టులో బుట్టి, వుత్తర హిందూదేశములో ప్రవహించు కొన్ని మహానదుల జన్మస్థానములను కనిబెట్టి సరిగా నిర్దేశింప గలిగినవారు పవిత్ర కైలాస మానససరోవర తీరవాసులైన శ్రీ ప్రణవానందస్వాములవారు. వీరికి దుర్గమములైన క్రొత్త ప్రదేశములను కనిపెట్టుటయందు మంచి ఉత్సాహము కలదు. వీరు చెప్పినవే కాక యింతవరకెవ్వరికినీ తెలియని ముఖ్యమైన భౌగోళిక విషయములను కూడా కనుగొనుటచే వారికి 'రాయల్ జాగ్రాఫికల్' సొసైటీలో సభ్యత్వ మియ్యబడినది.

మానససరోవరములో త్రివర్ణ పతాకము

1946లో యీ స్వాములవారు 24వ పర్యాయము టిబెట్టును చుట్టి యీ మధ్యనే తిరిగి వచ్చిరి. జన్మభూమి సంపాదకులును, సేటు పిక్చర్సు లిమిటెడ్ కంపెనీ డైరక్టరును అయిన శ్రీ అమృతలాలు డి. సేటుగారు తమంతటతాము ఔదార్యముతో నిచ్చిన రు. 800/-ల విరాళము వల్ల యీ ప్రయాణం సాఫల్యమయ్యెను. ఈ సేటుగారు విద్యాప్రియులును ప్రాచీన సంస్కృతియందు అభిమానము కలవారే గాక యెక్కువగా ప్రయాణములొనర్చి ప్రసిద్ధికెక్కిన పత్రికా రచయిత. ఈ ఉదారవిరాళముతో శ్రీ స్వాములవారు అమెరికా నాకాదళమునకు చెందిన 12 తిత్తుల రబ్బరు నావ నొకదానిని 4 విడితిత్తులతో కూడా సంపాదించిరి. ఇందు ముగ్గురు కూర్చుండవచ్చును. దానికి వారు 'జన్మభూమి' అని అనురూపమైన పేరు పెట్టిరి. ఆషాఢ పూర్ణిమనాడు (14-7-1946) స్వాములవారా నావను దివ్యమానస సరస్సుపై చాలమంది భోటియావర్తకులును, టిబెట్టు వాసులును చూచుచుండగా తేలించిరి. అమృతలాలుగారు ఇందు నిమిత్తమై ప్రత్యేకముగా నిచ్చిన త్రివర్ణ పతాకము ఆ నావపై గర్వముతో వెలుగుచుండెను. యీ సరస్సుయొక్క (సా. మ. కు. 15,000' అ.) చుట్టుకొలత 54 మైళ్ళు, అడ్డుకొలత 16 మైళ్ళు. ఇంతకు ముందు ఒక పర్యాయము మాత్రము 1907, 1908 సంవత్సరాలలో డాక్టరు స్వెనహెడెను అను వారును దానిపై ఒక కేన్వాసు నావను నడిపి సరస్సులోతును పరిశోధించెను.

కైలాసమునకు యీశాన్యమున సముద్రమట్టమునకు 18,400' అ. యెత్తున 'గౌరీకుండ్' అను యింకొక సరస్సు కలదు. దీని చుట్టుకొలత సుమారు 1½ మైళ్ళు. అడ్డుకొలత 88 గ. ఈ సరస్సు సంవత్సరమంతయూ గడ్డకట్టి యుండును. కైలాసప్రదక్షిణము చేయు యాత్రికులు అచట ఒక మూరెడు మందముగల గడ్డకట్టిన చిక్కనిమంచును నాలుగంగుళముల లోతుగా బద్దలుకొట్టుదురు. 1946 ఆగస్టు 28 తేదీని శ్రీ స్వాములవారు తమ నావతో యీ సరస్సునొద్దకు వెళ్ళి పడవ యాన చిత్రములకు అర్హమైనదగు ఒక దృశ్యము కల్పించెను. యింతవరకెవ్వరూ ఆ సరస్సు కరగియుండుట యెన్నడునూ చూచియుండలేదు. చుట్టు కొండలపైని సరస్సు యానాడు తన హృదయముపై త్రివర్ణపతాక వెలుగుటకు ఆహ్వానించుచున్నదో యన పూర్తిగా కరగియుండెను. ఒక టిబెట్టు వానిని ఒక భోటియాను వెంటబెట్టుకుని స్వాములవారు యీ రబ్బరు నావ నడిపి 51 ప్రదేశములలో లోతు కనుగొనిరి. ఆయన కనుగొనినవాటిలో ఎక్కువ లోతుగల ప్రదేశము 84" అడుగులు. ఇంతవరకూ ప్రపంచమందలి పరిశోధకులచే లోతు కనుగొనబడిన సరస్సులన్నిటిలో ఇదియే అత్యున్నతమైనది. ఈ సరస్సు సమీపమున ఒక పక్షిగాని, ఒక జంతువుగాని లేదు.

కందర నగరము

కైలాస శిఖరమునకు 5 రోజుల ప్రయాణమునందున్న 'సిబ్చాచు' (Sib-cha-chu) 'తిసేవర్చు' (Ti sever chhu) అను నదులు కలియుచోట 13,000" అడుగుల యెత్తున నిర్మానుష్యముగానున్న ఒక కందర నగరము కలదు. పూర్వకాలమున యిందు వేడినీటి ధారలకు ప్రసిద్ధికెక్కిన 'ఖ్యుంగులుంగు' (Khyunglung) మఠమునకు లోబడి వందల కొలది గుహలు సన్యాసులకు గృహములుగా ఆశ్రయమై చాల వృద్ధదశలో నుండెను. స్వాములవారు యీ గుహానగరమును 27-7-1946లో దర్శించిరి. ఈ గుహలు గట్టితనముతో యించుమించు నిలువుగా ఒకదానికి ఒకటి 70" ఎడముగలయెత్తున దొలచబడినవి. పై అంతస్తులో ఒక గుహలో యెర్రటోపీల సన్యాసులకు చెందిన ఒక పెద్ద మఠము ఒకానొకప్పుడుండెను. ఆ ప్రదేశమంతయూ యిప్పుడు పాడుపడి నిర్మానుష్యమైయున్నది. కాని ఆ గుహలన్నిటిని బాగుచేసి సరియైన పరిస్థితిలో పెట్టినచో వానిలో కొన్ని చక్కని ఫ్రెస్కో చిత్రములు లభించవచ్చును. స్వాములవారు అట్టి కొండలు యెక్కుటకు అవసరమైన సాధనసంపత్తితో వెళ్ళియుండక పోవుటచేత ఆ అంతస్తులమధ్య అపాయకరముగ నిలువు కొండప్రదేశములపై కెక్కి దిగుటకు పూనుకొనలేకపోయిరి. కాని పై సంవత్సరమున తిరిగి అచటకు వెళ్ళి ఆ ఫ్రెస్కో చిత్రముల ఛాయాచిత్రములను తీసుకొనిరావలెనని వారి సంకల్పము.

పురాతన జంతుశరీర శేషాన్వేషణములు

భూమియొక్క ప్రథమదశలో టిబెట్టు పీఠభూమి అంతయూ ఒక పెద్ద సరస్సు. స్వాములవారు 'త్సోకపాలి' (Tsokapali—ఒక సరస్సు)నుండియు మాంఘాంగ్ పర్వతశ్రేణి నుండియు కొన్ని చక్కని పురాతన జలజంతు శరీరశేషముల నమూనాలను తీసుకొనివచ్చిరి. వారు కైలాసశిఖరముయొక్క దక్షిణపుకట్టు నుండి కొన్ని మట్టినమూనాలను కూడా తీసుకు వచ్చిరి. అందు 'కాంగ్లోమరేటు, గ్రెనైటు' (Conglomorate and Granite) అను పదార్థములున్నటుల ఇంతవరకు తెలుపబడుచున్నది.

టిబెట్టులోని ధర్మశాలలు

యాత్రికుల సౌకర్యమునకై త్వరలోనే టిబెట్టులో కొన్ని ధర్మశాలలు యేర్పడగలవు. చాల సంవత్సరములనుండి యీ స్వాములవారు విసుగు విరామము లేకుండా చేయుచున్న ప్రయత్న ఫలితమే యిది. టిబెట్టు అధికారులు టిబెట్టు కేవలమై యితర దేశీయులను యే విధమైన కట్టడములను కట్టుకొనుటకు ఒప్పుకొనరు. అందుచేతనే శతాబ్దముల నుండియూ వర్తకమునకై తమదేశము వదలి సంవత్సరములో చాలభాగము అక్కడనే నివసించు భోటియా వర్తకులుకూడా తక్లాకోట వద్ద భవనములు కట్టుకొనుటకు వీలుపడలేదు. బ్రిటిషువారు హిందూదేశమునకు మొదట వర్తకులుగా వచ్చి తమ ఫ్యాక్టరీలకు స్థలము లకుంకొని చివరకు హిందూదేశమునకు అంతటను ప్రభువులైన వుదాహరణము వీరు తరుచు చూపుచుందురు. అయినను స్వాములవారు మాత్రము 'థుగోతో' (Thugotho) సద్గురు ఆజ్ఞ నొదిన యీ వేటనే పూర్తి చేసిరి. మానససరస్సునకు దక్షిణతీరమున నున్న తుగోతో వద్దను, వాయువ్యదిశనున్న 'చీను' (cheen) వేడినీటి ధారల యొద్దను ఒక్కొక్క ధర్మశాలను కట్టుటకు యేర్పాటు చేసిరి. అల్మోరానకును, మానససరస్సునకును మధ్య త్రోవలో ఖేలా వద్ద ఒక చక్కని విశ్రాంతి గృహమును కట్టించుటయేర్పాట్లను కూడా చేసిరి. ఇవన్నియు పూర్తి అయిన పిమ్మట కైలాస యాత్రికులు యిప్పుడు సాధారణముగా పొందు ఇబ్బందులు చాలవరకు తగ్గిపోవును.

టిబెట్టు, దారిదోపిడీ గాండ్రకును, బందిపోటులకును పేరెక్కినది. పైకి అమాయకుడుగాను, మందకొడిగాను కనపడే యీ గొర్రెల వర్తకుడే నిరాయుధులై జట్టు విడిపోయిన వర్తకులు గాని, యాత్రికులుగాని దొరికినచో దోచుకొనుటకు వెనుదీయడు. అందుచేత భోటియా వర్తకులును, యాత్రికులును, వారికెప్పుడును భయపడుచుందురు. ప్రతిసాలునా వ్యాపారపు రద్దీ అణగిపోయే రోజులలో బందిపోట్లు తప్పక జరుగుచుండును.

అందు తగిన ఆయుధములు లేకుండా ఒంటరిగా తిరుగుచుండు భోటియా వర్తకులే యెక్కువగా నష్టపడుచుందురు. గతసాలున 60 కుటుంబములు కలిసి "ాక్చెంగు-తాక్పా" అను పేరుపడిన గుంపులు ముఖ్యముగా సన్యాసులను కూడా, "కాంపా" బందిపోటుగాండ్రను "పురాంగ్‌ఖోంగ్రా"లో (మానస సరస్సునకు తూర్పున 12 మైళ్ళలోనున్న చిన్నదైన ముఖ్యమైన సంతగ్రామము) ల బీభత్సము చేసి వర్తకులను కొల్లగొట్టిరి. అందు మొదటిగుంపు మిక్కిలి సాహసికమైనది. ఎవి తక్లాకోట నవ జొంగుపెన్స (Jongpens) యొక్క సైన్యమునూ ఉహించుముగా కొల్లగొట్టుకొనిపోవును. భోటియాలకు ఆయుధములు లేకపోయినను, ధైర్యసాహసములకు లోటు లేదు. వారిలో నొకడైన "తాకూరు రత్నసింగు ఆర్య" అను వానిపేరు టిబెట్టు దోపిడిగాండ్రకు సింహస్వప్నము. అతనికి వారు "ధంపా, ఆర్య" అని పేరు పెట్టిరి. అతనిపేరు వినగనే కాలికి బుద్ధి చెప్పుదురు. ఈ సాలున భోటియా వర్తకుల గొర్రెలమందను బందిపోటుగాండ్రు కొల్లగొట్టబడినప్పుడు రత్నసింగు నలుగురు సహచరులతో కొన్ని తుపాకులు తీసుకొని వారిని తీవ్రముగా వెన్నంటెను. కొండమీద కొండప్రక్కల లోయలలో యెక్కడకు వెళ్ళిన అక్కడ విడువక రత్నసింగు వెన్నాడగా చివరకు వారు దొంగిలించిన గొర్రెలను విడచి పారిపోయిరి. ఇంతకూ వింతయేమన రత్నసింగు వద్ద ఒక ప్రభుత్వపట్టిన తుపాకి తప్ప తగిన మందుగుండు కూడా లేదు. స్థానికాధికారులు భోటియా వర్తకులకు లైసెన్సులిచ్చుటలో చాల జాగ్రత్తగా నుందురు. కాని న్యాయమైన అవసరములను కాపాడుకొనుటకు వారికి చాల అవసరము. ప్రస్తుతమున్న ప్రజాప్రభుత్వము యీ విషయములందు తమ శ్రద్ధ వహించి అచట వర్తకులకు, యాత్రికులకు తగు సదుపాయములు చేయుదురుగాక అని ఆశించుచున్నాము.



మద్రాసు గవర్నరు సర్ ఆర్చిబాల్డ్ నైగారు ఢిల్లీనుండి మహాత్ముని పవిత్ర అస్థికలను బట్టుకొని గురువారం సాయంత్రం విమానంలో వచ్చారు. విమానాశ్రయంవద్ద అస్థికలపాత్రను ప్రధానికి అప్పగించిపెట్టుటప్పుడు తీసిన ఛాయాచిత్రం.

అవీ, యివీ, కబుర్లు:

పెంపుడు పిల్లులు

మానవుడికి హృదయదాహం ఎక్కువ. తన అనురాగాన్ని మనుష్యులమీదే చూపించుకోవటానికి అవకాశం ఎక్కువ కలగకపోతే, పిల్లులనో, కుక్కలనో, కోతులనో, పక్షులనో మరి వేటినో పెంచుకొని, హృదయదాహం తీర్చుకొంటాడు. ఈ అనురాగంకూడా, "నాది" అన్న స్వాధికార మనశ్శాంతి కల్గినచోటతప్ప కల్గటం కష్టం. బుద్ధితెలిసి స్వయంవ్యక్తులయ్యే జీవాలమీదకన్నా, వ్యక్తిత్వంకోసం పాకులాడకుండా, తనమీద ఆధారపడి తన ఆశ్రయంలో ఉండే జీవాలమీదే, ఈ అనురాగం వృద్ధి అయే వీలు ఎక్కువవుంది. అదీకాకుండా మానవ స్వాభావికమైన దుర్గుణాలను సుగుణాలను క్షమించి, అనురాగం చూపించటంకన్నా జంతువులను మచ్చిక చేసికొని, ఆ పెంపుడు జంతువులోని ప్రాథమిక స్వభావానికి ముగ్ధుడౌతూ అనురాగం చూపించటం తేలిక.

ఇల్లా పెంచటానికి అనువైనవి, ప్రపంచమంతటా ఎక్కువగా పిల్లులూ, కుక్కలే కనబడుతాయి. అందులోనూ, పరిశుభ్రతకు పేరుగాంచిన జంతువు పిల్లి కాబట్టి, పాశ్చాత్య దేశాల్లో, భాగ్యశాలులంతా, పిల్లులను పెంచటమే ఎక్కువ అలవాటు చేసుకొన్నారు.

మనవాళ్లల్లో పెంపుడు జంతువుల గుణగణాలను, స్వభావాలను పరిశీలనగా వ్రాసినవాళ్లు చాలా తక్కువ. ఏదో ఉపమానాలంకారంలోనో, ఏదో సామెతలోనో, ఒక్కమాటలో తేల్చేయటమే ఎక్కువ కనబడుతుంది. ఎవరన్నా రచించిన గ్రంథాలెక్కడైనా ఉన్నా అవి ఎక్కువ ప్రచారంలో లేవు.

పాశ్చాత్యుల్లో జంతువుల వ్యక్తిత్వాలను స్వభావాలను (అడివిజంతువులదగ్గరనుంచీ పెంపుడుజంతువులదాకా) ఎక్కువ పరిశీలించి వ్రాసినవారు చాలామంది ఉన్నారు. వైట్ అనే ఆయన (Natural History of Selborne) సెల్బార్న్ ప్రకృతిచరిత్ర అనే పుస్తకం, ఇల్లాంటి, సామాన్యంగా పెంపకంలో ఉండే చిన్నచిన్న జంతువుల స్వభావచరిత్రతో, సత్యసమ్మతంగా, బహుజనాకర్షణీయమయి, ప్రసిద్ధ గ్రంథంగా నిలిచింది.

ఇల్లాగే వాకిల్ జోసెఫ్ అనే ఆయన తన పెంపుడు పిల్లుల గురించి చరిత్ర వ్రాశాడు. ఆ పిల్లుల కొక్కొక్కదానికి ఒకొక్క ప్రత్యేకత, సరాజగౌరవము, ఠీవి, ధీమా, ఇత్యాది గుణాలన్నీ ఉన్నట్టు ఆయన వర్ణిస్తాడు.

ఆయన పెంపుడు పిల్లుల్లో, మిన్నీ అనే ఒక పిల్లి ఉంది. మిన్నీకి మెడల మువ్వలబెల్టు కట్టారు. మిన్నీ చాలా హోదాతో ఆ బెల్టు వేసి ఝాడించుకొంటూ తిరిగేది! ఆ మువ్వల మోతకూడా తనహోదా పెంచుకొనేందుకే ఉపయోగించేది. తనకి భోజనానికి వేళ అయి, భోజనాల గదితలుపు వేసిఉంటే తలుపవతల నిలబడి, మెడలో మువ్వలు మోగించేది. కాస్త తలుపు తీయటం ఆలస్యమయితే, మరే, అధికారంతో మళ్ళీ మువ్వలు మోగించేది. అల్లా ఆలస్యం చేసి తలుపు తీసినవాళ్ళ వంక నిరసనగా చూస్తూ మహారాణీలాగా పోయి తన స్థానంలో కూర్చొని విందారగించేది.

ఒకసారి మిన్నీ ఒక చిన్న వస్తువు తెచ్చి తన పిల్లలకు చెలగాటం నేర్పుతోంది. జోసఫ్ అటు చూశాడు. ఆ వస్తువు కుళ్లిన మాంసం ముక్క. ఆత్రంతో అతనా మాంసం ముక్క తీసి కిటికీలోంచి విసిరి అవతలకు పారేశాడు.

మిన్నీ అతనివంక కోపంతో చూసింది.

"అంతమాత్రం నాకు తెలియదనుకున్నావా? ఎరక్క అనుకుని తెచ్చాననుకున్నావా? పిల్లలకు ఆట నేర్పుతున్నానని గ్రహించలేవూ!" అన్నంత తిరస్కారం ఆ చూపులో ఇమిడివుంది. ఒక్క ఉరుకున బైటికి పోయింది. ఎల్లా వెతికి తెచ్చిందో, ఎక్కడో దూరాన పొదల మధ్య పడ్డ ఆ మాంసం ముక్కను మళ్ళీ తెచ్చి యజమాని వంక లక్ష్యమన్నా లేకుండా, మళ్ళీ మామూలుగా పిల్లలకు ఆట నేర్పటం మొదలు పెట్టింది. జోసెఫ్ సిగ్గుపడి అక్కడినుంచి తప్పుకున్నాడు.

జోసెఫ్ పిల్లుల వ్యక్తిత్వాలను గుణగణాలను బాగా పరిశీలనగా అర్థం చేసుకొన్నాడు. "పాలు బాడితే పిల్లులు ఆట మొదలు పెట్టేవి. యీల వేస్తే ఒకదానితో ఒకటి పోట్లాడుకొనేవి. రాత్రి పొద్దుపోయాక పోయి "పడుకోం"డని చెప్పితే తమ గూటిలో చేరి, చెదరింపుగా చూచినట్లు ఒకచూపు చూచి పడుకొనేవి".

ఇంకో పిల్లి, చర్చికి పదమని పీక్కు తినేదట. మ్యావు మ్యావు మని చుట్టూ చూస్తూ అరుచుకొంటూ, అతని ముందర బయలుదేరి చర్చికి దారి తీసి, పక్కను వచ్చేవాళ్ళకు ఆనందం కల్పిస్తూ బయలుదేరేది. ఒకసారి జోసెఫ్ పిల్లిని వదిలి చర్చికి పోయాడు. చర్చిలో ప్రార్థన సగం జరుగుతూండగా, పిల్లి వచ్చి బైట తలుపులదగ్గర నానా హంగామా చేసి, గోడమీదినుంచి కిటికీలలోనుంచి దూకి వచ్చి, చర్చిలో ముందువరుస కుర్చీలో ఉలుక్కుండా, పలుక్కుండా కూర్చుందట.

ఇంకోసారి, ఒక పిల్లి టర్కీ కోడిపిల్లను, తన బిడ్డలాగా పెంచుకొని సాకిందట. అప్పటి రోజుల్లో, ఆ పిల్లికి, ఒక కూన చచ్చిపోయింది. ఆ యింట్లోనే కొత్తగా తెచ్చిన టర్కీ కోడిపిల్ల కనిపించింది. పిల్లి ముందర టర్కీ కోడిపిల్ల చుట్టూ తిరిగి దాన్ని వాసన చూట్టం మొదలెట్టి, యజమాని కనబడేటప్పటికి ఏమీ ఎరగనట్టు అటు చూసినా చూడకుండా తప్పుకొంది. ఆ రాత్రి మళ్ళీ యజమాని చూసేటప్పటికి, ఆ కోడిపిల్ల, పిల్లి ఒళ్ళో తల పెట్టుకొని, వెచ్చగా తల్లి నానుకొన్న పిల్లలాగా పడుకొని నిద్ర పోతోంది. అప్పటినుంచీ, ఆ పిల్లే కోడిపిల్లకు మారుటితల్లై పెంచుకవచ్చింది.

కొన్నికొన్ని లండన్ పిల్లుల పేర్లు, సినిమా తారల పేర్లకన్నా ప్రసిద్ధంగా లండన్ వాస్తవ్యులందరికీ యుద్ధపూర్వకాలం దాకా తెలిసే ఉండేది. బ్రిటిష్ మ్యూజియంలో మైక్ అనే పిల్లి తిరుగుతూండేది. అచ్చు ఒక యోగిలాగ ఉండేది అని అంతా అనుకునేవారట. హోమ్ ఆఫీసులో, ప్రభుత్వ కార్యదర్శి రహస్య సమావేశాలలో కూడా పాల్గొన్న ఎమిలీ అనే పిల్లి ఉండేదట. ఇక డౌనింగ్ స్ట్రీటులో బాబ్ అనే పిల్లి, చర్చిల్‌కే చాలా అనురాగపాత్రురాలుగా ఉండేదట. టెంపిల్ అనేచోట ఓల్డుటామ్ అనే పిల్లి ఉండేది. రోజూ ఆ పిల్లికి రాత్రి పదిగంటలకు, ఒక స్నేహితుడు ఒకగిన్నెలో పాలుపోసి ఉంచేవాడట. టామ్ అక్కడికి వెళ్ళటానికి ఫ్లీటు స్ట్రీటు అనే మహారద్దీ ఉన్న రస్తా దాటిపోవలసి వచ్చేది. రాత్రి పదిగంటలకు టామ్ కనబడేటప్పటికి, ఫ్లీటుస్ట్రీటులో ఉన్న పోలీసు నవ్వుతూ, రహదారి అంతా ఆపేసి, టామ్ రోడ్డు దాటాక మళ్ళీ బళ్ళను పోనిచ్చేవాడు. టామ్‌కూడా పోలీసు, రహదారి అంతా ఆపేదాకా, పేవ్‌మెంటు మీదనుంచి రోడ్డు మీదికి దిగేదే కాదట.

టామ్‌కు ముందు కాళ్లకు ఆరేసి గోళ్ళుండేవి. వచ్చినవాళ్ళందరికీ సగర్వంగా, తన నఖసౌభాగ్యము కాళ్ళుముందుకు చాచి చూపించేది.

అటుదేశాల సాహిత్యంలో కూడా పిల్లులకు స్థానమెక్కువే. మహమ్మద్ ప్రవక్త, మూయెజ్జ అనే తన పెంపుడు పిల్లిని అతి ఆప్యాయంగా చూసుకొనేవాడు.

ఆయన నమాజుకు బయలుదేరాల్సివస్తే, తన అంగవస్త్రంమీద శాంతంగా నిద్ర పోతున్న పిల్లికి నిద్రాభంగం చేయటంకంటే, ఆ వస్త్రం అంతవరకు కత్తిరించేసుకునే మహమ్మద్ నమాజుకు బయలుదేరేవాడట. కొరాన్ గ్రంథకర్తలో ఉన్న అంతటి, శాంతము, సహిష్ణుత కూడా, ఆ పిల్లే మహమ్మద్ గారికి నేర్పిందా అనిపిస్తుందంటారు.



గాంధీజీ, సి. యఫ్. ఆండ్రూస్‌తో ...

డాక్టరు జాన్సను పెంపుడు పిల్లి హాడ్జ్, బాస్వెల్ పుణ్యమా అని యజమాని అంతటి పేరూ తెచ్చుకొంది. సర్ వాల్టరుస్కాటుకు కూడా పిల్లులంటే మమకారం ఎక్కువ. "మనం అనుకొనేకంటే, చాలా ఎక్కువగానే పిల్లులు మనస్సులలో కనుకుంటాయి" అని స్కాట్ అన్నాడు. హెన్రీ జేమ్స్, రచన సాగిస్తున్నంతసేపూ, భుజంమీద పెంపుడు పిల్లి ఉండవలసిందే. ప్రసిద్ధ రచయిత థియోఫిల్ గాటియర్ మేడమ్ థియోఫిలి అనే పిల్లి ఉండేది. ఈ పిల్లినిగురించి గాటియర్ పేజీలు, పేజీలు, ఉత్సాహంతో పొంగిపోతూ వ్రాశాడు. ఈ పిల్లినిగూర్చి ఒక చిన్న కథకూడా చెప్పారు.

ఒకనాడు ఒక స్నేహితుడు, గాటియర్ దగ్గిర ఒక చిలుకను తీసుకొచ్చి, తనింట్లో ఉండిన్నాని నాలుగు రోజుల పాటు చిలుకను కాస్త చూడాల్సిందనీ, అప్పచెప్పి పోయాడు. చిలుక తనను కట్టేసిన కొత్తపెద్దకాముక్కుతో పాకిపోయి, భయంతో థియోఫిలి (పిల్లి) వంక చూస్తోంది. అంతకుముందు థియోఫిలీ చిలకనే చూడలేదు. కాసేపు, జ్ఞాన సమాధిలో మునిగి పోయినట్టు చిలక కేసి చూసి, హఠాత్తుగా చిలక దగ్గిరకు గెంతు గెంతింది. చిలక కంగు పోగొట్టుకునేందుకు నోరు తెరచక, గబుక్కున నోరు తెరచి, "ఏం భాయీ, భోంచేశావా!" అని అరచింది. మనిషి మాటలు పక్షి పలుకుతూంటే కంగారుపడి, థియోఫిలి వెనక్కి ఉరికింది. చిలక గబగబా తనకు వచ్చిన మరి నాలుగుమాటలు, మాట్లాడింది. "ఇది పక్షి కాదు, ఎవరో పెద్దమనిషి" అనుకొన్నట్టుగా థియోఫిలి ఆ భ్యాసపడిపోయి, మంచంకింద దూరి, ఎవరుపిల్చినా పైకి రాకుండా, సిగ్గుతో మొగం దాచేసుకొంది.

సినిమాల్లోకూడా పిల్లులను భావప్రకటనకు పాశ్చాత్యదర్శకులు చక్కగా ఉపయోగించారు. "యూ కాన్ట్ టేక్ ఇట్ విత్ యూ" "ఏదీ వెంట గట్టుకు పోవు" అనే చిత్రంలో, ఫ్రాంకుకాప్రా, ఒక టైపిస్టుగర్ల్ పెంపుడుపిల్లిని చూపిస్తాడు. యువతి టైపుచేస్తూన్న కాగితంగాలికి లేచిపోకుండా, పిల్లిని కాగితంమీదకు దీసి, టైపు చేస్తూ ఉంటుంది. పిల్లి మాత్రం, కనులున్నా, ఏమీ, చలనం లేకుండా, తనఒళ్ళు శుభ్రంగా నాకుకుంటూ కూర్చుంటుంది. కాగితం పూర్తి అవగానే యువతి పేపరు లాగి, కాగితం మార్చి పిల్లిని మళ్ళీ అల్లాగే కుదేస్తుంది. ఆ పిల్లి మాత్రం, కాగితాల మీద కూర్చోటమే తన ఉద్యోగమైనట్టు, మహారాణిగా కూర్చుంటుంది.



గ్రంథ పరిచయము

"ఏకదేశం", "న్యాయం"

రచయిత: శ్రీ కొండముది గోపాలరాయశర్మ. ప్రాప్తిస్థానం: శ్రీ తాళ్లూరి సుబ్బారావు, ఏలూరు. వెల. ఒక్కొక్కటి రూ. 1-0-0

ఇవి మూడంకాల నాటకాలు. గ్రంథకర్త అభ్యుదయరచయితలలో ఒకడు. రంగస్థలంమీద కూడ అనుభవం ఉన్న యువకుడు. అభ్యుదయ రచయితలు కళారాధనే కళకు పరమావధి అనే సూత్రాన్ని ఒప్పుకోరు. తన్మయానికి, విలాసానికి ఉద్దేశించిన కళ వారి దృష్టిలో కళగాదు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించిన రచనలే ఈ రెండు నాటకాలు.

"ఏకదేశం" సాంఘికచారిత్రకనాటక మని గ్రంథకర్త వర్ణించాడు. దేశములోని హిందూ ముస్లిం సమస్య దీనిలో ప్రధానవస్తువు. ఈవర్గాల మధ్య స్వతస్సిద్ధంగా విభేదాలు లేవనీ, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు స్వలాభంకోసమని మనస్పర్ధలు కల్పించి, ప్రోత్సహించి, విడిపోవటానికి దారి తీశారని, ఉత్తరోత్తరా ఉభయులూ తప్పక ఏకం కాగలరనీ రచయిత నిరూపించటానికి ప్రయత్నించాడు. ఒక అన్నదమ్ముల సమిష్టికుటుంబానికి చెందిన వారు ఈనాటకంలోని పాత్రలు. అందరూ ఎంతో అన్యోన్యంగా ఉంటారు. ఇంతలో చక్రవర్తి అనే పాశ్చాత్యవ్యక్తి ప్రవేశిస్తాడు. ఒకరిమీద ఒకరికి రెచ్చగొడతాడు. అన్నదమ్ములే పరమశత్రువులవుతారు. నెత్తురు కళ్లజూస్తారు. ఒకడు హతమవుతాడు. సంసారం విచ్ఛిన్నమవుతుంది. ఈ విచ్ఛేదం ఎవరికీ లాభదాయకం కాదని తెలుసుకుంటారు. అప్పుడు పాశ్చాత్యవ్యక్తి ఈదేశం విడిచి పోవలసిన పరిస్థితులు ఏర్పడుతవి. దీనివల్ల కుటుంబంలో సామరస్యం తిరిగి సిద్ధిస్తుంది. దేశంలోని అన్ని పక్షాలూ నాటకంలో పాత్రలుగా వ్యవహరిస్తాయి. కాంగ్రెసు, హిందూమహాసభ, ముస్లింలీగ్, నరేంద్రమండలి మొదలైన వారందరూ దీనిలో ప్రత్యక్షమవుతారు. ఈవిషయంలో కొత్తవిధంగా నాటకరచన చేశానని గ్రంథకర్త అభిప్రాయం. కాని ఇలాంటివి ఇంతకు పూర్వం లేకపోలేదు. దామరాజు పుండరీకాక్షుడుగారి నాటకాలు ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చును.

"న్యాయం" కొంతవరకు హాస్యప్రధానమైన సాంఘికనాటకం. అటు ధనికులు, ఇటు దరిద్రులూ గాక త్రిశంకుస్వర్గంలో ఉండే మధ్యతరగతివాళ్ల మనశ్చాంచల్యాలను వ్యక్తపరచటం ఈనాటకంలోని ముఖ్యోద్దేశం. రామారావు ఈ వర్గానికి చెందిన గృహస్థు. అతడికి రోగిష్టిమారి భార్య, మాటకారి బావమరది ఉంటారు. ఒక ధనికుడిదగ్గర ఉద్యోగానికి చేరుతాడు. ఆ ధనికుడికి సరోజ అనే పూలమతాబావంటి చెల్లెలు ఉంటుంది. స్వలాభంకోసం రామారావు ఆమె స్నేహాన్ని కోరితే ఆమె ప్రేమనూ సంపాదించటానికి ప్రయత్నం చేసినా భాగ్యసంగతి పట్టించుకోడు. ఆ సరోజ ఎవరో ధనికుణ్ణి తిరస్కరించి ఒక ప్రజాకవిచేత తిరస్కరింపబడి రామారావు పాలిట పడుతుంది. వీరిద్దరూ కలిసి రోగిష్టి భార్యను తమ వివాహానికి అనుమతి ఇవ్వమని కోరుతారు. అక్కడ కొంత హంగామా జరిగిన తరువాత అందరిలోనూ పరివర్తన ఇట్టే వచ్చేస్తుంది. టూకీగా ఇదీకథ. సంభాషణలలో సహజత్వం తక్కువ. హాస్యంలో ఉత్కృష్టత కనిపించదు. పైగా మూడంకాలవరకు లాగదగిన కథ గాదు. ఏకాంకికగా వ్రాసి ఉంటే ఎంతో ఒప్పి ఉండేది.

ఈ రెండు నాటకాలలోనూ ఒక్కవిషయం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. వీటిలో ఏ పాత్రా సజీవంగా తయారు కాలేదు. పుస్తకంమూయగానే ఒక్కరూ జ్ఞాపకం ఉండరు. రచయిత పాత్రపోషణకంటె పాత్రలు చెప్పవలసిన విషయాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినట్లు తోస్తుంది. దీని ఫలితమే పైన చెప్పిన లోపం. ఈ మార్గాన్ని అనుసరించటాన గొప్ప రచయిత అయిన బెర్నార్డుషా పాత్రలకు కూడ ఇదే సంభవించింది. కాని పైన జీవం పోయగల నటులు అభినయించిన పక్షంలోమాత్రం ఈ రెండు నాటకాలూ రంగస్థలం మీద రాణించగలవని చెప్పవచ్చును.

* * *

"సంతానము"

రచన: శ్రీ బాలకృష్ణశాస్త్రి. ప్రజాసాహిత్య పరిషత్, తెనాలి. వెల రూ. 0-8-0

నూతన విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన గ్రంథాలు తెలుగులో అరుదుగా ఉన్నందువల్ల ఈ పుస్తకం వ్రాసినట్లు పీఠికను బట్టి తెలుస్తుంది. కాని దీనిలోని వ్యాసాలు ఉండవలసినంత క్రమంగా గాని, విపులంగాగాని లేవని గ్రంథకర్తే ఒప్పుకొన్నాడు. జనబాహుళ్యానికి సంతానాన్ని గురించి ఈ పుస్తకంద్వారా తెలుసుకోగలిగినది చాలస్వల్పం. ప్రపంచంఘటక మొదలుకొని మానవుడి మరణం వరకు ఈ యాభై పేజీలలో ఇమడ్చడానికి రచయిత ప్రయత్నించాడు. ఏ విధంగా పిండోత్పత్తి అవుతుందీ, ఏ రోజులలో సంతాననిరోధం జరిగేదీ, ఆడ మగ భేదాలు ఎందువల్ల వచ్చేదీ, పితృలక్షణాలు శిశువులకు ఏవిధంగా సంక్రమించేదీ మొదలైన విషయాలను ఒకవిధమైన శాస్త్రదోరణిలో చర్చించారు. సంఘంలో స్త్రీవితంతువులు అధికంగా ఎందుకు ఉంటున్నారో గణిత పద్ధతిలో సూచించారు. పుస్తకంలో వర్ణించిన ప్రధానమైన అంశాలను సామాన్యపాఠకులు ఎంతవరకు అర్థం చేసుకొంటారో ఊహించటం కష్టం. ఈ శాస్త్రంలో పరిచయమున్న వారికి పేలవంగానూ, పరిచయంలేని వాళ్లకు కొంత అయోమయంగానూ ఉన్నదేమో ననిపిస్తుంది. ఈ విషయంలో ఇంతగా కృషిచేసిన రచయిత అప్పుడప్పుడు తాను పత్రికలకు వ్రాసిన వ్యాసాలలో తృప్తిపొందక సమగ్రంగా వ్రాసి ఉంటే అందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉండేది. శాస్త్రిసంబంధమైన అనేక ఇంగ్లీషు మాటలకు తెలుగులో నామకరణం గ్రంథకర్త చేశాడు. ఇవి ఎంత వరకు సమంజసంగా ఉన్నదీ శాస్త్రజ్ఞులే నిర్ణయించాలి. సాధారణ వ్యక్తులకు మాత్రం ఇంగ్లీషు మాటలకు తెలుగు మాటలకు అట్టే భేదం కనబడదు.

"జయశ్రీ"

రచయిత: శ్రీ వజల వెంకటనరసింహారావు. సుందరరాం అండ్ సన్సు ప్రచురణ, తెనాలి. వెల రూ. 1-0-0.

ఇది ఒక కథలసంపుటి. పెద్ద కథలు, చిన్న కథలు, బుల్లి కథలు—అన్నీ కలిసి ఇరవైదాకా ఉండవచ్చు. రచయిత గై. డి. మొ. పా. సా. ను ఆదర్శంగా పెట్టుకున్నాడేమో నని పుస్తకం చదివిన ప్రతివాడికీ స్ఫురించక మానదు. కథావస్తువులోను, రచనలోను, పచ్చిశృంగారంలోను ఫ్రెంచికథకుడి అనుకరణ కనిపిస్తుంది. కాని కథను నడపడంలో గ్రంథకర్త కొంతవరకు నిపుణుడే నని చెప్పకతప్పదు. మొదలుపెట్టిన ప్రతికథను చివరదాకా చదివించగలడు. కాని కుటుంబంలో నలుగురూ ఒక చోట కూర్చుని బిగ్గరగా చదివే కథలు మాత్రం ఇవి కావు. ఖులా సాధోరణికి అలవాటు పడ్డవారికి ఈ పుస్తకం రుచించగలదని నిక్కచ్చిగా చెప్పవచ్చు.

కొత్త నవల

మా వారపత్రికలో వరుస వెంబడి ప్రచురించుటకు, ఆధునిక వాతావరణమునకు, అభిరుచులకు, అనుగుణ్యముగా నున్న, తమతమ ఉత్తమమైన స్వతంత్ర నవలలను పంపవలసినదిగా ఆంధ్ర నవలా రచయితలను కోరుచున్నాము.

సంపాదకులు.

"అపశ్రుతులు"

రచయిత: శ్రీ గోపీచంద్. ప్రజాసాహిత్య పరిషత్తు. తెనాలి. వెల రూ. 1-0-0.

'కరపురోజులు', 'భగ్నజీవితాలు' అనే రెండు నాటకాలను వేశపించగా అపశ్రుతులు తయారయింది. మొదటిది ఏకాంకిక. రేడియోలో ప్రసారమయింది. ఆకలి మనుష్యులను అమానుష ప్రవర్తనకు దారితీసేది ఘాటుగా ఈనాటకం వ్యక్తం చేస్తుంది. ఒకస్త్రీ భర్తకోసం జీవితాన్నంతా నాశనం చేసుకుని, ఆకలితో మాడి, తన్నుతాను అమ్ముకుని సంపాదించి పెడుతుంది. చివరకు ప్రాణాలుకూడ ఇస్తుంది. భర్త కేవలం ఒక పిశాచం. ఈ ప్రపంచాన్ని అసహ్యించుకోవాలని తెలుసుకు నేప్పటికి ముప్పయియేళ్లు పట్టిందంటాడు. జీవితాన్ని జయించటానికి దయాదాక్షిణ్యాలను త్రోసిపుచ్చెయ్యాల లంటాడు. చచ్చిపోయిన భార్యను, కుష్ఠించిపోయిన బిడ్డను వదలిపెట్టి వెళ్లిపోతాడు. ఈ నాటకం చదివిన తరువాత ఒక విధమైన గుబులుగా ఉంటుంది. ఒక విధమైన మనోవైకల్యము, మానవు లంటే అసహ్యత ఉన్నవాళ్లుగాని దీనిని మెచ్చుకోలేరు. 'భగ్నజీవితాలు' మూడంకాలనాటకం. సుప్రసిద్ధ ఆంగ్లరచయిత ప్రీస్ట్లి వ్రాసిన ఒక నాటకాన్ని ఆధారం చేసుకొని వ్రాసినట్లు తోస్తుంది. జీవితానికి ఆదర్శమంటూ ఉండాలనీ, సంపూర్ణ మానవత్వం పొందటమే ఆ ఆదర్శమనీ, ఆదర్శంలేని కామప్రధానమైన వివాహాలు అసంతృప్తికీ విచ్ఛేదానికీ దారి తీయగలవని రచయిత వివరిస్తాడు. పాత్రపోషణ బాగానే ఉన్నదిగాని నాటకంలోని దృక్పథం కొంచెము వికలంగా ప్రసరించింది.

'రవి'

గ్రంథ స్వీకారము

యువకమతము

శ్రీ వి. పి. రాజు, మళ్ళపూడి సత్యనారాయణగారలు. ప్రచురణ: శ్రీ ఆంధ్ర యువజన సంఘము, బి. యన్. రైల్వే, ఖర్గపురము. దేశసేవ చేసే యువకుల ఉత్సాహాలకు సరియైన మార్గము చూపు ఉద్దేశంతో కూర్చిన వ్యాసాలు యువక పతాకం అని ఇంద్రధనుస్సు చిహ్నంతో త్రివర్ణ చిత్రం పుస్తకం మొదనులో ఉంది. పతాక వర్ణనము, యువకుని—మతము, విద్య, స్వాతంత్ర్యము, యాత్ర మందిరము, అను వ్యాసాలూ, శక్తి స్తోత్ర గీతాలూ ఉన్నాయి. వెల లేదు.

హిందీ స్వబోధిని

1,2 భాగాలు: తెలుగువారు ఎక్కువ కష్టపడకుండా, తీరికగా, స్వయంగా హిందీ నేర్చుకొనేందుకు, అనువుగా రచించబడ్డ ప్రథమ భాషాబోధినులు. వ్యాకరణం బాధ చాల తక్కువ. సంయుక్తాక్షరాలు మొదలైనవి గుర్తుంచుకొనేందుకు, నిత్య అవసరంలో వచ్చే సంభాషణలు మళ్ళీ మళ్ళీ వంటపట్టేందుకు రచయితలు చక్కగా శ్రద్ధ తీసుకొన్నారు. ప్రయోజనాలు తేలికగా హిందీ నేర్చుకొనేందుకు వీలయిన కృషి. ప్రకాశకులు: పుస్తకశాల, మదరాసు 4.

కథలసంపుటి

అనువాదరచనల సంపుటి., రచయిత యద్దనపూడి సూర్యనారాయణమూర్తి. "కఠిన హృదయం, స్వప్నసామ్రాజ్యం ప్రేమనాటకంలో ప్రథమరంగం, అదృష్టం అంటే" అని నాల్గు కథ లున్నాయి. ప్రచురణ యూనివర్సిటీ బుక్ సర్వీసు. సౌరాష్ట్రనగర్ మదరాసు. వెల రెండు అణాలు.

నేతాజీ

పద్యకావ్యము. జి. జాషువ.

నారాయణ భట్టు

(6 వ పేజీ తరువాయి)

"ఎవరే కథ చెప్పమనిన నా కథ చెప్పవారము; మాకు శిక్ష విధించు శేమి, మహారాజా!" అని నాగరాజు లడిగిరి.

రాపర్తి బేతినాయకుడు ప్రమాణము చేసి వారి దుష్కార్యములన్నియు వివరించెను. నాగగాథ చెప్పుటలో నవ్యాపదేశముగా రాజరాజనరేంద్రులను విద్రోహము బోధించిరనియు జెప్పెను. వారు మగ్గురకు మరణశిక్ష విధించి వారి శిరస్సులుకూడ సంఘారామమునందు నాగగాథ చెప్పినచోట నెత్తున వ్రేలాడగట్ట నాజ్ఞాపించెను.

అది యుద్ధభూమిలో జరుగు విచారణ. అక్కడ సామాన్యాధికరణములందువలె నెమ్మదిగా విచారించు నవకాశము లేదు. దోషులు చేసిన దుర్మార్గములు బహిరంగముగా జరిగెను. దాని ఋజువుకు దీర్ఘ సాక్ష్యము లవసరము లేదు. శిక్ష వెంటనే కఠినముగా విధింపనిచో రాజధర్మము రాజదండము హాస్యాస్పదమగును! ఆ దినమున మరి యెందరనో రాజభటులు రాజరాజుముందు నిలువబెట్టిరి.

ఆనాడు విధించిన సామూహిక శిక్ష శిరచ్ఛేదము. ఆ శిరచ్ఛేదమును సారంగధరుని మెట్ట సంఘారామమునందే జరుపుట కాజ్ఞ యయ్యెను. ఆ యాజ్ఞలును వెంటవెంటనే నిర్వహింపబడెను. నాగరాజుల నాగగాథతో మారుమ్రోగిన యా పైదాన మానాడు రాజద్రోహుల శిరస్సులు తెగుచున్న శబ్దములతో ప్రతిధ్వనించెను.

శిక్షలు పూర్తియైనపిమ్మట రాజరాజు శాసనమును వైతాళికుడిట్లు ప్రకటించెను.

"సారంగధరుని మెట్ట సంఘారామము సకల చరాస్తులతోకూడ ప్రస్తుతము రాజోద్యోగులే స్వాధీనము చేసికొందురు. ఇక నైదు సంవత్సరములవరకు దాని ఆదాయమంతయు దాక్షారామ భీమేశ్వరాలయమున ఉత్సవాదులకు వినియోగింతురు. ఆ పిమ్మట తగిన బౌద్ధభిక్షువులు లభించునెడల నా యాస్తి యంతయును సంఘారామమును బౌద్ధసంఘమువశము చేయుదుము. అంతవరకు నందు ప్రతిష్ఠించిన విగ్రహములకు నిత్యనైవేద్యదీపారాధనలు రాజోద్యోగులే యొక శ్రమణుని పెట్టి చేయించెదరు. బుద్ధదేవుని కట్టి బాధయు లేకుండ నప్పటి రాజమహేంద్ర నాథుని నధికారిగా నియమించుచున్నాము!

"రాజద్రోహులుగా శిక్షింపబడినవారి సర్వస్వమును మా ఉద్యోగులు స్వాధీనము చేసికొని యది యంతయు విద్రోహులవలన ధనప్రాణములు కోల్పోయిన నిర్దోషులకు నష్టపరిహారముగా నిప్పింపదము. దానికితోడు మా కోశము నుండికూడ బహుధనము నిప్పించుటకు మా కరణాధ్యక్షుల కాజ్ఞాపించుచున్నాము.

"ఇక నిన్నటి దినమున తాత్కాలికావేశముతో గంతులు వేయుచు స్వయముగా దుష్కార్యములు చేయనివారు పలువురున్నారు. అట్టి వారిని సర్వలోకాశ్రయ విష్ణువర్ధన రాజరాజ మహారాజులు కొద్దితప్పు చేసిన పుత్రులను అపార కృపాతిశయముచే మన్నించు తండ్రివలెనే క్షమించి యికముందు అట్టివారిని తమతమ దేహములను మనస్సులను స్వాధీనములో నుంచుకొనవలసినదిగా నాజ్ఞాపించుచున్నారు.

"సువర్ణద్వీపయాత్ర చేయదలచినవారికి రేవుపల్లెలో రాజనావలు సిద్ధముగనున్నవి. బౌలీ విద్రోహులవలననుండి నిప్పుడటకు మరలి వారలు క్షేమముగా వచ్చిన వెంటనే వారిని పంపి వేయుదురు. అంతవరకు ఆధారము లేనివారందరు నీ చేబ్రోలు క్షేత్రమున ప్రతిష్ఠాపితమైన ధర్మశాలలలో భోజనము సుఖముగా చేయవచ్చును!"

ఆ ప్రకటనము విన్న జనసమూహమున రాజభక్తితో గూడిన యానందబాష్పములు వెల్లివిరిసెను.

రాజరాజు వ్యగ్రుడై యెవరిరాక కొరకో నిరీక్షించుచుండెను. సూర్యాస్తమయము సమీపించుచుండెను. ఆ పిమ్మట స్వల్పకాలముననే వచ్చు సోమగ్రహణసమయమున స్నానదానాదికము చేయవలెను!

ఇంతలో గురునాథశ్రేష్ఠి లేచి రాజానుజ్ఞనొంది రాజరాజు పాదపీఠి యొద్దకు వచ్చి వందనము చేసి కుమారస్వామి తనయొద్ద నుంచిన వజ్రకంఠిక పాదపీఠిపై నుపహారముగా నుంచి యిట్లు చెప్పెను:

"కుమారస్వామి పకమ నన్ను ఋణవిముక్తుని గావించుటగా రాజబంధువులను గౌరవముతో విశేషముగా ఋణమిచ్చియుంటిని. కాని నిన్నటి దినమున జరిగిన విద్రోహకాండనే నా ధనములో కొంత యాజ్ఞానాశమున నపయోగపడియుండవచ్చునని సందేహము కలుగుచున్నది. అజ్ఞానముచేనే ప్రమాదము చేసితిని. అందు దాని నిర్వృతికొరకు వారు నాకడ నా ఋణమునకై కుదువపెట్టిన యమూల్యమగు నీవజ్రాలకంఠిక విష్ణువర్ధనమహారాజులకు ఉపహారముగా సర్పించుకొన ననుజ్ఞ వేడుచున్నాను."

శాంతముగా రాజరాజిట్లు సెలవిచ్చెను.

"శ్రేష్ఠీ! అకంఠికమాత్రమే కాదు. నీకు మేము మన్ను ప్రసాదించిన ఛత్రచామరములును సమస్త గౌరవలాంఛనములునుగూడ తిరిగి గ్రహింపదలచినాము."

గురునాథశ్రేష్ఠి దండప్రణామము చేసి నిలువబడి తనకున్న గౌరవచిహ్నములన్నియు నొక్కటొక్కటే రాజరాజు పాదపీఠముపై సమర్పించెను.

అంతట రాజరాజు గురునాథశ్రేష్ఠి ప్రతిష్ఠాయి ధాన్యశ్రేష్ఠిపతి యగు నాగదత్తశ్రేష్ఠిని రమ్మని సంజ్ఞ చేసి యా గౌరవములన్నియు నాతనికి ప్రసాదించి యలంకరింపజేసెను. ఒక్కసారిగా నా వర్తకశాఖ పూర్తిగా ఋషవారమున గురునాథుని శ్రేష్ఠిపదవి నాతని త్యజించి నాగదత్తశ్రేష్ఠిని వరించెను.

వజ్రకంఠికను రాజాజ్ఞచే కనకాధ్యక్షునకు వజ్రపరీక్షకులును తీసి పరీక్షించిరి. వారు అందరాలోచించి, "ఋషి వేంగీనా ళుక్య ప్రభువులకు కులక్రమాగతముగా కుబ్జవిష్ణువర్ధనుల నాటినుండివచ్చిన యమూల్యకంఠిక. దీని నాట యేబది సంవత్సరముల క్రిందట కుంతల చాళుక్యులు హరించిరి. ఇది చక్రవర్తి ధరింపదగినది!" అని యేకగ్రీవముగా నివేదించిరి.


ఇంతలో గోదావరీనదిమీదనుండి జయభేరి వినిపించెను. రాజరాజు మంగళములు పాడుచు తూర్యనాదములు మ్రోగెను. ఆ ప్రదేశమునకు సమీపమున నున్న రేవున పర్యంకాలంకారశోభితమగు నొకనావ యాగెను. అందుండి యువరాజ రాజేంద్రదేవుడు జయలక్ష్మి మూర్తీభవించినట్లు తేలెంచెను. అతనివెంట పురోహితుడు నడచుచుండెను. దక్షిణపార్శ్వమున నారాయణభట్టు ఆనందము విరిసిన ముఖముతో వచ్చుచుండెను.

యువరాజురాక నివేదింపగనే రాజరాజు పూర్ణకుంభహస్తుల నాతనికెదురంపి వెంటనే తన సన్నిధికి రమ్మని యాజ్ఞాపించెను. యువరాజ రాజేంద్రదేవుడు ఆపేరకు వచ్చి పితృదేవుల పాదముల కభివందనము చేసి ధారాస్వామిని సమ్మతి పత్రము నర్పించెను. రాజరాజనరేంద్రుడు కుమారుని నాశీర్వదించి తన దక్షిణపార్శ్వమునకు పిలిచి ప్రేమతో నాతని శిరము స్పృశించెను.

"మా వజ్రకంఠిక చక్రవర్తియోగ్యమైనదని వజ్రవిదులు పలుకుచున్నారు. ఇంత శీఘ్రముగా చక్రకోట్యమును జయించిన నీవు చక్రవర్తివి కాగలవు!" అని రాజరాజాశీర్వదించుచు నా వజ్రకంఠిక యాతని కంఠమున నలంకరించెను. బ్రాహ్మణబృందము తథాస్తువచనములు పలికెను.

"నారాయణభట్టారకా, మీ రీ రాత్రికి మా యతిథులు. మీ కొరకెంతసేపటినుండియో నిరీక్షించుచుంటిని. ఈ చంద్రగ్రహణసమయమున మిమ్ము గోదావరీమండలమున నొకగ్రామము దానము చేయదలచినాము. మీ రది స్వీకరింపవలసినదని మా అభ్యర్థనము!" అనెను రాజరాజు!

నారాయణభట్టు సమ్మతించెను. కాని యాతని ముఖమున విషాదరేఖ యించుక యావేశించినట్లు తోచెను.



పటేల్‌తో గాంధీజీ

"ని ధర్మపత్నియు కుమార్తెయు క్షేమముగా నున్నారని నిశ్చయవార్త వచ్చినది. ఈయాలక్షణులు లేకున్న నప్పటికీవరకే వచ్చియుందురు!" అనెను రాజరాజు.

నారాయణభట్టుముఖము నిండుగా వికసించెను.

ఆ రాత్రి నాలుగుగడియలు ప్రొద్దుపోవునప్పుడు కేతుగ్రస్తసోమోపరాగము కాన నయ్యెను. రాజరాజు కోటిఫలి క్షేత్రమున అఖండగోదావరీనదీ స్నానమాచరించి హరితసంస్తుడును అపస్తంబసూత్రుడును నగు నన్నె నారాయణునకు రెండేలూరు నడిమి వినయామున నందంపూడి గ్రామమును అగ్రహారముగా నిచ్చి సర్వకరపరిహారముగా ధారాపూర్వకముగా దానము చేసెను.

లేఖలు:

సరిహద్దు నిర్ణయసంఘం - ఒరిస్సా ఆంధ్రులు

ఆర్యా,


ఈ నెల 14 వ తేదీ 'ఆంధ్రపత్రిక' వారపంచికలో "సరిహద్దు నిర్ణయ సంఘం వారి కర్తవ్యము" అను శీర్షిక క్రింద శ్రీ డాక్టరు మామిడిపూడి శ్రీరంగాచార్యులు వారు వ్రాస్తూ, ఆంధ్రరాష్ట్రము "గంజాం జిల్లాలోని 'ఋషికుల్య' నదిమొదలు చెంగల్పట్టు జిల్లాలోని దక్షిణప్రదేశము వరకు తెలుగువారిది అని కలదు" అని తెలిపియున్నారు. ఈ విషయము ప్రస్తుత సమయాన ప్రకటించి ఆంధ్రుల దృష్టికి తెచ్చినందుకు ఆంధ్రులందరును-అందులో ముఖ్యముగా గంజాం జిల్లాలోని ఆంధ్రులును, శ్రీ డాక్టరు గారికి కృతజ్ఞులు. ఆంధ్రదేశం ఋషికుల్య వరకు వున్నదియూ, ఆ ప్రదేశములో వున్న ఛత్రపురం, బరంపురం అన్యాయంగా, అక్రమంగా, ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఒరిస్సా రాష్ట్రములో చేర్చి ఆంధ్రులకు ఘోరమైన అన్యాయము బ్రిటిషు ప్రభుత్వం చేసింది. ఆ ప్రాంతాలను తిరిగి ఆంధ్రరాష్ట్రములో చేర్చవలసినదని గంజాం జిల్లా ఆంధ్రులు తీవ్ర ఆందోళనం చేస్తూవున్నారు. ఈ పరిస్థితులలో శ్రీ డాక్టరు గారి సూచన అంధకారములో మెరుపు తీగవలె చక్కని దారి చూపినది. చారిత్రాత్మకముగా కూడ మా ఆందోళన సహేతుకముగా వున్నది.

1931 సెన్సు రిపోర్టులో కూడ ఋషికుల్యా నదివరకు ఆంధ్రులు వున్నారనియు, సముద్రతీరమునుండి పశ్చిమం సుమారు 10, 12 మైళ్ళు, వున్న ప్రదేశం ఆంధ్రులచే నివసింపబడుచున్నదనియూ—ఋషికుల్యానదికి ఉత్తర ప్రదేశము ఓఢ్రదేశమనియు, అప్పుడు సెన్సు కమీషనరుగావున్న యీట్సు (Mr. Yeatts) దొరగారు వ్రాసియున్నారు.


శ్రీ డాక్టరు శ్రీరంగాచార్యులు వారు దయచేసి మెకంజీ వారు వ్రాయించిన ఏ గ్రంథంలో పైని వారు వ్రాసిన భోగట్టా దొరకుతుందో ప్రకటించకోరాను. అంతేకాక యీ విషయం యావదాంధ్రులకు సంబంధించినది కనుక, ఆంధ్రనేతలు శ్రద్ధవహించి ఇట్టి చారిత్రాత్మకమైన విషయపరికరాలను సేకరించి ఒరిస్సారాష్ట్రములో చేరిన ప్రాంతాలను తిరిగి ఆంధ్రరాష్ట్రములో కలుపుటకు సకలప్రయత్నములను చేస్తారని నమ్ముతున్నాను.

బోడపాటి సత్యనారాయణ.

మహాత్ముని జీవితానంతర దృశ్యాలు



మహాత్ముని అంతిమదర్శనార్థం లక్షలాది ప్రజలు రావడం ప్రారంభించినందున గతనెల 31 తేదీ రాత్రి గాంధీజీ అందరికీ కనబడేటట్లుగా బిర్లాభవనంపై అంతస్తుమీద ప్రత్యేక వేదిక పైకి తెచ్చివుంచినప్పటి దృశ్యం



హంతకుని పైశాచికకృత్య ఫలితంగా ఢిల్లీ-బిర్లా భవనావరణంలో గాంధీజీ రక్త స్రవంతిచే పునీతమైన ప్రదేశానికి చుట్టూ వెదురుగడలు పాతి, ఎవరూ అక్కడికి రాకుండా శ్రద్ధతీసుకుంటున్నారు



మహాత్ముని కంటికి రెప్పవలె కనిపెట్టుకొని కాస్తూ ఉండిన డాక్టర్ సుశీలానయ్యార్ దుఃఖం భరింపలేక కన్నీరుకార్చుచుండగా ఓదారుస్తున్నారు





[illegible] నెహ్రూ, సర్దార్, దేవదాసు గాంధీలు చితిఅమర్చిన వేదికపైకి ఎక్కి అస్థిసంచయనం జరుపుతున్నారు.

Regd No. M 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7 ThambuChetty St., G T. Madras.

Q. H. M. S. No. 857—10,000 Copies.